
# కథామంజరి

## పది కథల సమాహారం











**సంక్రాంతి ప్రత్యేక సంచిక**

**జనవరి 2025**

# కథామంజరి

## పది కథల సమాహారం



మూర్తి గారు

**జనవరి 2025**

సంపుటి : 6 ♦ సంచిక : 1





# అందరికీ
# ఆంగ్ల వత్సరాది
# మరియు
# సంక్రాంతి
# శుభాకాంక్షలు

# కథామంజరి

## 'శ్రీమతి పోడూరి నాగమణిశ్రీ' స్మారక సంక్రాంతి కథల పోటీ 2025 – ఫలితాలు

**1 ప్రథమ బహుమతి**
**చక్రభ్రమణం**
రాజమోహన్ ఇవటూరి

**2 ద్వితీయ బహుమతి**
**శస్త్రచికిత్స**
గంటి రమాదేవి

**3 తృతీయ బహుమతి**
**మంచు తెరలు**
గొర్తి వాణి శ్రీనివాస్

### ప్రోత్సాహక బహుమతులు

1. ఆమె నడిచిన దారి (గండ్రకోట సూర్య)
2. మూర్తీ - రావూ - వసంతలక్ష్మీ (వసుంధర)
3. మనసులోని మర్మం (సి. యమున)
4. గమ్యం – గమనం (సింహప్రసాద్)
5. 'వినదగదు' నెవ్వరు చెప్పిన.. (విజయార్కె)
6. సుఖాభిలాషి (పెనుమాక నాగేశ్వరరావు)
7. సర్దుబాటు (టి. వి. ఎల్. గాయత్రి)
8. ప్రయత్నం (మద్దూరి నరసింహమూర్తి)
9. దర్పణం (శింగరాజు శ్రీనివాసరావు)
10. తొలి సంధ్య వేళలో.. (జాస్తి రమాదేవి)

### సాధారణ ప్రచురణకు తీసుకున్న కథలు

1. సాక్షి (డా. ఎమ్. సుగుణరావు)
2. ఉత్తరాయణం (చొప్పదండి సుధాకర్)
3. మా రూటే సెపరేటు (డా. ఎం. కోటేశ్వరరావు)
4. అంతా మన మంచికే (ఎస్. హనుమత్ ప్రసాద్)
5. కళ్ళెం, (పొత్తూరి సీతారామరాజు)
6. సమ్మతమే (తెలికచెర్ల విజయలక్ష్మి)
7. వృద్ధం శరణం గచ్చామి (డా. కాలువ మల్లయ్య)
8. దశమ గ్రహం (గండ్రకోట సూర్య)
9. మానవత్వం ఖరీదు (బి. సత్యనారాయణమూర్తి)
10. కిటికీ (ఎస్.వి.ఏం. నాగ గాయత్రి)
11. పారిజాతం (వెంకటమణి)
12. పడి లేచిన కెరటం (యస్వి కృష్ణ)
13. వేటు (ఘండికోట విశ్వనాథం)
14. స్వర్ణ కాలం (వి. రాజరామ్మోహన రావు)
15. మహర్దశ (దినవహి సత్యవతి)
16. తెరచిన కిటికీ (బి. నర్సన్)
17. మనం కల(సి) విడిగా..(కే.ఎన్.వి. అంజనేయులు)

ఈ పోటీలో ఉత్సాహంగా పాల్గొన్న రచయితలకు, రచయిత్రులకు.. సకాలంలో బహుమతుల కథలను ఎంపిక చేయడానికి సహకరించిన న్యాయనిర్ణేతలకు ధన్యవాదాలు!

పైన పేర్కొన్న బహుమతులు పొందిన కథలు, సాధారణ ప్రచురణకు స్వీకరింపబడిన కథలు.. తప్పితే, ఈ పోటీకి పంపిన మిగతా కథలేవీ స్వీకరింపబడలేదని, ఆయా రచయితలు గమనించవలసిందిగా కోరుతున్నాం.




**కథామంజరి బృందం**






# మా జట్టు

సంపాదకుడు

జయంతి ప్రకాశ శర్మ

ప్రచురణ కర్త

అవసరాల వెంకటరావు

సంపాదక సహకారం

ఎం.ఏ. పద్మనాభరావు
కృపాకర్ పోతుల
నండూరి సుందరీ నాగమణి

ప్రచురణా సహకారం

ఎం.ఎల్. కాంతారావు

సాంకేతిక సహకారం

Harbinger Publishing

బొమ్మలు

కొయిలాడ రామ్మోహనరావు
కొచ్చెర్ల వి.ఆర్.
సూరంపూడి చలపతిరావు



# కథామంజరి శ్రావ్యసంచిక

## ఈ నెల శ్రావ్యసంచికకి సహకారం అందించిన గళాకారులు

శ్రీ /శ్రీమతి /కుమారి

- పప్పు భోగారావు గారు
- వెంపటి కామేశ్వరరావు గారు
- భువనపల్లి రంగనాథం గారు
- కరవది సరస్వతి గారు
- బి.ఎస్. మూర్తి గారు
- అవసరాల రాఘవరావు గారు
- లలితా గోవిందరాజు గారు
- భమిడిపాటి శరత్ జ్యోత్స్నగారు
- అవసరాల వెంకటరావు గారు
- చీమలపాటి శ్రీనివాసరావు గారు
- సమ్మెట ఉమాదేవి గారు

శ్రావ్యసంచిక కొరకు ఇక్కడ నొక్కండి




## శీర్షికలు


| | |
|---|---|
| కథాకీయం | i |
| శ్రేయోభిలాషి మూర్తిగారు | ii |
| కథా పరిచయం | iii |
| వినదగునెవ్వరు చెప్పిన | vi |


## కథలు, వ్యాసాలు


| | | |
|---|---|---|
| చక్ర భ్రమణం | రాజమోహన్ ఇవటూరి | 1 |
| శస్త్రచికిత్స | గంటి రమాదేవి | 8 |
| మంచుతెరలు | శ్రీమతి గొర్తి వాణిశ్రీనివాస్ | 13 |
| ఆమె నడిచిన దారి | శ్రీ సూర్య గండ్రకోట | 19 |
| మూర్తీ- రావూ- వసంతలక్ష్మీ | వసుంధర | 26 |
| మనసులోని మర్మం | సి. యమున | 32 |
| గమ్యం – గమనం | సింహప్రసాద్ | 41 |
| 'వినదగదు'నెవ్వరు చెప్పిన | విజయార్కె | 49 |
| సుఖాభిలాష | పెనుమాక నాగేశ్వరరావు | 56 |
| సర్దుబాటు | టి.వి.యెల్. గాయత్రి | 63 |


Greetings Photo courtesy : Sakshi Post

# కథాకీయం



ఒకప్పుడు కథల పోటీలు ఏడాదికి ఒకటో రెండో కనబడేవి. వాటి కోసం అటు పత్రికలవాళ్ళు, ఇటు రచయితలు యజ్ఞం చేసినట్లు కృషి చేసేవారు. ముద్రణా పత్రికలు బాగా తగ్గిపోయిన తర్వాత.. కొద్ది కాలం క్రిందట వరకు పోటీల సంఖ్య బాగా తగ్గిపోయింది. తిరిగి అంతర్జాల పత్రికలు విరివిగా రావడం ప్రారంభం అయిన తర్వాత, ఇటీవల కాలంలో, తెలుగునాట ఏడాది పొడవునా పత్రికలు, సాహితీసంస్థలు సాహిత్యప్రక్రియలలో పోటీలను నిర్వహిస్తున్నాయి! పోటీలకి వచ్చే కథల 'వాసి' తగ్గినా, 'రాశి' బాగా పెరిగింది. రాసిన ప్రతీ అక్షరం 'పోటీ కోసమే' అనే ధోరణి రాను రాను పెరుగుతోంది. దానికి తోడు ఈ మధ్యకాలంలో అనుకరణలు కూడా పెద్ద సమస్యగా ఉన్నాయి. లక్షలాది కథలలో అనుకరణలని గుర్తు పట్టడం చాలా కష్టమైన పని! ఈ పరిస్థితికి కొంత కారణం.. రచయితలలో తగ్గిన నైతికత, మరింత పరిజ్ఞాన లోపం అని చెప్పాలి.

వ్యాపారాపేక్ష లేకుండా, పత్రిక నడపడమే ఓ సామాజికసేవగా భావిస్తున్న రోజుల్లో.. పోటీలు నిర్వహించడానికి ఎక్కువ పత్రికలకు ఆర్థిక స్తోమత లేదు. అయినా సరే, తెలుగునాట ప్రతి ఏటా యాభై పైగా పోటీల నిర్వహణ జరుగుతోందంటే.. వాటి వెనుక వెన్నూ దన్నూ ఇస్తున్న ఎంతోమంది దాతల ఔదార్యమే కారణం. ఓ కథని బహుమతికి ఎంపిక చేయడానికి న్యాయనిర్ణేతల శ్రమ, అనుభవం, కథాసాహిత్యం మీద నేర్పు కనబడుతుంది. అలాగే పాఠకుల అలోచనలు, అభిరుచులు కూడా వాటి ప్రభావాన్ని చూపెడతాయి. కాని, ఈ పోటీ వెనుక ఉండి, బహుమతులు అందచేస్తున్న ఈ దాతల మనోభావాలను గురించి ఎవరు ఆలోచించడం లేదు! ఈ దాతలు బహుమతి పొందిన కథలని చూసి .. 'అయ్యో.. ఇలాంటి కథలకి నేను బహుమతులు ఇచ్చేనా..' అని చింతించకూడదు. వారికి సాహిత్యం మీద పరిజ్ఞానం లేకపోవచ్చును, కాని గౌరవం ఉంది. అభిమానం ఉంది. మంచి సాహిత్యాన్ని ప్రోత్సహించాలనే తపన ఉంది. వారికి అసంతృప్తి కలగకూడదు. కాబట్టి ఆ వర్గాన్ని కూడా సంతృప్తి కలిగించేలా కథలు రావాలి. దీనికి బాధ్యత నిర్వాహకుల, న్యాయనిర్ణేతలతో బాటు రచయితల మీద కూడా ఉంటుంది. నిజానికి వారిదే ఎక్కువ.

ఈ నేపథ్యంలో మా అనుభవం ఏమిటంటే... పోటీలకు వచ్చే కథల్లో పది పదిహేను శాతం కథలలో మాత్రమే ఆ పాటి, ఈ పాటి, పోటీ విలువలు కనబడుతున్నాయి. మిగతా అన్ని కథలూ 'పోటీ' అనే మాటకి విలువ లేకుండా చేస్తున్నాయి! వ్రాసిన ప్రతీ అక్షరం పోటీకే అనే ఆలోచన రాకూడదు. వ్రాసే ప్రతీ వాక్యం బహుమతికే అనే భావన రాకూడదు. ఈ విన్నపం ఎవరికో మీరే ఊహించుకోండి!

కథని, భాషని.. ముఖ్యంగా మనిషిని మనిషిగా బ్రతికించడానికి, ఉత్సాహ ప్రోత్సాహాలను అందిస్తున్న సాహితీప్రియులందరికి నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు!

**సంపాదకుడు**

### సకలజనుల శ్రేయోభిలాషి

# మూర్తి గారు

సాహిత్యం ఎలా పుట్టింది, ఎక్కడ పుట్టింది.. వంటి మూలాలను తెలుసుకోవడంతో పాటు, ఆ సాహిత్య సృష్టికర్తలను కూడా తప్పకుండా స్మరించుకోవాలి. అలాగే.. ఈ సాహిత్యం కొన్ని వందల సంవత్సరాల క్రిందట పుట్టి, బట్టకట్టి నేటికీ గుబాళిస్తూ, మానవాళి మనుగడకు ఊపిరినిస్తోందంటే.. ఆ వెనుక ఉన్న సాహిత్య పోషకుల గురించి కూడా తెలుసుకోవాలి. అలనాడు రాజ్యాలేలే రాజులు దగ్గర్నుంచి, నిన్నటి దేశపాలకుల వరకు ఎందరో మహానుభావులు తెరవెనుక నుండి ఈ పాత్రను పోషించారు. మారే కాలాలలో ఎందరో పాలకులతో పాటు, వర్తమానంలో సాహితీసంస్థలే కాకుండా, కొంతమంది దాతలు కూడా తెర వెనుకుండి సాహిత్యాన్ని పోషిస్తూ ప్రోత్సహిస్తున్నారు. దీనికి ప్రత్యక్ష ఉదాహరణ కథామంజరి వంటి పత్రికలే! గడిచిన నాలుగున్నర సంవత్సరాల కాలంలో.. కథామంజరి పల్లకిని మోసిన బోయీలెందరో ఉన్నారు. మనుగడకే కాదు, పోటీలు నిర్వహించడానికి కూడా వెనుక ఉండి ఆర్థికబలం అందిస్తున్న ఆ ఉదారులలో మొదటిగా చెప్పుకోవలసిన వదాన్యులు శ్రీ పి.వి.యస్.యల్.యన్. మూర్తిగారు. కథామంజరి ఆరంభం నుండి ఆదరిస్తూ, ప్రతీ ఏడాదీ వారి శ్రీమతి కీ.శే. నాగమణిశ్రీ గారి జ్ఞాపకార్థం కథల పోటీల నిర్వహణకు ఆర్థిక సహకారం అందిస్తున్నారు.

అమలాపురం దగ్గరున్న కూచిమంచి అగ్రహారంలో పుట్టి, పెరిగి, భౌతికంగా ఆరడుగుల ఎత్తుతో పాటు, హోదాలో కూడా ఎంతో ఎత్తు ఎదిగినా సరే.. ఒదిగుండే మూర్తి గారు, 1980 లో భారతీయ స్టేట్ బ్యాంక్ లో గుమస్తాగా ఉద్యోగ ప్రస్థానాన్ని ఆరంభించారు. అనతి కాలంలోనే అంచెలంచెలుగా చీఫ్ జనరల్ మేనేజర్ గా ఎదిగి, పదవీవిరమణ చేసారు. దేశంలోని అనేక రాష్ట్రాలలో వివిధ హోదాలలో పని చేసిన మూర్తిగారు, చివర్లో అస్సాం రాష్ట్రంలో చీఫ్ జనరల్ మేనేజర్ గా చాలాకాలం పనిచేసారు. ఆయన సామర్థ్యాన్ని, సేవలను గుర్తించిన బ్యాంకు, రిటైరయిన తర్వాత మరో రెండు సంవత్సరాలు ఆయన సర్వీసును పొడిగించింది. ఆ తర్వాత కూడా ఆయన సామర్థ్యాన్ని గుర్తించిన ప్రభుత్వం.. నార్త్ ఈస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కి సి.యమ్.డి. గా నియమించింది. ప్రస్తుతం గౌహతిలో ఆయన పని చేస్తున్నారు.

సాహితీకుటుంబంలో పుట్టిన మూర్తిగారు తెలుగు, ఇంగ్లీషు సాహితీ అభిమాని! ఉద్యోగ బాధ్యతలతో తలమునకలై ఉన్నా సరే, సమయం చిక్కించుకుని పుస్తకాలు చదివే అలవాటు ఉంది. సంగీతాన్ని ఆస్వాదించే మూర్తిగారికి నటనానుభవం కూడా ఉంది! దానికి తోడు, ఉద్యోగరీత్యా చాలా రాష్ట్రాల్లో పని చేసినప్పుడు, ఆయా రాష్ట్ర భాషలలో పట్టు సాధించారు. ఏ దేశమేగినా, ఏ రాష్ట్రమెళ్లినా.. మాతృభాషని, మాతృభూమిని మర్చిపోలేదు. సాంప్రదాయాలను, సనాతన ధర్మాన్ని విడనాడలేదు. ఏ ప్రాంతంలో పనిచేసినా.. అక్కడ ఎదురుపడ్డ తెలుగువాడ్ని పలకరించి, యోగక్షేమాలు కనుక్కొని, అవసరమయితే సహాయ సహకారాలు అందించే దాతృత్వానికి మరో పేరు మూర్తిగారు! దేశం నలుమూలలా ఆయనకి స్నేహితులు ఉన్నారు. ఒకసారి పరిచయం అయితే చాలు.. మర్చిపోయే ప్రసక్తి లేదు! నిజానికి ఆయన జీవితంలో చాలా భాగాన్ని స్నేహితులతోనే గడుపుతారు. ఓ అమ్మాయి, అబ్బాయి. వివాహాలు జరిగి, వారి జీవితాలలో ఉన్నతంగా స్థిరపడ్డారు.

పరోపకారార్థం ఇదం శరీరం.. అని భావించే శ్రీ పోడూరు వెంకట సత్య లక్ష్మీనరసింహమూర్తి గారు నిండా నూరేళ్ళు ఆయురారోగ్యాలతో తనకిష్టమైన శైలిలో జీవనం కొనసాగించాలనీ కోరుకుంటూ.. కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నాం!

**– కథామంజరి బృందం –**


కథామంజరి, జనవరి 2025

# కథా పరిచయం

## శ్రీ మధురాంతకం నరేంద్రగారి కథ "వెదురుపువ్వు"

మంచి తెలుగు కథకులలో మధురాంతకం నరేంద్రగారు ఒకరు. గత 35-40 సంవత్సరాలుగా తెలుగు సాహిత్యంలో తనదంటూ ఒక మార్కు వేసుకున్న రచయిత. జీవితానుభవాలను కళ్ళకు కట్టినట్లుగా వివరిస్తూ, మనిషి మనోభావాలలోని లోతుల్ని, పరిస్థితుల వల్ల వచ్చే మార్పుల్ని, తన కథల రూపంలో పాఠకుల ముందుంచుతారు నరేంద్రగారు. ప్రముఖ రచయిత మధురాంతకం రాజారాంగారి తనయుడవడం వల్ల రచనలు చేసే ప్రతిభ వారసత్వంగా వచ్చి వుండవచ్చేమో గాని, తనదంటూ ఒక ప్రత్యేక శైలి, శిల్పం ఏర్పరచుకున్నారు ఆయన చేసిన రచనలలో!

2008 ఆంధ్రజ్యోతి ఆదివారం సంచికలో వెలువడిన కథ ఈ 'వెదురుపువ్వు'. అదే పేరుతో ఆయన ఒక కథాసంకలనం కూడా వెలువరించారు.

వెదురుపువ్వు ఒక సగటు ప్రేమికుడి కథ. స్త్రీ, పురుషుల మధ్య కలిగే ప్రేమ అతి సహజమయింది. అయితే అన్ని ప్రేమ కథలూ ఒకలా ఉండవు. ఆ సంబంధం ఆ ఇద్దరికీ సంబంధించిన ఎన్నో అంశాల మీద ఆధారపడుతుంది. తను ప్రేమించిన చంచల మనసు తనదిగా చేసుకోవాలి. అయితే చంచల తనను ఎంతవరకు ప్రేమిస్తోందో తెలీదు. మనసులో అసందిగ్ధత. తను పాపికొండలు చూడడానికి లాంచీలో వెళ్తున్నానని చెప్పినప్పుడు, తనకి అక్కడ మాత్రమే దొరికేది, మరెక్కడా దొరకనిదీ, చూసినప్పుడల్లా తన లాంచీ ప్రయాణం గుర్తుకొచ్చేదీ.. కావాలంది. తను తేగలడా? చంచలను మెప్పించగలాడా? తనదానిగా చేసుకోగలడా? పెళ్లి గురించి అడిగితే ముందు ప్రేమ కావాలి కదా అంటుంది. ప్రేమిస్తున్నావా అంటే పెళ్ళి వద్దా అంటుంది. తన మనసుతో మృదువుగా ఆడుకుంటుంది చంచల.

లాంచీ ప్రయాణం మొదలయింది. పేరంటాలపల్లి ఆశ్రమానికి వెళ్ళడానికి లాంచీ ఆగింది. తను దిగడం ఆలస్యమయింది కొంచెం. చాలామంది చేతుల్లో వెదురు పువ్వులు కనబడుతున్నాయి. ఆదివాసీలు తాము తెచ్చినవన్నీ అమ్మేసినట్లున్నారు, వెదురు దబ్బలతో చేసిన ఆ పువ్వులు చూడ్డానికి పారిజాతాల్లాగా. గందమా గధాల్లా చాలా ఆకర్షణీయంగా కనబడుతున్నాయి. ఆలోచనలతో తను కొంచెం దారి తప్పాడు. ఓ చింతచెట్టు క్రింద ఓ రాతి పైన తల, గడ్డం మాసి కూచున్న ఓ వ్యక్తి తదేకంగా తన చేతిలోని వెదురు పువ్వును చూస్తూ కనబడ్డాడు. అందరూ ఇరవై రూపాయలకు కొంటే, పువ్వు యాభై అన్నాడతను. తను ఇరవయ్యేగా అంటే వెంటనే డెబ్భైకి పెంచాడా మనిషి. ఆదిమవాసులలోకి కూడా వచ్చిన వ్యాపార లక్షణాలా? అవసరాన్ని బట్టి ధర ఎంలా పెంచుతున్నాడో! వెళ్ళి లాంచీ ఎక్కబోతుండగా మళ్ళీ కనిపించాడా గడ్డపు మనిషి. చంచలకి ఈ పువ్వుని ఇవ్వచ్చుగా, ఎంత ఖర్చయితేనేమిటి? సరే, యాభై రూపాయలిచ్చి కొనబోతే ఆ మనిషి "నూరు" అన్నాడు. "మంత్రాల వెదురుతో చేశాను దీన్ని... భవిష్యత్తు చెప్పే పువ్వు. యే కోరికతో దీన్ని కొంటారో ఆ కోరిక తీరేదైతే ఇది రేకులు విప్పుకుని పుష్పిస్తుంది. లేకపోతే యెప్పటికీ మొగ్గగానే ముడుచుకుని ఉండిపోతుంది ఇలా.." అంటూ దాని వెల నూటయాభైకి పెంచేస్తాడు ఆ గడ్డపు మనిషి. లాంచీవాడు తొందర చేస్తున్నాడు. అంత డబ్బూ ఇచ్చి ఆ పువ్వును కొంటున్నప్పుడు, ఆ మనిషి మళ్ళీ ఆ పువ్వును జాగ్రత్తగా నలగకుండా తీసుకు వెళ్ళాలని, గమ్యం చేరేక తనని తల్చుకుని

ప్రార్థన చేస్తే, కోరిన కోరిక తీరేదైతే తన చేతుల్లోనే పుష్పిస్తుందని, ఈ లోపల బలవంత పెడితే వున్నది కూడా జారిపోతుందని చెప్తాడు.

నావ బయల్దేరింది. తను ఆ పువ్వుని జాగ్రత్తగా పట్టుకున్నాడు. కొందరు పువ్వుల్ని తమకు ఇష్టమైన రీతుల్లో నలిపేస్తున్నారు, రేకల్ని తుంపుతున్నారు, కొందరు పసిపిల్లలు ఆ పువ్వులు తమకు కావాలని ఏడుస్తున్నారు. తనైతే జాగ్రత్తగా పట్టుకుని కూర్చున్నాడు. అవును, రేకలు విడిపోకూడదు. ముందస్తుగా విచ్చుకోకూడదు. దీనితో చంచల ప్రేమ తనకు దక్కుతుందా? పువ్వు కొని తను మోసపోలేదు కదా! టాయిలెట్టుకెళ్ళాలన్నా కదల్లేకుండా ఉన్నాడు. పువ్వు ఇందరి మధ్యలో నలిగిపోతే? ఇబ్బందిగా ఉంది. శరీరం వేధిస్తోంది. భోజనాలకి లాంచీ గట్టుకి చేరంగానే ఒక్క అంగలో పరిగెత్తి, పువ్వుకున్న పుల్లను ఇసకలో గుచ్చి తన అవసరం తీర్చుకుని, గబగబా భోంచేసి మళ్ళీ పువ్వును జాగర్తగా పట్టుకుని లాంచీలో కూర్చున్నాడు.

ఆలోచనలన్నీ చంచల మీదే. పువ్వు మీదే. రెంటికీ సంబంధముందా?

లాంచీ ఆగింది. భద్రాచలానికి బస్సులో వెళ్ళాలి. చాలా రద్దీగా ఉంది. ఎలాగోలా సూట్ కేసుని బస్సు పైకి పంపించి, తను డ్రైవరుని బతిమిలాడి అతని సహాయంతో బాయినెట్ పైన కూర్చున్నాడు. బస్సు కుదుపులతో ఒకసారి వెళ్ళి గేర్ రాడ్ పైన పడి తలకు గాయం తగల్చుకున్నాడు రక్తం వచ్చేలా. అయినా పువ్వు జాగర్తగానే వుంచగలిగాడు.

బస్సు పైనుండి సామాను దించుతున్నప్పుడు, కూలీ చేతులోంచి సూట్ కేసుని లాక్కొని పరిగెత్తి వెళ్ళిపోయాడొక దొంగ. డబ్బు జేబులో ఉండడంతో, సూట్ కేసు పోవడం అంత బాధ కలగలేదు తనకి. దగ్గరలోనే ఒక కొట్లో పువ్వుకి సరిపడా ఒక అట్టపెట్టెను రెండొందలకి కొని ఇక ముందుకు పోకుండా ఊరికి తిరుగు ప్రయాణానికి నిర్ణయించుకున్నాడు. మరో వంద రూపాయలతో ఓ డాక్టరుగారి దగ్గర తలకి కట్టు కట్టించుకున్నాడు. తన ఊరి బస్సు ఎదురుగానే ఉంది.

ఊరికి చేరుతూనే చంచల ఇంటికి వెళ్ళాడు. ఆమె ఇంట్లో లేదు. ఎప్పుడు నిద్రలోకి జారుకున్నాడో తెలీదు తనకే. మెలకువ వచ్చేసరికి ఎదురుగా చంచల. "ఇంత దూరం వెళ్ళి ఇదా తెచ్చింది, ఈ వెదురు బొమ్మనా?" అడుగుతోంది చంచల. ఇది మామూలు పువ్వు కాదంటే మళ్ళీ చంచల "పుష్పించిన పువ్వుగానైనా చెయ్యడం తెలీదా? ఆ పని గూడా నేనే చెయ్యాలా?" అని. ఆ రేకుల్ని బలవంతంగా విప్పితే... మరి ఆ గడ్డం వాడు చెప్పిన మాటలు? అన్ని రేకులనూ వంచి అందంగా చేశానని చెబుతోంది చంచల. మరి ఆ గడ్డం వాడు చెప్పింది చెప్పగలాడా?

గడ్డం వాడిని గంధర్వుడే అని అనుకుంటే తన ప్రేమ సఫలం గాలేదని చెప్పవలసివుంటుంది. అతడ్ని మామూలు మనిషిగా భావిస్తే తన ప్రయత్నమంతా అవివేకంగా తయారవుతుంది. చివరగా కథానాయకుడు అనుకున్న మాటలివి:

"మేమిద్దరమూ ప్రేమ అన్న భావనను మాత్రమే ప్రేమిస్తున్నామా? నిజానికి మా ఇద్దరి ప్రేమల్లోనూ నిజాయితీ లేదా? సత్యాసత్యాలతోనూ, నిజానిజాలతోనూ, కల్పనావాస్తవికతలతోనూ తయారుచేసిన బొమ్మలా బలవంతంగా విరిసిన వెదురుపువ్వు నాకేసి జాలిగా చూడసాగింది."

స్త్రీపురుషుల మధ్య సంబంధాలు కొత్త విషయాలు కావు. అయితే కథ ఆ సంబంధాలతో మొదలవుతుంది. అతనికంటే ఎక్కువ తెలివితో, అతనితో చిలిపిగా ప్రవర్తించగలిగే స్త్రీ, అలాంటి ఆమె తనని ప్రేమించాలనుకునే పురుషుడు, వీరి మధ్య జరిగే స్పందన, ప్రతిస్పందన ఎలా ఉంటుందో, ఆమె ప్రేమను పొందాలనుకునే ఆ వ్యక్తి మనసు పడే ఆరాటం, ప్రేమ ఉందో

లేదో తెలియని సందిగ్ధత, జీవితాన్ని ముందుకి తీసికెళ్ళే ఆశాభావం, వీరి మధ్య జరిగే సంవాదంలో మనసు చూపే బలహీనత, తెలియకుండానే పెరిగే నమ్మకాలు, ఆ నమ్మకం నిజమో, కాదో చెప్పలేని మరో సందిగ్ధత.. ఇవన్నీ ఈ కథకు మూలస్తంభాలే. చిన్న సంభాషణలతోనే, రచయిత పాత్రల వ్యక్తిత్వాలను స్పష్టంగా పాఠకులముందుంచారు. మానవ సంబంధాలు, మనిషి ఆలోచనలలోని సంక్లిష్టతను నరేంద్ర గారు అతి సహజంగా ఈ కథలో చెప్పడం జరిగింది. అది ఆయన ప్రత్యేకత.

చివరగా, ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం వారు ప్రచురించిన కథాస్రవంతి – మధురాంతకం నరేంద్ర కథల పుస్తకంలో కాకుమాని శ్రీనివాసరావు గారు చెప్పిన, నేను ఏకీభవించే మాటలు కొన్ని పంచుకుంటాను. “మనిషి స్వీయ, సాంఘిక అస్తిత్వంలోని ద్వంద్వాలు, వైరుధ్యాలు, అపరిచిత కోణాలు స్థూలంగా నరేంద్ర కథా వస్తువులు. అయితే వీటిని గురించిన తీర్మానాలు, నిర్ధారణలు ఈయన కథల్లో ఉండవు.” ఈ మాటలు వెదురుపువ్వు కథకు అద్దం పడతాయి. కథ పై సంకలనంలో కూడా చదవవచ్చు.

***పరిచయకర్త : శాయి రాచకొండ, హ్యూస్టన్***

# వినదగునెవ్వరు చెప్పిన..

కథామంజరిని ఇప్పుడే చూశాను. రెండు అంశాలు చాలా బాగా నచ్చాయి. కథాకీయం. మీ ప్రతీ వాక్యం అక్షర సత్యం. ఐదు పేరాలూ వేటికి అవే సాటి. సంచిక చివర 'పారితోషికం' అంశాలు. ముందరి పద్యం, చివరన రాసిన వాక్యం ఎంతో హుందాగా ఉన్నాయి. మనసారా వందనం.

***జంధ్యాల శరత్ బాబు, అరసవల్లి***
*పూర్వ ఈనాడు సంపాదక బృందం (హైదరాబాద్)*

---

ప్రసాదరావు గారి "మరో మాట" చీమలపాటి వారు చిన్నగా అందించారు. స్వప్న కథానుభూతి బావుంది. కల వాస్తవం, అయితే థ్రిల్లింగ్ కథ అవుతుందని మరోసారి రచయిత చాటి చెప్పారు, అభినందనలు! నారంశెట్టి వారి "అల్లరి పిల్లోడు" కథగా లలితగారిని స్పృశించి, సహృదయుల్ని లలితంగానే తాకాడు. సాహితీ హృదయ క్షేత్రంలో రసానందం కలిగించాడు.. ఆట అనేదానికి సొంతం నిర్వచనం పిల్లోడు. పిల్లోడి సొంతం. ఈ చిలిపి చేష్టలు అన్నీ గొలుసుకట్టుగా వివరించాడు రచయిత. పక్షిని చూచి అమ్మతనాన్నీ గుర్తుకు తెచ్చుకోవడం బావుంది. అభినందనలు! సింహప్రసాద్ గారి "కొత్త ఆశల పొద్దు" లో తప్పిపోయిన గోమాలక్ష్మి కోసం వెదుకులాటతో మొదలైన కథ. పొంచి ఉన్న పులిని చంపటం కాదు.. మన గోవును సురక్షితం చేయడమే ముఖ్యం అనే వాక్యంలో ఎంతో సందేశం ధ్వనిస్తోంది. ఊబిలోకి దిగినది ఏదీ కనిపించదా?

***డా. ఆర్. వి. దేవదాసు***

---

"కొత్తపల్లి ఉదయబాబు గారి "నీవై వెలుగై వ్యాపించు" కథ ఎంతో బాగుంది. అసలు ఎంత ఆసక్తిగా ఉంది అంటే కథని అలాగే వింటూ అన్నీ మరిచిపోయి ఉండిపోయాను. మానవ విలువలతో చాలా చక్కగా రాశారు. శ్రీ రంగనాథంగారు కథని చక్కగా ఆసక్తికరంగా స్పష్టంగా చదివి వినిపించారు. తమిరిశ జానకిగారి "మరొక తలుపు" కథ బావుంది. జీవితంలో అన్నీ కోల్పోయిన ఒక మంచి మనిషిని.. హోప్ మరియు నమ్మకం ఎలా ముందుకు నడిపిస్తుందో చక్కగా రాశారు. శ్రీమతి ఉమదేవిగారు కథని భావాలకి అనుగుణంగా చక్కగా చదివి వినిపించారు.

***కె. భారతి,***

---

శరత్ జ్యోత్స్న గారు నా "పరిష్కారం" కథను చాలా చక్కగా చదివారు. కథలో నేను తొలగించాలనుకున్న ఒక వాక్యాన్ని తొలగించలేదని, ఈమె ఇంత చక్కగా స్పష్టంగా చదవడం వల్లనే నాకు తెలిసింది. చాలా చాలా సంతోషమండి.

***పి. రాజేంద్రప్రసాద్***



ప్రథమ బహుమతి పొందిన కథ

# చక్రభ్రమణం


**రాజమోహన్ ఇవటూరి**

✆ 9866100175


**రచయిత పరిచయం**

*రాజమోహన్ ఇవటూరి స్వస్థలం విశాఖపట్నం. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ చేశారు. టెక్ మహీంద్రాలో వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేసి, 2021 నుంచి సొంత సంస్థను నడుపుతున్నారు. 1994 నుంచి కథలు రాస్తున్నారు. ఇప్పటి వరకు యాభైకి పైగా కథలు రాశారు. దాదాపు అన్ని కథలు స్వీయానుభవానికి కొంచెం కల్పన జోడించి వ్రాసినవే. కొన్ని కథలకు బహుమతులు వచ్చాయి.*

*శ్రీయుతులు నామిని సుబ్రహ్మణ్యం నాయుడు, జ్యేష్ఠ, ముళ్ళపూడి, గురజాడ, కేశవరెడ్డి, ఇంద్రగంటి జానకీబాల గార్ల రచనలని ఇష్ట పడతారు. వీరి తండ్రి, రచయిత అయిన జ్యేష్ఠ గారి పేరిట ఏర్పాటుచేసిన 'జ్యేష్ఠ లిటరరీ ట్రస్ట్' ఆధ్వర్యంలో రచయిత భరాగో గారి పూర్తి సహకారంతో 1990 నుంచి ఎన్నో ఏళ్ళు ఉత్తమ కథ, ఉత్తమ కథా సంకలనాలకు పురస్కారాలు అందించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్నో పుస్తకాలను ప్రచురించారు. సరైన సహకారం లభిస్తే, భరాగో గారు కాలం చేసాక ఆగిపోయిన ఈ 'జ్యేష్ఠ పురస్కారాలు' మళ్ళీ కొనసాగించాలనే కోరికతో ఉన్నారు.*

> **"కొంతమందిని వేరుగా చూసారని చరిత్ర చెప్తోంది. కానీ నేను చూడలేదు. నువ్వు చూడలేదు. మీ తండ్రి కూడా చూసి ఉండరు. అంతకు ముందు ఎప్పుడో ఏదో జరిగింది. అప్పటి బాధితులూ ఈరోజు లేరు. బాధించిన వారూ లేరు. కానీ వారికీ మనకీ కులం అనే లంకె పెట్టి మనం ద్వేషాన్ని పెంచుకుంటున్నాం. మన కళ్ళ ముందు జరిగేది విస్మరిస్తున్నాం.**

"పిల్లలూ! ఈరోజుకి చదువు ముగిసింది. నేను చెప్పిన ప్రశ్నలన్నింటికీ సమాధానాలు రాసుకుని రేపటికి సిద్ధంకండి!" అన్నాడు శరత్.

పిల్లలు పదిమందీ లేచి నుంచుని, వారు కూర్చున్న చాపలని చుట్టి, వాటి స్థానంలో పెట్టేసారు. ఇంతలోనే వంటింట్లోంచి పిలుపొచ్చింది.

"కాళ్ళు, చేతులు కడుక్కుని భోజనానికి రండి. పెరట్లోంచి ఆకులు కోసుకుని రండి!" అని లోపల నుంచి అమ్మగారి పిలుపు!

వెంటనే పిల్లలందరూ తోటలోకి వెళ్ళి అరిటాకులు కోసుకుని, ఆ ఆకులు కడుక్కోవటానికి కుళాయి దగ్గరికి వెళ్లారు.

ఇంతలో "నమస్కారం గురువు గారూ!" అంటూ వచ్చారు నాయుడుగారు.

"రండి రండి" అని ఆహ్వానించాడు శరత్.

నాయుడుగారు కూర్చున్నాక, "మీ కుర్రాడు భోజనానికి కూర్చుంటున్నాడు." అన్నాడు శరత్. ఒకసారి భోజనానికి కూర్చున్నాక లేవకూడదని నియమం.

"అబ్బే అది కాదులెండి. నేనొచ్చిన విషయం వేరే ఉంది." నానుస్తూ అన్నారు నాయుడుగారు.

"చెప్పండి" అన్నాడు శరత్ చిరునవ్వుతో.

"మీకు తెలుసు! నాకు ఆర్థికంగా ఏ ఇబ్బందీ లేదు. మీరు చదువు చెప్పే విధానం మంచిదనే మీదగ్గరికి పంపిస్తున్నాను. ఇతరులకి ఉచితంగా చదువు చెప్పినా, నావంటి వారి దగ్గర మీరు ఎంతో కొంత తీసుకుంటే నాకు కూడా బావుంటుంది కదా!" ఎంతో మొహమాటంగా అన్నారు నాయుడు.



"అయ్యో... మీరలా దిగులు పడకండి. నాకు కాలేజీ నుంచి జీతం వస్తుంది. విద్యకీ వైద్యానికి అవసరం మించి డబ్బులు తీసుకోకూడదని నా ఉద్దేశ్యం. ఇందులో మీ తప్పేముంది?" అన్నాడు శరత్ మర్యాదగా.

"నిజమే అనుకోండి! ఈ ఏడాది దేవుడి పేరిట ఒక లక్ష రూపాయలు ఏదైనా మంచి పనికి ఉపయోగించాలని అనుకున్నాను. అందుకు మీరే సరైన వారు అనిపించింది. దయచేసి కాదనకండి!" అన్నాడు నాయుడు.

"ఎంత మంచి ఉద్దేశం!"

కొంచెం ఆలోచించి చెప్పాడు శరత్. "అయితే ఈ సాయం చేయండి! మీకు తెలుసు కదా. ఈ వీధిలోనే వేద పాఠశాలలో పిల్లలకి వేదం నేర్పిస్తున్నాం! పాఠాలు చెప్పుకోవటానికి ఒక మహానుభావుడు తన ఇంటిని ఇచ్చేసారు. మరికొందరం... వంతుల వారీగా నెల వారి సరుకులు ఇస్తున్నాం. ఇంటి మరమ్మతులకు మరికొంచెం నిధులు అవసరమయ్యాయి. మీరు నేరుగా వారికే ఈ సాయం చేస్తే... "

'పూర్తిగా వద్దనలేదు కదా!' అని నాయుడు గారు సంతోషించారు. అయినా కొంత అసంతృప్తి.

"మీరు తీసుకోరు కదా!"

"ఎంత మాట. మీరిస్తున్నది మాకే కదా! లేకపోతే మేమందరం ఆ ఖర్చులు ఏర్పాటు చేసుకోవాలి కదా" అన్నాడు శరత్ నవ్వుతూ.

"సరేలెండి! మీరు ఒప్పుకున్నారు. అదే పదివేలు. మీ పూర్తి పేరు చెప్తే దాతలుగా అక్కడ మీ పేరు రాయిస్తాను!" అని నాయుడుగారు లేచారు.

"నా పేరెందుకండి. ఇచ్చేది మీరు. డబ్బు మీ పేరుతోనే ఇచ్చెయ్యండి!" అన్నాడు శరత్.

ఇక వాదించలేక నాయుడుగారు చిరునవ్వుతో నడిచారు.

శరత్ లోపలకి వెళ్లేసరికి పిల్లలందరూ భోజనాలు చేసి, దేవుడికి నమస్కరించి, ఎవరి ఆకులు వారు తీసుకుని పెరట్లోకి వెళ్లారు.

"ఈ ఒక్క ఆకూ ఎవరు వదిలేశారు?" అడిగాడు శరత్.

"ఇంకెవరు ఆ జైపాల్ గాడే! అన్నీ మంచి అలవాట్లే గాని, ఈ ఒక్క పనికీ వాడికి ఏదో ఇబ్బంది!" అంది భానుమతి.

"ఏం పరవాలేదు, నెమ్మదిగా నేర్చుకుంటాడు!!" అని చెప్పి ఉద్యోగానికి బయలుదేరాడు శరత్.

అతని ఇంటి వెనకే కందుకూరి వీరేశలింగం కళాశాల ఉంది. అక్కడే ఉద్యోగం!

★★★

సాయంత్రం కాస్త ఫలహారం తిని, శరత్ వీధి అరుగు మీద విశ్రాంతి తీసుకుంటుంటే, ఆనందం ఇంటి గేటు తెరుచుకుని నెమ్మదిగా అరుగు వైపు వచ్చాడు.

"ఏమయ్యా ఆనందం! ఈవేళ వచ్చావు? సందేహాలుంటే రేపు మాట్లాడుకోవచ్చు కదా!" అన్నాడు శరత్.

"లేదండీ. మీతో ఒక ముఖ్యమైన విషయం మాటాడాలి" అన్నాడు ఆనందం కొంచెం గంభీరంగా.

"అంత ముఖ్యమైన విషయమా... చెప్పు! ముందు కూర్చో" అన్నాడు శరత్.

ఇంతలో ఆనందం వెనకే సోమేశ్, ఖాసిం, లలిత, కరుణ, రమేష్‌బాబు వచ్చి నించున్నారు.

నేరుగా విషయంలోకి వచ్చాడు ఆనందం. “ఇది మా అందరి అభిప్రాయం గురువుగారూ! మీరు ఆ జైపాల్ గాడికి చదువు చెప్పకండి. వాడిని ఇంటికి కూడా రానివ్వకండి!”

శరత్ ఆశ్చర్యపోయాడు. తన ఇంట్లో కలిసికట్టుగా ఉండే పిల్లల మధ్య ఈ ద్వేషం ఏమిటి? పైగా ఈ విషయం చెప్పటానికి అందరూ కలిసికట్టుగా వచ్చారు!

అయినా మనసులో భావాలు కనిపించకుండా “ఎందుకో తెలుసుకోవచ్చా?” అని అడిగాడు.

“వాడు మీ గురించి అడ్డదిడ్డంగా మాటాడుతున్నాడు.” అన్నాడు ఆనందం కన్నీళ్లు ఆపుకుంటూ.

“అంత ద్వేషం దేనికి? అసలు ఏమంటున్నాడు?” అడిగాడు శరత్ అయోమయంగా.

“ప్రతిరోజూ భోజనం తర్వాత వాడు అన్నం తిన్న ఆకు అక్కడే వదిలేసి పోతున్నాడు.”

“అవును. నేనూ గమనించాను. నెమ్మదిగా అలవాటు చేసుకుంటాడులే!” అన్నాడు శరత్.

“అదేమీ కాదు గురువుగారూ” ఎర్రబడిన కళ్ళతో చెప్పాడు ఆనందం.

“కారణం వేరే ఉందండి. మొన్న బయటపడ్డాడు. వాడు తిన్న ఎంగిలి ఆకులు బాపనోళ్లతో ఎత్తిస్తున్నానని గొప్పగా చెప్తున్నాడు. తమ పూర్వీకులని అవమానించినందుకు బదులుగా ఇదంతా కావాలనే చేస్తున్నాడుట!”

శరత్ నిర్ఘాంతపోయాడు. ఇంత చిన్న వయసులో ఇలాంటి ద్వేషాలు పెంచుకున్నాడా?

ఆశ్చర్యంనుంచి తేరుకుని, “సరే సరే. నాకు అర్థమయ్యింది. ఏం చెయ్యాలో నేను ఆలోచిస్తాను. మీరు మాత్రం వాడితో మునపటిలా ఉండండి!” అన్నాడు.

“ఇంత జరిగాక ఎలా వదిలేస్తాం గురువు గారూ!” అన్నాడు ఖాసీం.

“వదిలేస్తానని ఎక్కడ చెప్పాను? ఇదంతా ఎందుకు జరిగిందో తెలుసుకుని అప్పుడు చెయ్యాల్సింది చేద్దాం!” అన్నాడు శరత్.

జైపాల్‌ని క్షమించేస్తాడేమో అని సందేహిస్తున్న పిల్లలు, తృప్తి పడి వెళ్లిపోయారు.

శరత్ మాత్రం ఆలోచిస్తూ ఉండిపోయాడు.

జైపాల్ ప్రవర్తనలో ఏదో తేడా ఉంది. ఏమిటది? ఎందుకని? ఎవరి వల్ల?

అతనికి కొన్ని సంఘటనలు గుర్తుకొచ్చాయి.

జైపాల్‌కి లెక్కలు సరిగా రావటం లేదని కొన్నాళ్ల క్రితం అతని తండ్రితో చెప్పాడు శరత్. ఆర్ట్స్‌లో ఆసక్తి ఉంది కనుక దారి మార్చుకుంటే మంచిదేమో అన్నాడు.

“పెబుత్వం డబ్బిచ్చి సదివిస్తుంటే మీకెందుకు బాబూ ఉలుకు? ఆడిని ఐఐటీలో సేర్పిస్తా. నూ(వు) సెప్పేది సెప్పు. మరే సలహా ఇవ్వమాకు. సానా ఏళ్ళు మమ్మల్ని నొక్కి పెట్టారు గందా. ఇక సాలు!” అని అక్కడే తుంచేశాడు జైపాల్ నాన్న.

‘ఈయనకిలా అర్థమయ్యిందా?’ అని నిట్టూర్చి శరత్ ఇంటికి వచ్చేసాడు.

జైపాల్ తండ్రి మాటల్లో అంతర్లీనంగా ఉన్న భావాలు ఆరోజు తెలుసుకోలేక పోయాడు. అతనే కొడుక్కి ఏమైనా నూరిపోస్తున్నాడా?

నిజానికి ఈ విషయం ఇక్కడే వదిలెయ్యచ్చు. కానీ తను కేవలం చదువు మాత్రమే చెప్పటం లేదు. బుద్ధులు కూడా నేర్పించాలి కదా!

బాగా ఆలోచించుకుని ఒక నిర్ణయానికి వచ్చాడు శరత్.

కొన్ని రోజులు ఏమీ జరగనట్టు ఉండి, ఒకరోజు జైపాల్ రాగానే, “జైపాల్! ఈరోజు నుంచి మా ఇంటికి రాకు” అన్నాడు.

జైపాల్ ఆశ్చర్యపోయాడు. అయినా బింకంగా, “ఎందుకో తెలుసుకోవచ్చా గురువుగారూ!” అన్నాడు.

“నిన్న సెనగపప్పు కొన్నపుడు వార్తాపత్రిక ముక్కలతో చేసిన ఆ పొట్లం మీద ఏడాది క్రితం వార్త చదివాను. ఒక దుర్మార్గుడు పక్కింటోళ్ల ఇంట్లో దొంగతనం చేసి, ఆ నేరానికి అతన్ని పోలీసులకి పట్టించారని కోపంతో ఆ ఇంటికి నిప్పు పెట్టాడు. ఆ ఇంట్లో వారందరూ చనిపోయారు!” అన్నాడు శరత్.

“అయితే నేనెందుకు మీ ఇంటికి రాకూడదు?”

“ఆ దుర్మార్గుడి పేరూ, నీ పేరూ ఒకటే. అందుకని” కరుకుగా చెప్పాడు శరత్.

“ఏమిటి మాస్టారూ, హాస్యాలాడతారు! ఆ పేరు నాదైనంత మాత్రాన వాడికీ నాకూ సంబంధమేమిటి? పైగా ఏడాది క్రితం ఆ సంఘటన జరిగింది.” అన్నాడు జైపాల్.

“పేరు ఒకటే... అంటే నీకూ అతనికీ సంబంధం ఉండే ఉంటుంది.” గొంతు పెంచి చెప్పాడు శరత్.

“ఇది అన్యాయం గురువుగారూ! లేని సంబంధం ఎక్కడి నుంచో తీసుకొచ్చి నన్ను వెళ్లగొట్టేస్తారా? అంతేలెండి. ఎప్పటినుంచో ఇదేగా జరుగుతోంది!” అప్పుడు బైట పడ్డాడు జైపాల్.

“ఎప్పటినుంచో కాదు. ఎప్పుడో జరిగింది. కానీ ఎవరి మీదైనా ద్వేషం పెంచుకోవటానికి మనం ఏదో ఒక సంబంధం వెతుక్కోవటం మామూలేగా!” అన్నాడు శరత్.

జైపాల్‌కి అప్పుడు అనుమానం వచ్చింది. తన సహచరుల ముఖాల్లో భావాలు చూడగానే ఏమి జరిగి ఉంటుందో ఊహించాడు.

“గురువుగారూ! నాకు మీ మీద గౌరవం ఉంది. కానీ ఎన్నో ఏళ్లుగా మమ్మల్ని మీ పూర్వీకులు వేరుగా చూడలేదా?”

అప్పుడు నవ్వాడు శరత్.

"కొంతమందిని వేరుగా చూసారని చరిత్ర చెప్తోంది. కానీ నేను చూడలేదు. నువ్వు చూడలేదు. మీ తండ్రి కూడా చూసి ఉండరు. అంతకు ముందు ఎప్పుడో ఏదో జరిగింది. అప్పటి బాధితులూ ఈరోజు లేరు. బాధించిన వారూ లేరు. కానీ వారికీ మనకీ 'కులం' అనే లంకె పెట్టి మనం ద్వేషాన్ని పెంచుకుంటున్నాం. మన కళ్ళ ముందు జరిగేది విస్మరిస్తున్నాం. ఈరోజు నీతో కలిసి చదువుకున్నవారు ఎవరో, వారి నేపథ్యం ఏమిటో నీకు తెలుసా? ఇప్పుడు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా నిలదొక్కుకోవటానికి వెనకబడిన అన్ని వర్గాలకి ప్రభుత్వం అండగా ఉంది. ఆ అండని ఉపయోగించుకుని ఎదగటం మీద దృష్టి పెట్టు! నీకే మాత్రం తెలియని అనుభవించని విషయాలని ఎక్కడో విని, ద్వేషం పెంచుకుని సాధించేదేమీ లేదు!" అన్నాడు.

జైపాల్ కొంచెం సేపు నిశ్శబ్దంగా ఉండిపోయి అన్నాడు. "గురువుగారూ! మా తాత బాపనోళ్ల ఇంట్లోనే ఉండి చదువుకున్నాడు. వాళ్ళు ఆయనకి ఉండటానికి చోటు ఇచ్చారు, చదువు చెప్పారు. కానీ వేరే కంచం ఇచ్చి వేరే చోట వడ్డించే వారు. ఆ అవమానం ఆయనకి ఇప్పటికీ మనసులో ఉంది. నాకు బాధగా ఉండదా?"

శరత్ వెంటనే జవాబు చెప్పాడు. "బాధ ఎందుకు ఉండదు? కానీ అలా చేసిన వారికీ మాకూ ఏమిటి సంబంధం? ఒక పక్క కులరహిత సమాజం కావాలంటారు. మళ్లీ అన్నింటికీ కులాన్ని జోడిస్తారు. ఇది ఎక్కడి న్యాయం?"

జైపాల్ మాటాడలేదు.

"ఎన్నో ఏళ్ళ క్రితం జరిగింది వదిలేయ్. ఈరోజు ఏమి జరుగుతోంది? అందరం కలిసి చదువుకుంటున్నాం. కలిసి ఉద్యోగాలు చేసుకుంటున్నాం. ఉద్యోగంలో హోదా ప్రకారం, పై వారికి వారి చరిత్రతో సంబంధం లేకుండా గౌరవం ఇస్తున్నాం! ఇప్పుడు కూడా ఎక్కడైనా ఎవరైనా వివక్ష చూపిస్తే శిక్షించటానికి బలమైన చట్టం తయారు చేసుకున్నాం. అవునా కాదా?"

"..."

"ఇదంతా నువ్వు అమ్మగారి చేత ఎంగిలాకులు ఎత్తిస్తున్నావని చెప్పలేదు. ఎవరు తిన్న ఆకులు వారి చేత్తో ఎత్తివేయటం ఒక మంచి అలవాటుగా చేయాలనుకున్నాను. నీకు ఇష్టం లేకపోతే చేయనవసరం లేదు. కానీ ఈ ద్వేషం నీతో పాటు పెరిగి నిన్నే దహిస్తుంది. అలా జరగకుండా ఉండటం కోసమే ఈరోజు పాతాలు పక్కన పెట్టి ఈ చర్చ చేయవలసి వస్తోంది" అన్నాడు శరత్.

జైపాల్ ఓటమి ఒప్పుకోలేదు.

"ఈరోజు కులం పేరుతో అన్యాయం జరగటం లేదంటారా గురువుగారూ?" అని సూటిగా అడిగాడు.

"ఎందుకు లేదు? రాజకీయాలన్నీ వాటిమీదే బతుకుతున్నాయి. వారి వెనక కొందరు మూర్ఖులు, ఆ ప్రాతిపదిక మీద గొర్రెల్లా ఓట్లు వేస్తున్నారు. భూములు లాక్కోవటానికి, జనాల పైన జులుం చేయటానికి ఎంతో మంది ఈ పేరుతో జనాలని కలుపుకుని ఊళ్లు తగలబెడుతున్నారు, మూకుమ్మడిగా బలాత్కారాలు చేస్తున్నారు. ఆ దుర్మార్గాలని నువ్వు కూడా ఖండించాలి. ఆ పనులు చేసిన వారి నేపథ్యం ప్రకారం కాకుండా వారిని నేరస్థులుగా పరిగణించి శిక్షించాలి"

“మాస్టారూ! వేరే అగ్రకులం వారు చేసే దుర్మార్గాలని ఎత్తి చూపించి తెలివిగా విషయాన్ని పక్కదారి పట్టించారు. ఈరోజుకి కూడా గుళ్లో పూజారులు మీవాళ్ళేగా. మా కులం వారిని పూజారులు చేసి మీరు వారి కాళ్ళకి మొక్కుతారా? అలా మొక్కిన రోజే మాకు న్యాయం జరిగినట్టు” అన్నాడు జైపాల్.

“అర్చకత్వం గానీ పౌరోహిత్యం గానీ వేదాలు గానీ నేర్చుకున్న వారి నేపథ్యం ఏమైనా వారికి చేతులెత్తి మొక్కాలి. వారి విద్వత్తుకి తప్పకుండా మొక్కవలసిందే” అన్నాడు శరత్.

మాట లేకుండా నిలబడిన జైపాల్‌తో “మా వీధిలోనే పిల్లలకి వేదాలు నేర్పిస్తున్నారు. వారి పుట్టుకతో గానీ నేపథ్యంతో గానీ సంబంధం లేకుండా ఎవరినైనా చేర్చుకుంటున్నారు. నువ్వు కూడా ఎందుకు నేర్చుకోకూడదు? అందరిచేతా నమస్కారాలు ఎందుకు పెట్టించుకోకూడదు?” అన్నాడు శరత్.

జైపాల్ నిశ్శబ్దంగా ఉండిపోయాడు. ఓటమి ఒప్పుకోవటం కష్టం. ఎందుకంటే ఇప్పటివరకూ అతని మనసులో పెంచుకున్న ఆలోచనలేవీ అతని స్వంతం కాదు.

అతని ఇబ్బంది గ్రహించిన శరత్ “సరే సరే. ఈ విషయం మీద చర్చ అయిపోయింది. ఇక చాపలు తెచ్చుకుని, పుస్తకాలు తెరవండి” అన్నాడు. అందరూ చాపలు తెచ్చుకుంటుంటే “మళ్ళీ చెప్తున్నాను. ఎవరికి ఇబ్బంది ఉన్నా వారు భోజనం చేసిన ఆకులు వదిలేసి వెళ్ళవచ్చు” అని ప్రత్యేకంగా చెప్పాడు శరత్.

ఆరోజు పాఠాలు పూర్తయ్యి పిల్లలు భోజనం చేసాక, ఎప్పుడూ మిగిలిపోయే ఆ ఒక్క ఎంగిలి ఆకు నేల మీద కనపడక పోవటంతో, శరత్ ఆనందంగా నిట్టూర్చాడు.

# శస్త్రచికిత్స

గంటి రమాదేవి
✆ 9490190908

ద్వితీయ బహుమతి పొందిన కథ



**రచయిత పరిచయం**

*కలం పేరు గంటి రమాదేవి. అసలు పేరు జీ.ఎస్. శర్మ. ఎడ్యుకేషన్ M.com (SVU), MBA (Osm), CMA (ICWAS CAL). ఎయిర్ ఇండియాలో అకౌంట్స్ విభాగంలో పనిచేసి, ఇప్పుడు విశ్రాంత జీవితం గడుపుతున్నారు. వీరి మొదటికథ ఆంధ్రప్రభలో 1965 లో ప్రచురితమైనది. ఇప్పటి వరకు దాదాపు 900 కథలు, 15 వరకు నవలలు వివిధ పత్రికల్లో ప్రచురితమైనవి. కథామంజరిలో ఇది వీరి నాలుగవ కథ.*

***మీ రాక కోసమే ఎదురుచూస్తూ ఉన్నాను! కర్మకాండ అయిన వెంటనే నన్ను అరెస్ట్ చేస్తారని భావించాను. కుమారుడి అంత్యక్రియలు పూర్తి చేసేంత వరకు నాకు అవకాశం ఇచ్చారు! మీకు కృతజ్ఞతలు. మీరు రాకపోతే... నేనే రావాలని అనుకున్నాను. నేను తప్పు చేశాను. మదన్ నా ఇష్ట దైవాన్ని దుర్భాషలాడాడు. నా విష ప్రసాదం తిని దుర్మరణం పాలయ్యాడు.***

సెల్‌ఫోన్ రింగ్ అయింది. ఇన్స్పెక్టర్ గజేంద్ర “హలో!” అన్నాడు.

అవతల హెడ్‌కానిస్టేబుల్. “సార్! ఇక్కడ ఒక యువకుడి హత్య జరిగింది! కోదండ రామాలయం కోవెల వీధిలో!” అన్నాడు.

“అక్కడే ఉండు! నేను వస్తున్నాను!”

గుడి బయట వెయిట్ చేస్తున్నాడు హెడ్‌కానిస్టేబుల్!

“బాడీ ఎక్కడ?” అడిగాడు ఇనస్పెక్టర్.

“గుడి వెనుక ప్రదేశంలో!”

“నడు!” అని సురేష్‌ని అనుసరించాడు గజేంద్ర.

కోదండ రామాలయం ఆవరణ పరిశీలనగా చూసాడు. గుడి వెనుక కొబ్బరితోట, పూలతోట, కూరగాయల పాదులు ఉన్నాయి. దిగుడుబావి, మోటార్, కనిపించాయి. చాలా పెద్ద స్థలం. బావి పక్కన హతుడి శవం బోర్లా పడి ఉంది. గజేంద్ర కానిస్టేబుల్ వైపు తిరిగి అన్నాడు. “స్టేషన్‌కి ఫోన్ చేశావా?”

“అక్కరలేదు సార్! హత్య వేదవతి అనే ఆమె చేసింది! తనే చెప్పింది”

"హతుడి వివరాలు తెలిసాయా?"

"పేరు తెలుసుకున్నాను! జేబులో విజిటింగ్ కార్డ్ ఉంది. మొహిషిన్ ఖాన్... రియల్ ఎస్టేట్ బిజినెస్!"

"ఇప్పుడు ఆ... వేదవతి ఎక్కడ ఉంది?"

"ఆలయ పూజారి నరసింహాచార్యులు గారి ఇంట్లో!"

"నడు... చూద్దాం!"

అంత దూరంలో పూజారిగారి ఇల్లు కనపడింది. ఆరుబయట కుర్చీలో కూర్చుని ఉన్నారు నరసింహాచార్యులుగారు! వయోవృద్ధులు. నీరు కావి పంచె, నూలు బనియన్ ధరించి వున్నారు. ఆయన పక్కనే వేదవతి. సుమారు అరవై ఏళ్ల వయసుంటుంది. వేదవతి ఆయన భార్య! చౌక రకపు సిల్క్‌చీర ధరించి వుంది. పీలగా, బలహీనంగా వుంది. ముఖంలో రక్త హీనత కనపడుతూ వుంది. ఇద్దరూ మౌనంగా వున్నారు.



వేదవతిని పరిశీలనగా చూశారు గజేంద్ర! పూజాపునస్కారాలు చేసుకుంటూ, సాత్విక జీవనం గడిపే ఆమెలా కనిపించింది. గజేంద్రను చూడగానే వృద్ధ దంపతులు లేచి నిలబడ్డారు!

"ఆ దుర్మార్గుడిని నేనే చంపాను! నన్ను అరెస్టు చేయండి!" అని ఆమె చేతులు ముందుకు చాపింది. ఎముకలు తప్ప ఏమీ లేని ఆ చేతిని చూసి, గజేంద్ర ఒక అడుగు వెనక్కి వేశాడు. బలవంతుడైన యువకుడిని చంపేంత బలం ఆమెకు లేదు.

"ఏమైందో వివరంగా చెప్పండి!" అడిగాడు గజేంద్ర.

"మావారు ప్రతి రోజులాగానే ఈ రోజూ ఉదయం స్నానం చేసి గుడికి వెళ్లారు. స్వామి నివేదనకి నైవేద్యం తీసుకుని, నేను కూడా ఆయన వెనకే బయలుదేరాను. ఆయన గుడి తలుపు తెరిచి గర్భగుడిలో నిర్మాల్యాలను తొలగించి శుభ్రపరిచారు. మూలవర్లను, ఉత్సవ విగ్రహాలను ఇతర పాత్రలకు పులిగాపు చేసి వాటిని యథాస్థానాలలో ఉంచారు. పులుకడిగిన తర్వాత... మంత్రపూర్వకంగా పంచగవ్యాలు, కుశోదకాలతో సంప్రోక్షణ. స్వామివారికి అలంకరణ చేసి తిలకధారణ చేశారు. స్వామివారిని తృప్తిగా చూస్తూ నేను నమస్కరించాను. తరవాత... పెద్ద రాగిబిందెతో నీళ్లు చల్లి, ఆవరణ అంతా శుభ్రం చేశాను! ఆయన పళ్లెంలో తులసిదళాలు విడిచి పరంజ్యోతి మంత్రోచ్చారణ చేస్తూ తీర్థాన్ని తయారు చేశారు! నైవేద్యాన్ని ఆయనకి ఇచ్చాను! నివేదన మొదలవ లేదు. అప్పుడు వచ్చాడు దుర్మార్గుడు! విగ్రహారాధన కూడదుట... అది పాపమట... మానేయమన్నాడు. మా ఆయనతో గొడవకు దిగాడు. 'ఈ రాతివిగ్రహాలలో ఏముంది? వీటికి పూజ, ప్రసాదం వేస్ట్!' అన్నాడు. 'బాబూ! నీ దృష్టిలో అవి రాతివిగ్రహాలు కావచ్చు. మంత్రోచ్చారణతో ప్రతిష్ఠించి, ప్రాణప్రతిష్ఠ చేసిన దైవమూర్తులు! 'మూర్తి' పూజ ఏదో రకంగా జగమంతా వుంది!' అని మా ఆయన అంటుంటే... వాడు పెద్దగా అరుస్తూ, ఆయనతో వాదన పెట్టుకున్నాడు. స్వామి వారి కోసం చేసిన ప్రసాదం నివేదన కాక ముందే, మా చేతుల్లో నుంచి లాగేసుకుని, మొత్తం తినేసాడు! స్వామివారి విగ్రహాన్ని అపవిత్రం చేశాడు! గుడిలో అల్పాచమానం చేసాడు! స్వామి విగ్రహాన్ని కాలితో తన్నాడు! సుత్తితో ఆయన తల పగలగొట్టబోయాడు! ఆయన తప్పించుకున్నారు. విగ్రహం వైపు వెళ్ళాడు! ఈ ద్రోహం భరించలేకపోయాను. తరతరాల ఆచారాలను మలినం చేసిన వాడి మీద పట్టరాని కోపం వచ్చింది. వాడిని బయటకు తీసుకొచ్చి, చాకుతో పొడిచి చంపేశాను. నన్ను ఉరి తీయండి!" ఆమె ఆవేదనగా అంది.

గజేంద్రకు ఏమి చేయాలో అర్థం కాలేదు.

అరెస్టు చేయకుండా, ఆమెను స్టేషన్‌కి తీసుకు పోయి 'సెల్'లో కూర్చోపెట్టాడు! వేదవతి మౌనప్రార్థన చేస్తూ ఉన్నది! ఈమె హంతకురాలు కాదు! ఒక యువకుడిని కత్తితో పొడిచి చంపే అంత బలం ఆమెకు లేదు! ఎవరినో రక్షిద్దామని చేయని నేరం తనమీద పెట్టుకున్నది అన్నది స్పష్టం! ఎంక్వయిరీలో కొన్ని ఆశ్చర్యం కలిగించే వివరాలు తెలిసాయి. మొహిషిన్ ఖాన్... అసలు పేరు మదన్‌గోపాల్! అతడు పూజారి నరసింహాచార్యులు వారి కుమారుడేనట! తండ్రి మీద కోపంతో మతం మార్చుకున్నాడు!

'హత్యాయుధం' మూడు అంగుళాల కత్తి! ఓ తల్లి కుమారుడిని చంపడం! ఇవి కోర్టు నమ్మదు! ఎంత ప్రశ్నించినా... వేదవతి ఒకటే సమాధానం చెబుతూ వుంది. 'నేనే కత్తితో చంపాను. నన్ను ఉరి తీయండి!' అని!

'ఫోరెన్సిక్ రిపోర్ట్' వచ్చేవరకు మరణం ఎలా సంభవించింది అన్న విషయం తెలియదు. విచారణలో మరికొన్ని విషయాలు బయటపడ్డాయి. మదన్‌గోపాల్ కాలేజ్ చదువు వరకు మామూలుగానే ఉండేవాడు. చాలీచాలని తిండి, రేకుల షెడ్‌లో నివాసం, పెద్దగా ఆదాయము లేని పూర్వీకుల ఒక గుడి! ఖాళీ స్థలంలో పండే కొబ్బరికాయలతో, కూరగాయలతో జీవనం చప్పగా సాగిపోతూ ఉంది! ఐహికసుఖాల ఆకర్షణ లేని పెద్ద పూజారిగారికి జీవితం మాత్రం ఇబ్బంది లేకుండా గడిచిపోతూ

వుంది. యువకుడైన మదన్‌గోపాల్‌కి ఈ జీవితం నచ్చలేదు. ఉద్యోగం లేదు! రాజకీయ పలుకుబడి లేదు! పూజారి జీవితం ఓ శాపం! చదివిన చదువుకు విలువలేదు! అసంతృప్తితో రగిలిపోతూ ఉండేవాడు. జీవితమంతా ఇలా దుర్భరంగా గడిచిపోవాల్సిందేనా? తీవ్రవాదులతో చేరిపోవాలని ఆలోచన చేసేవాడు. అక్కడి పరిస్థితులు, త్యాగాలు చేయవలసిన అవసరం, అడవుల్లో జీవితం... ఇదికాదు తనకి కావలసినది!

అప్పుడు పాత పరిచయస్తుడు ఒకడు కనిపించాడు. విలాసవంతమైన జీవితపు రుచి ఎలా ఉంటుందో మచ్చు చూపించాడు. మొదటిసారిగా మటన్ బిర్యానీ రుచి చూశాడు. ఖరీదైన మద్యం తాగాడు. అధోగతి వైపు అతని ప్రయాణం వేగంగా సాగింది. పరాయి మతపు అమ్మాయిని ప్రేమించాడు. పెళ్లి కోసం మతం మారాడు. వైవాహిక జీవితపు మజా తెలియాలంటే డబ్బులు పుష్కలంగా ఉండాలి. అప్పులు చేశాడు. పూర్వీకుల ఆస్తి పైన అతని కన్ను పడింది. కోదండ రామాలయం, దానికి ఆనుకుని ఉన్న స్థలం ఇరవై ఎకరాలు నరసింహాచార్యుల వారి ఆస్తి ఉంది, దాన్ని అమ్మకానికి పెట్టాడు. నరసింహాచార్యుల వారి అనుమతి లేకుండా క్రయ దస్తావేజులు తయారుచేయడం వీలుకాదు అని చెప్పగానే, మదన్ నిరాశకు లోనయ్యాడు. 'మోజెస్' అనే పేరు పెట్టుకుని మరొక వివాహం చేసుకున్నాడు. అది మొదటి భార్యకి తెలియకుండా దాచి పెట్టాడు. 'డబల్ క్రాస్' ఖాళీ స్థలాన్ని ఒక మతం వారి ప్రార్థన మందిరం కోసం ఇస్తానని భారీగా డబ్బు తీసుకున్నాడు. అదే విధంగా మరొక మతం వారి దగ్గర భారీగా డబ్బు తీసుకున్నాడు.

హిందూమత పురాతన కోవెల స్థలం అంటే, అలాటి వాళ్లకి ఓ ఆకర్షణ... 'కిక్'! విగ్రహారాధన 'సైతాన్' పని అనే వాళ్ళ వాదనలో బలం పెరుగుతుంది!

ఒక్కొక్క విషయం తెలుస్తున్న కొలది గజేంద్రకు మతిపోతుంది. శుద్ధ శ్రోత్రియుడు అయిన ఒక గుడి పూజారి కొడుకు... ఇలా అధఃపాతాళానికి జారిపోవడం విచారకరం! అవి ఆ యువకుడి దృష్టిలో తప్పు కాకపోవచ్చు! 'లా' ప్రకారం... ఇవి నేరాలు!

రెండు వివాహాల విషయం... మతం మారడం, ఆస్తి అమ్మకానికి పెట్టడం, పూజారిగారికి తెలిసింది. గొడవలు జరిగాయి.

"ఇది నా ఆస్తి కాదు. ఆ కోదండరాముడిది! ప్రాణం పోయేంతవరకూ ఈ గుడిని, ఈ స్థలాన్ని ఎవరికి ధారాదత్తం చేయడానికి వీలుకాదు! కోదండరాముడు మన కులదైవం!" అన్నారు ఆయన.

దానికి మదన్‌గోపాల్ మండిపడ్డాడు. "ముసలి పీనుగులు... మీకు జీవితం ఎలా ఎంజాయ్ చేయాలో తెలియదు. ఎంజాయ్ చేసేవాళ్ల మీద అసూయ! నాకు ఈ 'బేకార్' జీవితం వద్దు! అమ్మనీ, నిన్నూ చంపి అయినా ఆస్తి సొంతం చేసుకుంటాను! గుడీ, రాతివిగ్రహం, నా శనిగ్రహం! వీటి వల్లే కదా... నాకీ గ్రహపాటు!" అని మండిపడ్డాడు.

మదన్ గుడిలోకి వచ్చి పూజా కార్యక్రమం పాడు చేయడం మొదటిసారి కాదు. నివేదనకు నైవేద్యం తినేసేవాడు! రచ్చ చేసి వెళుతూ ఉండేవాడు! రాత్రి కొందరు రౌడీలతో ఇంటికి వచ్చి... 'రేపు నీ పూజ వేళకి ఏదో ఒకటి చేస్తాను. రేపు మీ ఆఖరి రోజు!' అని బెదిరించి వెళ్లాడుట! ఆలోచించగా... గజేంద్రకి విషయం స్పష్టం అవుతూ ఉంది. 'మొహిషిన్ ఖాన్', ఉరఫ్, 'మోసెస్', ఉరఫ్ 'మదన్', వ్యసనాలకు బానిసై, తీర్చలేని అప్పులు చేశాడు. ఆ స్థలాన్ని మసీదుకి, చర్చికి ఇస్తానని డబ్బు తీసుకున్నాడు. రెండు పెళ్లిళ్లు చేసుకున్నాడు. మోసపోయిన ఆ భార్యల్లో ఎవరో ఒకరు అతని హత్య చేసి ఉండవచ్చు. ఇంకొక

పార్శ్వం నుంచి చూస్తే, స్థలం విషయంగా మోసపోయిన వారిలో ఎవరో ఒకరు చేసి ఉండవచ్చు. వేదవతి తనే దోషినని ఎందుకు చెబుతూ వుంది?

ఆ దిశగా గజేంద్ర పరిశోధన సాగింది. అనుమానించదగ్గ ఆధారాలు దొరకలేదు. నాలుగు రోజుల తర్వాత 'ఫోరెన్సిక్ రిపోర్ట్' వచ్చింది! అది చూసి గజేంద్ర 'షాక్' తిన్నాడు. మదన్ తినే ఆహారంలో విషం కలిసింది. రుచి, వాసన లేకుండా ఉండే 'థాలియం సల్ఫేట్'కి సంబంధించిన విషం! రిపోర్ట్ చూసి గజేంద్ర అదిరిపడ్డాడు. ఆహారంలో విషం ఎవరు పెట్టారు? మదన్ ఇద్దరు పెళ్ళాలు అంత తెలివైనవాళ్ళు కాదు! అలాగే స్థలం విషయంలో మోసపోయిన వాళ్ళకి కూడా విషాల గురించి సంగతి పెద్దగా తెలియదు. పరిశోధన అక్కడ ఆగిపోయింది. అందర్నీ పరిశీలన చేశాడు. ఇక మిగిలింది మదన్ తండ్రి. అతని నేపథ్యం విచారించగా అనేక విషయాలు బయటపడ్డాయి. ఆయన ఎం.ఎస్సీ. కెమిస్ట్రీలో డిగ్రీ చేశాడు! ఓ పెద్ద ఫార్మా కంపెనీలో పనిచేసేవాడు! వంశపారంపర్యంగా సంక్రమించిన కోదండ రామాలయం కోసం ఉద్యోగం వదులుకున్నాడు. ఈయనకి విషాల సంగతి తెలుసు. ప్రసాదంలో విషం కలిపే అవసరం, అవకాశం ఆయనకే ఉంది!

మరింత పరిశోధన తర్వాత. పూజారి గారు విషం సేకరించిన ఆధారాలు దొరికాయి. వాటి రసీదులు దొరికాయి. హంతకుడు దొరికాడు! మదన్ మరణించి నెల రోజులు గడిచిపోయాయి. దారితప్పిన వంశభ్రష్టుడు, దైవద్రోహియైన మదన్‌గోపాల్ అంత్యక్రియలు ఆయన పూర్తి చేసాడు. గజేంద్ర ఆచార్యుల ఇల్లు చేరుకున్నాడు. ఇనస్పెక్టర్ చూడగానే, నరసింహాచార్యులు వారు నిలబడ్డారు.

"మీ రాక కోసమే ఎదురుచూస్తూ ఉన్నాను! కర్మకాండ అయిన వెంటనే నన్ను అరెస్ట్ చేస్తారని భావించాను. కుమారుడి అంత్యక్రియలు పూర్తి చేసేంత వరకు నాకు అవకాశం ఇచ్చారు! మీకు కృతజ్ఞతలు. మీరు రాకపోతే... నేనే రావాలని అనుకున్నాను. నేను తప్పు చేశాను. మదన్ నా ఇష్టదైవాన్ని దుర్భాషలాడాడు. నా విషప్రసాదం తిని దుర్మరణం పాలయ్యాడు. వేదవతి నన్ను కాపాడడానికి తనే హంతకురాలు అని అబద్ధం చెప్పింది. కొడుకు అపరకర్మలు చేయడానికి నేను కూడా మౌనం వహించాను. ఇక నాకు దిగులు లేదు! శిక్ష భరించడానికి సిద్ధంగా ఉన్నాను. నడవండి! కానీ... వేదవతి గురించే నా చింత!"

గజేంద్ర ఆయన వైపు చూసి అన్నాడు. "నేను ఒక నెల రోజులు మీ వైపు రాకపోవడానికి కారణం, మీరనుకున్నది కాదు! నాకు అపెండిసైటిస్ ఆపరేషన్ అయింది. అపెండిక్స్ దుష్ట అవయవం. మనిషికి దీనివల్ల ఉపయోగం లేదు! అయినా, రోగగ్రస్తం అయినప్పుడు ప్రాణం తీస్తుంది! మీకు అష్టాంగ పురాణాలు తెలుసు. వేమన భాగవతంలో ఓ పద్యం వుంది. 'అంగవ్రతములో జికిత్సకుడు ఖండించి, శేషాంగ శ్రేణికి రక్ష చేయు క్రియ' అని. శరీరానికి హాని చేసే దుష్టాంగాన్ని తొలగించాలి! మిగిలిన ఆరోగ్యకరమైన అవయవాలను కాపాడాలి! అలాటి శస్త్ర చికిత్స మీరు చేసారు! అది నేరం కాదు!" అని ఇనస్పెక్టర్ బయటకు వెళ్ళిపోయాడు.

పూజారిగారు విష రసాయనాలు కొన్న రసీదుల పుస్తకం స్టేషన్ వెనక చెత్తలో కాలి భస్మం అయి, గాలిలో కలిసిపోయింది!






# మంచుతెరలు

శ్రీమతి గొర్తి వాణిశ్రీనివాస్
✆ 9441345651

**రచయిత్రి పరిచయం**

*గత 5 సంవత్సరాలుగా కథలు, కవితలు రాస్తున్నారు. స్వాతి, కథామంజరి, రవళి, సహరి వంటి అనేక అగ్రపత్రికలలో 150 కథల, రెండు నవలల ప్రచురణ జరిగింది. సామాజిక అంశాలపై స్పందిస్తూ కథలు రాయడం అంటే ఇష్టం. "నాతి చరామి" కథల సంపుటి ప్రచురించారు. సమాజాన్ని ప్రతిబింబిస్తూ రచనలు చెయ్యాలని, విలువలు చాటి చెప్పాలనే ఉద్దేశ్యంతోనే రచనలు చేస్తున్నారు.*

> ***"అందుకే అన్నాను. మీరూ మీరూ ఒకటేనని. ఆస్తులు వాళ్ళకి, దులుపుళ్లు నాకు. మీరింత మూగజీవి కాబట్టే మీ తమ్ముడి ఆటలు సాగుతున్నాయి. చెవులు మెలేసి నా జ్యేష్ఠ భాగం నాకు రాసివ్వు అంటే అప్పుడు తెలిసేవి మీ ప్రేమలు ఏ పాటివో!" కంచంలో అన్నం వడ్డించి, వచ్చి భోంచేయమంది.***

"గతం మర్చిపోయి, తమ్ముడి గుమ్మంలో అడుగుపెడతానంటారా? పర్యవసానాలు బాగా ఆలోచించుకోండి?" కాత్యాయని హాల్లోకి వచ్చి గట్టిగా అనేసరికి సత్యం ఒక్క క్షణం భార్యవంక చూసి, గట్టిగా ఊపిరి పీల్చుకుని "వాడి కూతురు పెళ్లికి నన్ను రమ్మని శుభలేఖ పంపాక వెళ్ళకపోతే బాగుంటుందా? నేను వెళ్లి తీరతాను. నువ్వు రాకపోతే మానెయ్యి!" విసుగ్గా అన్నాడు కుర్చీలో కూర్చుని శుభలేఖ తెరిచి చూస్తూ.

"మీరూ మీరూ ఒకటేగా. నేనేగా బయటదాన్ని! కానీ నా భర్త ఆత్మాభిమానం దెబ్బతింటే తోక తొక్కిన తాచవుతానని నాకు తప్ప ఎవరికి తెలుస్తుంది? 'మాట పడటమంటే కంఠం తెగినట్టే అనేంత పట్టుదల ఉన్నవాడ్ని నేనని' చాలాసార్లు మీరే నాతో అన్నారు. తీరా వెళితే, అక్కడ అవమానం జరిగితే తట్టుకోగలరా? అసలే మీతమ్ముడికి దూకుడు ఎక్కువ. గతంలో మాట్లాడిన మాటలు మార్చిపోయారనుకుంటా!" కూరలు తరిగే చాకు, ప్లేటు ముందు పెట్టుకుని వంకాయలు తరిగి నీళ్ళల్లో వేస్తూ, మధ్యలో భర్త వంక చూస్తూ అంది కాత్యాయని.

సత్యం పడకకుర్చీలో వాలి ఆలోచనలో పడ్డాడు. "అప్పుడు ఉడుకు రక్తం కాబట్టి వాడి గడప తొక్కనని మంగమ్మ శపథం చేశాను. ఈ మలివయసులో బింకాలు చెల్లుబాటు అవుతాయా?"

దీర్ఘాలోచనలో పడ్డాడు సత్యం. పాతికేళ్ల క్రితం సంగతి...

తమ్ముడు శ్రీశైలానికి చదువు అబ్బలేదు. ఊళ్ళో చిన్న చిన్న ఎలక్ట్రికల్ పనులు చేస్తూ వుండేవాడు. మంచి పనివాడు. అయినా కుదురు కాస్త తక్కువ. స్నేహితులు ఎక్కువ.

ఎవరైనా ఫ్యాన్‌లు రిపేరుకి ఇస్తే, వైండింగ్ పోయిందని, బాల్‌బేరింగులు పోయాయని, కొత్తవి వెయ్యాలని చెప్పి పాతవే వేసి వాళ్ళ దగ్గర్నుంచి ఎక్కువ డబ్బులు తీసుకునేవాడు. అదేదో గొప్ప విషయంలా తనతో చెప్పేవాడు.

నాన్న సరిగా పట్టించుకోలేదు. అమ్మ మాట వినేవాడు కాదు. ఊళ్ళో పనీ పాటా లేకుండా తిరుగుతున్నామని మావయ్య వాళ్ళ వూరు తీసుకెళ్లాడు. ఆయనకున్న నాలుగెకరాల మామిడితోట, కొబ్బరితోటల్ని చూసుకోమని చెప్పాడు. కానీ శ్రీశైలం నమ్మకంగా ఉంటూనే కొబ్బరికాయలు కొట్టుకుని తాగడం, మావిడికాయలు కోసుకుని తినడం చేసేవాడు. మేనల్లుడేగా, తింటే ఏం పోయిందని మావయ్య చూసీచూడనట్టు వదిలేశాడు. అది ఆసరాగా తీసుకుని కొబ్బరి, మామిడికాయల్ని మారుబేరానికి అమ్ముకునేవాడు. ఎవరో మావయ్యకి చెబితే శ్రీశైలం ఒప్పుకోకపోగా... చెప్పిన వాళ్ళమీద దౌర్జన్యంగా కలబడ్డాడు.

మావయ్యకి విసుగుపుట్టి ఇద్దర్నీ అక్కడ్నుంచి తరిమేశాడు. అప్పటికే పాతికేళ్ళు వచ్చాయి.

ఏ ఉద్యోగం లేదు. కాలం ఎంత విలువైందో చేతిలో ఏ పనీ లేకుండా, చిల్లిగవ్వ లేకుండా నిలబడ్డప్పుడు తెలిసింది.

తనైతే ఒక స్కూల్‌లో ట్యూటర్‌గా చేరాడు.



శ్రీశైలం ఆటో అద్దెకు తీసుకుని నడుపుతూ కొన్నాళ్ళు గడిపాడు.

అక్క పెళ్ళైన మూడేళ్లకు ఇద్దరు పిల్లలతో తిరిగి పుట్టింటికి రావాల్సిన పరిస్థితి వచ్చింది. అక్క కాపురంలో రేగిన కలతలు చిలికి చిలికి వాళ్ళ విడాకులదాకా వెళ్లింది. నాన్న అతిశయంతో వాళ్లతో మాట్లాడటానికి కూడా వెళ్ళలేదు. కనీసం ఇదేం పనని అల్లుడిని మందలించలేదు. పైగా... విషయం కనుక్కురమ్మని తన భార్యని పంపాడా పెద్దమనిషి. వాళ్ళు ఊరుకుంటారా? దొరికిందే సందని అక్కని తిట్టి, అన్నదమ్ముల్ని తిట్టి, చివరికి నోట్లో నాలుకలేని అమ్మని కూడా నోటికొచ్చినట్టు తిట్టారు. ఇటు భర్తతో చెప్పలేక, కూతురికి నచ్చచెప్పలేక మూగగా ఏడ్చిన అమ్మ. తెల్లారి మంచంలోంచి లేవలేదు. పక్షవాతం బారిన పడిన తల్లిని చూసుకునేందుకు వంతులు పోయాంగా!

కాత్యాయని వంట పూర్తిచేసి హాల్లోకి వచ్చింది.

“ఏమిటంత దీర్ఘంగా ఆలోచిస్తున్నారు? అతగాడు నన్నన్నమాటలు మీరు మర్చిపోయినా, నేను మర్చిపోలేను. మన పెళ్లయ్యాక మీ ఇంటికి ఎప్పుడు వెళ్ళామో గుర్తుందా? మన పెద్దమ్మాయి పుట్టినప్పుడు. మీ తమ్ముడు కూడా అక్కడే ఉన్నాడు. మీరు నన్ను అక్కడ దింపి వెళ్ళాక, అతనన్న మాటలు నా చెవిలో ఇంకా రింగుమంటున్నాయి!” చెబుతూ కళ్ళొత్తుకుంది కాత్యాయని.

“అప్పుడు వాడిది ఉడుకురక్తం. విచక్షణ తెలియని వయసు. నోటికేదొస్తే అది అనేసేవాడు. అమ్మానాన్నల మరణ సమయంలో కూడా మనం వెళ్ళలేదు. ఆ క్షోభ నాకు ఉండనే ఉంది. వాడికీ అరవయ్యేళ్ళు వస్తున్నాయి. పిల్ల పెళ్లి చేసుకుంటున్నాడు. నన్ను రమ్మని కార్డు పంపాడు. బతికినంత కాలం బతకం. కలిసి పెరిగినవాళ్ళం. ఆ మమకారం పీకుతోంది కాత్యా! నీ మాట పట్టుకుని వెళ్ళకపోతే ఇక మేమిద్దరం కలిసే క్షణాలు రావేమో!” కళ్ళజోడు తీసి కళ్ళు తుడుచుకున్నాడు సత్యం.

“సరే, నేనూ మీతో వస్తాను. మీ తమ్ముడు ఏదైనా తేడాగా మాట్లాడితే వెంటనే తిరుగు ప్రయాణమే!” అంది కాత్యాయని వంటపని పూర్తి చేసి, డైనింగ్ టేబుల్ సర్దుతూ.

“అలాగే, వాడేమన్నా నువ్వు పట్టించుకోకు. కాస్త ఓపికగా వుందాం. పెళ్లికి పిలిచి తగువు పెట్టుకోడులే!”

“ఏమో చూద్దాం. ఆనాడు ఆస్తి కూడా తీసుకోకుండా కట్టుబట్టలతో ఇల్లు వదిలి వచ్చేసాం. ఇల్లు అమ్మిన డబ్బులో కొంత ఇస్తాను రమ్మని కబురు చేసినా మీరు వెళ్ళలేదు. ఆ డబ్బు ఏం చేశాడో మరి! మీ పంతం అలాంటిది.” అంది డిన్నర్ ప్లేట్లు బట్టతో తుడుస్తూ.

“డబ్బుదేముంది కాత్యా, ఆదరంగా ‘అన్నయ్యా!’ అని పిలిస్తే చాలు. ఈ వయసులో ఇంకేం కావాలి నాకు?”

“అందుకే అన్నాను. మీరూ మీరూ ఒకటేనని. ఆస్తులు వాళ్ళకి, దులుపుళ్లు నాకు. మీరింత మూగజీవి కాబట్టే మీ తమ్ముడి ఆటలు సాగుతున్నాయి. చెవులు మెలేసి నా జ్యేష్ఠ భాగం నాకు రాసివ్వు అంటే అప్పుడు తెలిసేవి మీ ప్రేమలు ఏ పాటివో!” కంచంలో అన్నం వడ్డించి, వచ్చి భోంచేయమంది.

“పెడితే పెళ్ళికూతురు, పెట్టకపోతే ఏదో కూతురని అనుకునేంత నాసిరకం కాదు నీ మొగుడు. అప్పుడేదో కోపంలో

వాడింటికి వెళ్ళనన్నాను. మా తాతలనాటి ఆస్తి వాడు తిన్నా నేను తిన్నా ఒకటేలే. మనకేం లోటు లేదుగా ఇప్పుడు!" లేచొచ్చి భోజనం కంచం ముందు కూర్చున్నాడు.

"మీ సర్దుబాటు గుణం మీ తమ్ముడికి కూడా వుంటే బాగుండేది." అని నసుగుతూ ఇల్లు సర్ది వచ్చింది.

సత్యం భోంచేసి, గదిలో శుభలేఖ చూస్తూ పడుకున్నాడు.

'మదర్పిత చందన తాంబూలాది సత్కారాలు స్వీకరించ ప్రార్థన. మంగళం మహత్.

మీ ఆగమనాభిలాషి. సత్యకుమార్ దంపతులు, శ్రీశైలం దంపతులు.

"మా తమ్ముడు నా పేరు కూడా శుభలేఖలో వేశాడు చూసావా?" అన్నాడు కళ్ళు పెద్దవి చేసి చూస్తూ.

"ఒక్కమాట చెప్పనా... ఈరోజుల్లో జనాలు ఎలావున్నారంటే, గతంలో వదిలేసిన బంధుత్వాన్ని, వాళ్ళ ఇళ్ళల్లో కార్యక్రమాలు అనగానే అమాంతం కలిపేసుకుంటున్నారు. లేకపోతే అవతల పెళ్ళివారు వీళ్ళకి బంధువులు లేరని అనుకుని నవ్వీపోతారని ఒక ఫీలింగ్‌తో ప్రేమలు ఒలకబోస్తున్నారు. అవన్నీ నిజాలు కావని మనకీ వాళ్ళకీ తెలుసుగా!" అంది పక్కలు దులిపి, వేస్తూ.

కాత్యాయని చెప్పింది నిజమే అనిపించినా "ఇవన్నీ అన్ని కుటుంబాల్లో ఉండేవేలే" అన్నాడు సత్యం.

వాళ్లిద్దరి తర్జన భర్జనలు మరో వారం రోజులు సాగాయి. సత్యానికి తమ్ముడి కూతురి పెళ్ళికి వెళ్ళాలని బాగా కోరికగా వుందని అర్థం చేసుకున్న కాత్యాయని "అక్కడ ఏం జరిగినా కిక్కురుమనకుండా ఉంటేనే వెళదాం. వచ్చాక బాధ పడి, హాస్పిటల్ పాలయితే మాత్రం బాగుండదు. ముందే చెబుతున్నాను." అని తెగేసి చెప్పేసింది.

'మనసు మనిషి ఆధీనంలో ఉండే మాటైతే ఎంతో బాగుంటుంది' అని నిట్టూర్చాడు సత్యం.

రేపు పెళ్ళనగా విజయనగరం పెళ్ళికి బయల్దేరారు.

బస్సెక్కి, తర్వాత ఆటో ఎక్కి, కొంత దూరం కాలి నడకన చివరికి పెళ్ళింటికి చేరుకున్నారు.

అసలే చలికాలం. ముసుగులు కప్పుకుని వచ్చిన వాళ్ళిద్దర్నీ ముందు గుర్తుపట్టలేదు శ్రీశైలం.

అప్పటికే వచ్చిన బంధువులు ఒక్కక్కరుగా లేచొచ్చి చూసారు. "ఒరేయ్ సత్యం నువ్వా! అక్కడే నిలబడిపోయావే. రారా లోపలికి!" అంటూ సత్యం పెదనాన్న పెద్దకొడుకు సత్యాన్ని లోపలికి తీసుకెళ్లాడు.

పెళ్ళికూతురు కూడా "పెదనాన్నా వచ్చావా?" అంటూ ఆప్యాయంగా పలకరించింది.

శ్రీశైలం అన్నగారి దగ్గరకొచ్చి మౌనంగా నిలబడ్డాడు. "ఏరా, బాగున్నావా? కూతురి పెళ్ళి చేస్తున్నావ్. బాగుందిరా" అన్నాడు సత్యం తమ్ముడి భుజం మీద చేత్తో తడుతూ.

శ్రీశైలం అమాంతం అన్నగార్ని కౌగలించుకుని, "అన్నయ్యా, నువ్వు రావడంతో నాకు కొండటం బలం వచ్చింది." అన్నాడు కళ్ళు తుడుచుకుంటూ.

"రాకుండా ఎలా ఉంటానురా?" సత్యం గొంతు మూగబోయింది.

"పెళ్ళింట్లో నవ్వులే వుండాలి. కన్నీళ్లు, కష్టాలు వదిలేయాలి. పదండి! మన మగవాళ్ళకి పెరట్లో విందు ఏర్పాట్లు చేశా." అన్నాడు సత్యం వేలువిడిచిన మావయ్య కొడుకు వాళ్ళని ఉత్సాహ పరుస్తూ.

శ్రీశైలం భార్య సుందరి వచ్చి కాత్యాయనిని పలకరించింది.

"తెల్లారితే పెళ్లి. మీ మగవాళ్ళంతా పెరట్లో పీపాలు ఖాళీ చేస్తూ కూర్చుంటే పెళ్లి పనులు ఎవరు చేస్తారు? తెల్లారి మీరు లేవకపోతే ఎలా?" అంది సుందరి.

"మా అన్నయ్య వచ్చిన శుభ సందర్భంలో మా విందుకు, చిందులు తోడై డబుల్ వినోదం చేసుకోవాలి!" అంటూ శ్రీశైలం నవ్వుతూ అన్నగారిని తనతో తీసుకెళ్లాడు.

ఆడవాళ్ళు నవ్వుకుంటూ, పెళ్ళిపనుల్లో నిమగ్నమయ్యారు.

మర్నాడు శ్రీశైలం కూతురి పెళ్ళి ఆనందోత్సాహాల మధ్య జరిగింది. సాయంత్రానికల్లా అప్పగింతలు చేసి అత్తవారింటికి పిల్లని పంపించారు. బంధువులంతా ఒక్కొక్కరే వెళ్ళిపోయారు.

సత్యం కూడా తమ్ముడితో, "వెళ్లొస్తాంరా. నువ్వూ, సుందరి వీలుచేసుకుని హైద్రాబాద్ రండి." అని చెప్పాడు.

"అలాగే వస్తాం అన్నయ్యా. నువ్వు వస్తావని కల్లో కూడా అనుకోలేదు. నేను శుభలేఖ పంపకపోయినా నా మీద ప్రేమతో మీరిద్దరూ రావడం నాకు చాలా సంతోషంగా వుంది. ఇకమీదట మనం ఇలాగే రాకపోకలు సాగిద్దాం!" అనగానే సత్యం మొహం పాలిపోయింది.

సత్యం ఏదో అనేంతలో కాత్యాయని కల్పించుకుని, "సరే, మేం వెళ్ళొస్తామయ్యా..." అని భర్తను బయటకు తీసుకొచ్చింది.

బస్టాండుకి వెళ్లి బస్సెక్కారిద్దరూ.

"అంతా బాగానే ఉంది కానీ, శుభలేఖ పంపలేదంటాడేవిటి? నువ్వు మీ సుబ్బులు పిన్ని ఇంటికి వెళ్ళినప్పుడు నీ చేతికిచ్చి నన్ను రమ్మని చెప్పలేదూ!" అన్నాడు సత్యం.

"మీ తమ్ముడు అన్నది మీకు స్వయంగా తనే వచ్చి ఇవ్వలేదని. నాకు ఇచ్చాడు కదా, గతాన్ని మర్చిపోయి చక్కగా ఉన్నారుగా మీ అన్నదమ్ములు!"

"అదేనే రక్త సంబంధం అంటే! నువ్వు వెళ్లొద్దన్నావనే పంతంతోనే ఏం జరుగుతుందో చూద్దామని పట్టుబట్టి మరీ వచ్చాను. జీవితానికి సరిపడా సంతోషం దక్కింది. డబ్బు ప్రస్తావన మా మధ్యలో రాకపోవడం మరింత సంతోషం. ఈ తృప్తి చాలు నాకు. ఇక నీ సూటిపోటీ మాటలు నన్నేం చెయ్యలేవు!" అన్నాడు తెల్లటి మీసాన్ని దువ్వుకుంటూ.

"బాగుంది బడాయి" అని అటు తిరిగి నవ్వుకుంది.

సుబ్బులు పిన్ని ఇంటికి వెళ్ళినప్పుడు శుభలేఖ చూసిన కాత్యాయని వెంటనే శ్రీశైలానికి ఫోన్ చేసి, "పెళ్లి కార్డులో మీ

అన్నయ్య పేరు వేశావయ్యా. చాలా సంతోషం!” అని చెప్పినప్పుడు, ”మీరూ’ అన్నయ్యా రండి వదినా” అని అప్పుడు చెప్పాడు.

“అలా ఎవరైనా పెళ్ళికి పిలుస్తారా?” అంటే, “చిన్నవాడైన శ్రీశైలానికి జ్ఞానం లేకపోయినా, పెద్దదానివి నువ్వన్నా ఆ అన్నదమ్ముల్ని కలపచ్చుగా! సుందరి కూడా తన భర్త మూర్ఖత్వాన్ని మార్చలేకపోతున్నానని నాతో చెప్పి బాధపడింది. ఇక నువ్వే పూనుకోవాలి!” అని సుబ్బులు పిన్ని చెప్పాక తను ఆ నిర్ణయం తీసుకుంది. మంచుతెరలు తొలగిపోతేనే వెలుగు ఉనికి తెలిసేది. ఈగోలు తగ్గించుకుంటేనే బంధాల విలువ పెరిగేది.

వెళ్ళబట్టే అపార్థాలు తొలగిపోయి రాజీ కుదిరింది. తృప్తిగా అనుకుంది కాత్యాయని.






# ఆమె నడిచిన దారి


శ్రీ సూర్య గండ్రకోట

✆ 9666903960


**రచయిత పరిచయం**

*తెనాలిలో పుట్టిన శ్రీ గండ్రకోట సూర్యనారాయణ శర్మగారు ఎమ్.ఏ., తెలుగు సాహిత్యం (ఉస్మానియా యూనివర్సిటీ) చదివి, తెలంగాణా స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంక్‌లో ఏ.జి.ఎమ్.గా పదవీ విరమణ చేశారు. వివిధ ప్రక్రియల్లో రచనా వ్యాసంగం చేస్తున్నారు. వీరివి 80 వరకు కథలు ప్రచురితమయ్యాయి. వాటిలో పాతిక పైగా కథలు బహుమతులు గెలుచుకున్నాయి. ఇప్పటివరకు మూడు నవలలు మాసపత్రికలోనూ, ఒక 24 వారాల సీరియల్ వారపత్రికలోనూ ప్రచురితమయ్యాయి. ముప్పయ్ వరకు కవితలు, గజల్స్ వివిధ పత్రికలలో ప్రచురితమయ్యాయి. మూడు వందల వరకు పద్యాలు వివిధ సాంఘికమాధ్యమాల్లో వచ్చాయి.*

> ***మా దగ్గరికి వచ్చిన మేజర్లైన యువతీయువకులకు మేం చట్టప్రకారం పెళ్ళి చేస్తాం. కానీ ఆ పిల్లలను కన్నవాళ్ళు ఎంత క్షోభకు గురవుతారో మాకు తెలుసు. కానీ మేమేమీ చేయలేని పరిస్థితి. ఇదంతా మీ యువతరం ఆలోచించదు. ఈరోజు ఈ అమ్మాయి నడిచిన దారే సరైనది. నువ్వు ఆమెపై కోపగించుకోకుండా, ఆమె తల్లిదండ్రుల్ని కన్విన్స్ చేయటానికి ప్రయత్నించు. మన భారతీయ సంప్రదాయం ప్రకారం పెద్దవాళ్ళ అంగీకారంతో పెళ్ళిళ్ళు జరగటమే సరైన పద్ధతి"***

సౌమ్య. ఫోన్ స్క్రీన్‌పై కనిపిస్తున్న పేరు చూడటంతోనే ఆమె పెదవులపై చిరునవ్వు విరిసింది. వెంటనే ఫోన్ తీసి చేసి "హల్లో" అంది మృదు మధురంగా.

"......"

అట్నుంచి వినిపిస్తున్న మాటలకు సమాధానంగా నవ్వి "నువ్వు చెప్పినవన్నీ గుర్తున్నాయి. ఇదెంత ముఖ్య విషయమో నాకు తెలీదా? ఎలా మరచిపోతాను? ప్రస్తుతానికి ఆ పనిలోనే ఉన్నా!"

"......"

"ఇక్కడ ఏ సమస్యా లేదు. అంతా మామూలుగా ఉంది. నువ్వు కంగారుపడకు."

"......"

"ఓకే అర్థమైంది. అక్కడ అపాయింట్‌మెంట్ మూడున్నరకు కదా! ఇప్పట్నుంచే ఎందుకంత కంగారు? నేను మూడు గంటలకల్లా అక్కడుంటాను. సరేనా. బై" అంటూ ఫోన్ కట్ చేసి మళ్ళీ రాత పనిలో పడింది. పది నిమిషాలయ్యాక మళ్ళీ ఫోన్ మ్రోగింది. చూస్తే మళ్ళీ అదే పేరు. ఫోన్ తీసి, "చెప్పు" అంది.

"......"

"ఎవ్వరికీ అనుమానం రాకుండా అంతా నేను చూసుకుంటాగా. నువ్వెందుకు కంగారు పడుతున్నావు? అంతా మనం అనుకున్నట్లే అవుతుంది. ప్రశాంతంగా ఉండు!" అంది.

ఆ తర్వాత అవతలి వ్యక్తి మాటలు ఇంకా చెప్పుకుపోతున్న జాగ్రత్తలకు తనలో తానే నవ్వుకుంటూ, "ఏ గొడవా జరగదు స్వామీ! ఫోన్ పెట్టేయ్" అనేసి తిరిగి పెన్ను అందుకుంది. ఉత్తరం పూర్తి చేస్తుండగా మళ్ళీ ఫోన్ మ్రోగింది. 'అబ్బబ్బ... ఈ మహానుభావుడు ఇన్ని జాగ్రత్తలు చెప్పాలా?' అనుకుంటూ ఫోన్ తీసింది. చూస్తే ఆ కాల్ తన స్నేహితురాలు స్నేహ నుంచి!

ఫోన్ తీసి "హల్లో" అనగానే అటునుంచి వెక్కివెక్కి ఏడుస్తున్న శబ్దం వినబడటంతో "స్నేహా! ఏమైందే? ఎందుకలా ఏడుస్తున్నావు?" అనడిగింది కంగారుగా.



"మా పాప మెట్ల మీద నుంచి కిందపడి తలకి దెబ్బ తగిలింది. సమయానికి రాజేంద్ర కూడా లేరు. నాకు కాళ్ళూ చేతులూ ఆడటంలేదే" అంటూ భోరుమంది.

"పాపకేం కాదు. నువ్వు ఏడవకు. నేను ఐదు నిమిషాలలో అక్కడుంటా. సరేనా?" అని తను రాయదలచుకున్నదంతా గబగబా రాసి, ఆ నోట్ బుక్ అలాగే తెరచి ఉంచి, దానిపైన ఒక పేపర్‌వెయిట్ పెట్టి లేచింది. అక్కడ్నుంచి వెళ్ళి తన గదిలో మంచం మీద రెడీగా అవసరమైన సామాన్లన్నీ సర్ది పెట్టుకున్న బ్యాగ్ భుజాన వేసుకుంది. అక్కడ నుంచి మెల్లిగా వంటింట్లో ఉన్న తల్లి దగ్గరికెళ్ళింది.

ఆమె భుజాన బ్యాగును చూడగానే “ఎటో బయల్దేరినట్లున్నావు?” అడిగింది ఆమె తల్లి.

“అవునమ్మా! స్నేహవాళ్ళ పాప మెట్ల మీద నుంచి కింద పడిందట. ఆస్పత్రిలో చేర్చారు. అది వెంటనే రమ్మని ఫోన్ చేసింది. నే వెళ్ళాలి!”

“సర్లే. తొందరగా వస్తావుగా. నువ్వొచ్చాక ముగ్గురం కలిసి భోజనం చేద్దాం!” అందావిడ.

ఆమె కాసేపు తటపటాయించి “లేదమ్మా. నేనెప్పుడొస్తానో నాకే తెలీదు. నాకోసం ఎదురుచూడకుండా మీరు భోజనాలు కానిచ్చెయ్యండి” అని చెప్పేసింది.

బయటికి వెళ్ళబోతూ తండ్రి గది గడప దగ్గర ఆగిందామె. ఆరోజు ఆదివారం కావటంతో షాపుకి వెళ్ళే పనిలేదు కాబట్టి ప్రసాదరావు ఇంట్లోనే ఉండి, సిస్టమ్ మీద ఏవో అకౌంట్స్ చూసుకుంటున్నాడు. ఆమె తండ్రితో ఏదో చెబుదామనుకుని మళ్ళీ ఎందుకో తటపటాయించింది. అంతలోనే మనసు మార్చుకుని, చెప్పులేసుకుని గబగబా వెళ్ళిపోయింది. ‘తను తీసుకున్న నిర్ణయం గురించి ముందే చెప్పి, ఆయన్ని ఎందుకు బాధపెట్టాలి? తర్వాత ఎలాగైనా తెలుస్తుందిగా’ అనుకుంది.

తలుపుదాకా వచ్చి, ఏమీ చెప్పకుండా వెళ్తున్న కూతుర్ని చూసి ప్రసాదరావు ఆశ్చర్యపోయాడు. ఏనాడూ తనకు చెప్పకుండా బయటకు అడుగుపెట్టని తన కూతురు, అలా వెళ్తుంటే కొత్తగా అనిపించిందాయనకు. ‘అంటే ఏదో చాలా ముఖ్యమైన పనే ఉందన్నమాట’ అనుకున్నాడు మనసులో.

★★★

అరగంటలో ఆస్పత్రికి చేరుకుని, రిసెప్షన్ వైపు నడిచింది. పాప ఎమర్జెన్సీ వార్డులో ఉందని రిసెప్షనిస్ట్ చెప్పటంతో, గబగబా అటుగా నడిచింది. అక్కడ దీనంగా స్నేహ ఒక కుర్చీలో కూర్చుని ఉంది. సౌమ్యను చూడటంతోనే అమాంతం లేచి వచ్చి ఆమెను కావలించేసుకుని భోరున ఏడ్చేసింది.

ఆమెనలాగే పొదివి పట్టుకుని, తన చేత్తో ఆమె భుజమ్మీద నిమురుతూ ఉండిపోయింది. అప్పుడే బయటికొచ్చిన నర్సుని ఆపి, పాప గురించి అడిగింది. ఆమె “డాక్టర్‌గారు పాపకి ట్రీట్‌మెంట్ చేస్తున్నారు. మీరేమీ కంగారు పడకండి!” అని చెప్పి వెళ్ళిపోయింది.

స్నేహ కాస్త ఊరడిల్లాక “మీ ఆయనకి కబురు చేశావా?” అనడిగింది.

చేశానన్నట్లు తలూపి, “బయల్దేరి చాలాసేపైంది. వచ్చేస్తారు. ఏదో అర్జెంట్ పని ఉందని వాళ్ళ ఊరికెళ్ళారు. ఫోన్ చేశాను. వెంటనే బయల్దేరారు!” అంది.

ఇద్దరూ అక్కడే కూర్చున్నారు. మరో పావుగంట గడిచేసరికి స్నేహ భర్త రాజేంద్ర అక్కడికి ఆదరాబాదరాగా వచ్చాడు. వస్తూనే అందర్నీ కంగారు పెట్టేశాడు. “ఏమైంది నా బేబీకి? అయ్యో! నేను లేనప్పుడిలా జరిగిందే” అంటూ కన్నీళ్ళు పెట్టుకుంటూ అల్లాడిపోయాడు. ఆ తర్వాత అరగంటసేపు రాజేంద్ర తన కూతురు గురించి కనిపించిన ఆస్పత్రి స్టాఫ్‌నందర్నీ అడుగుతూనే ఉన్నాడు. దాదాపు పాతికేళ్ళున్న ఆ యువకుడు తన కూతురి కోసం అలా ఆరాటపడటం, కన్నీళ్ళు పెట్టటం చూసి, సౌమ్య ఆశ్చర్యపోయింది.

అతని ఆవేదన, ఆరాటాలు చూస్తుంటే సౌమ్యకు తన చిన్నతనం గుర్తుకొచ్చింది.

★★★

మొదట్లో ప్రసాదరావు చిన్న వ్యాపారం చేస్తుండేవాడు. రాజ్యలక్ష్మిని పెళ్ళి చేసుకున్న సమయంలో అతని బిజినెస్, ఆ ఊరి సెంటర్లో ఒక అద్దె షాపులో నడుస్తుండేది. పెళ్ళైన నాలుగేళ్ళవరకూ పిల్లలు లేక ఆ దంపతులు ఎంతో చింతించారు. వాళ్ళు తిరగని యాత్రాస్థలం లేదు. వాళ్ళు మొక్కని దేవుడు లేడు. నాలుగేళ్ళ తర్వాత ఏ దేవుడు కరుణించాడో అన్నట్లుగా పుట్టింది సౌమ్య.

కూతురు పుట్టాక అతనికి వ్యాపారంలో బాగా కలిసొచ్చింది. ఊరి మెయిన్ సెంటర్లో నాలుగొందల గజాల స్థలం కొని అందులో మూడంతస్తుల ఇల్లు కట్టించాడు. అందులో రెండస్తులు తన షాప్ కోసం కేటాయించాడు. మూడో అంతస్తును తన ఇల్లుగా చేసుకున్నాడు. ఆ పైన ఒక చిన్న పెంట్ హౌస్ కట్టి, దాని ముందు అనేక రకాల పూలమొక్కలు పెంచాడు. తెల్లారి లేచాడంటే అతని సమయమంతా కూతురితోనూ, ఆ మొక్కలతోనూ గడచిపోయేది.

లేకలేక కలిగిన సంతానం కావటంతో, పుట్టిన దగ్గర్నుంచీ ఆమె కాలు కిందపెడితే ఎక్కడ కందిపోతుందేమోనన్నంత ప్రేమగా పెంచాడు. సౌమ్య కూడా తండ్రిని చూడకుండా క్షణం ఉండేది కాదు. పొద్దున లేచిన దగ్గర్నుంచీ "నాన్నా! నా షూస్ మీరే వెయ్యండి, నాన్నా నాకు అన్నం మీరే పెట్టండి" అంటూ అన్ని పనులూ తండ్రితోనే చేయించుకునేది. స్కూల్ బస్ ఇంటి దగ్గరికొచ్చినా, అతడు మాత్రం కూతుర్ని తన కార్లో తీసికెళ్ళి స్కూల్లో దించేవాడు. స్కూల్ అయిపోయే సమయానికి, తన షాపుని వర్కర్సుకి అప్పజెప్పి, తను కారుతో స్కూల్ ముందు నిలబడేవాడు. స్కూల్ వదలటం ఆలస్యం అయితే... బయటికి రాబోయే తన గారాలపట్టి కోసం అతడి చూపులు ఆత్రంగా ఎదురు చూసేవి! పిల్లలందరూ ఒక్కుమ్మడిగా బయటికి వస్తున్నప్పుడు వాళ్ళలో తన డార్లింగ్ ఎక్కడుందా అని ఎంతో ఆత్రంగా వెదికేవాడు. సౌమ్య పరిగెత్తుకొచ్చి, "నాన్నా!" అంటూ అతని మెడ చుట్టూ తన రెండు చిన్ని చేతులు వేసినపుడు, అతనికి ఒలింపిక్ మెడల్ తన మెడలో పడినంత ఆనంద పడిపోయేవాడు.

ఆమె పదో తరగతిలో ఉండగా ఆమె రెండు కిడ్నీలు పనిచెయ్యకపోవటంతో, తన కిడ్నీ ఒకటి ఇచ్చి ఆమెను కాపాడుకున్నాడు. ఆ ఆపరేషన్ తర్వాత ఆయనే రోజూ ఆమెను తన కార్లో స్కూలు దగ్గర దించేవాడు. మళ్ళీ స్కూల్ నుంచి తీసుకురావటానికి ఆయన తన బిజినెస్ పనులు పక్కనబెట్టి వెళితే, "నాన్నా! నేను నా ఫ్రెండ్సందరితో కలిసి స్కూల్‌బస్సులో ఇంటికొస్తాను. నువ్వు రావద్దు" అని నిక్కచ్చిగా చెప్పేసరికి అతని మనసు ఎంతో బాధతో మూలిగింది. కానీ కూతురి మాటకు ఎదురు చెప్పలేక ఒప్పుకోవాల్సివచ్చింది. ఆమె స్కూల్నుంచి ఇంటికొచ్చే సమయానికి, షాపులోంచి వచ్చి "నా బంగారం ఏది? ఇంకా స్కూల్నుంచి రాలేదా? ఇంత లేటేంటి?" అంటూ నానా హడావుడి పెట్టేవాడు. ఆమె రాగానే ఆమెను చూసి, మాట్లాడకుండా వెళ్ళి షాపులో కూర్చునేవాడు.

ఆమె కాలేజీలో చేరాక ఎప్పటికప్పుడు కాలేజీ సంగతులు కనుక్కుంటూ, ఆమెకి ఏ లోటూ రాకుండా చూసుకోసాగాడు. క్రమంగా సౌమ్య పెద్దదవుతున్నకొద్దీ ఆమె మీద ప్రేమ అదే రీతిలో ఆయనలో పెరిగిపోసాగింది. ఒక్కొక్కప్పుడు ఆయన గారాబాన్ని చూసి రాజ్యలక్ష్మి భయపడిపోయేది. "గారాబంతో మీ కూతుర్ని మీరే చెడగొడుతున్నారు. అది అడిగిందని

స్కూటీ కొన్నారు. అడగకున్నా డెబ్బై వేలు పెట్టి సెల్‌ఫోన్ కొనిచ్చారు. ఇలా ఖరీదైన వస్తువులు ఇవ్వటం అలవాటు చెయ్యకూడదు" అంటూ భర్తని విసుక్కునేది.

"నువ్వేమైనా చెప్పు వింటాను. కానీ నా కూతురికీ నాకూ మధ్య మాత్రం రాకు. నా బంగారుతల్లికి ఏమి తక్కువ. అది మహారాణి!" అనేవాడాయన.

"కాస్త పిల్లకి కష్టం కూడా తెలియాలి. మీరేమో ఇంట్లో ఏ పనీ ముట్టుకోనివ్వరు. ఆడపిల్ల అన్నాక అన్ని పనులూ నేర్చుకోవాలి" అని ఆమె అనగానే "అంటే మగవాడైతే ఏమీ నేర్చుకోనవసరం లేదా? ఇంట్లో పనిమనుషులుండగా దానికేం ఖర్మ ఇంటి పనులు చెయ్యటానికి? చెప్పాగా అది మహారాణి అని" అంటూ ఆమె మాటలు కొట్టిపారేసేవాడు. ఈ అతి గారాబం ఎటు దారితీస్తుందో అని ఆమె అప్పుడప్పుడు భయపడేది.

★★★

రాజేంద్ర తన కూతురి కోసం పడుతున్న తాపత్రయాన్ని చూస్తున్న సౌమ్యకు, తన చిన్నతనంలో తండ్రి తన కోసం పడ్డ ఆరాటం, ఆవేదన, త్యాగం కళ్ళముందు మెదిలాయి. తన తండ్రి తనను ఎంతగా ప్రేమించాడో మననం చేసుకుంటుంటే ఆమె కళ్ళలో అప్రయత్నంగానే గిర్రున నీళ్ళు తిరిగాయి.

అంతలో డాక్టర్ బయటికొచ్చి, "ఇప్పుడు మీ పాప ఓకే. సాయంత్రం దాకా అబ్జర్వేషన్లో ఉంచి, డిశ్చార్జ్ చేస్తాం. వెళ్ళి పాపను చూడండి" అనటంతో స్నేహ, రాజేంద్ర ముఖాలు తెరిపినపడ్డాయి.

అప్పటికే టైము మూడున్నర దాటింది. సెల్‌ఫోన్లో టైమ్ చూసుకుంటూ లేచిన సౌమ్య, "స్నేహా! మరి నే వస్తానే" అంది.

అందుకు బదులుగా రాజేంద్ర, "చాలా థాంక్సండీ. సమయానికి మీరొచ్చి స్నేహకు మనోధైర్యమిచ్చారు" అన్నాడు. ఫర్వాలేదన్నట్లుగా నవ్విందామె.

ఆమె బయల్దేరగానే ఆమెతోపాటుగా కొద్దిదూరం వచ్చిన స్నేహ... "అక్కడికే వెళ్తున్నావా? బాగా ఆలోచించుకున్నావా? ఒకసారి ముందుకు అడుగేస్తే మళ్ళీ వెనక్కి తిరిగి తీసుకోలేవు, చెప్తున్నా!" అంది.

సౌమ్య నవ్వేసి, "ఏం ఫర్వాలేదే. ఆ సంగతి నేను చూసుకుంటానుగా. నువ్వూ వస్తావనుకున్నాను. కానీ నీకిప్పుడు కుదరదుగా! అంతా అయ్యాక నేనే నీకు ఫోన్ చేస్తాలే" అంటూ అక్కడ్నుంచి కదిలి వెళ్ళిపోయింది.

అలా వెళ్తున్న ఆమెను చూస్తూ, తన స్నేహితురాలు ఇప్పుడు వేస్తున్న అడుగు, దాని జీవితాన్ని ఏ మలుపు తిప్పుతుందో అని భయపడుతున్న స్నేహ, "దాని భవిష్యత్తు బాగుండేట్లు చూడు తండ్రీ" అని దేవుడికి మనసులోనే దణ్ణం పెట్టుకుంది.

★★★

నాలుగవుతుండగా ఆ ఆవరణలోకి ప్రవేశించిందామె స్కూటీ. అప్పటికే ఆమె కోసం అందరూ ఎదురుచూస్తున్నారు. ఆమెను చూడగానే అందరి ముఖాల్లోనూ ఆనందం తొంగిచూసింది. అక్కడ ఆమె కోసం ఎంతో ఆర్తిగా ఎదురుచూస్తున్న అభినవ్, "ఏమిటీ ఆలస్యం. రా రా... మనిద్దరం సంతకాలు చెయ్యటమే ఆలస్యం!" అన్నాడు.

కానీ ఆమె అతనిచ్చిన పెన్ అందుకోలేదు. అది చూసి, చుట్టూ ఉన్నవాళ్ళంతా ఆశ్చర్యపోయారు.

"ఏంటి సౌమ్యా ఆలోచిస్తున్నావ్? సంతకం చేద్దాం రా!" అన్నాడు మళ్ళీ అభినవ్.

"నేను నీతో కాస్త మాట్లాడాలి" అందామె.

"మనం తర్వాత మాట్లాడుకోవచ్చు. మళ్ళీ ఆఫీసర్‌గారు వెళ్ళిపోవాలట" అన్నాడతడు.

"కాదు. ఇప్పుడే మాట్లాడాలి" అందామె స్థిరంగా. ఆ తర్వాత ఒక్క నిమిషం తన చుట్టూ ఉన్నవాళ్ళందర్నీ ఒకసారి చూసి, అభినవ్ వైపు తిరిగి, "ఐయాం సారీ అభినవ్. గత ఆరు నెలలుగా మనం ప్రేమించుకుంటున్నాం. పెళ్ళి చేసుకుందామనుకున్నాం. నాతో పెళ్ళికి మావాళ్ళూ, మీవాళ్ళూ ఒప్పుకోరేమోనన్న భయంతో నీతో రిజిస్టర్ మ్యారేజికి సిద్ధపడ్డాను. అయితే నేను చేస్తున్న పని సరైనది కాదనీ, మా అమ్మానాన్నలకి ద్రోహం చేస్తున్నానన్న సంగతి నాకీ రోజే అర్థమైంది."

అప్పుడు అభినవ్ ఆమెతో, "నీ కళ్ళు ఇప్పుడు తెరుచుకున్నయ్యా? అట్లాంటిదానివి నన్నిక్కడిదాకా ఎందుకు తెచ్చావు?" అని అడిగాడు.

"మా నాన్న నన్నెంతో అపురూపంగా పెంచారు. నాకోసం అహరహమూ తపన పడ్డారు. నాకోసం తన శరీరంలో ఒక భాగాన్ని నవ్వుకుంటూ ఇచ్చేసిన త్యాగశీలి మా నాన్న. అలాంటి మా నాన్న అందించిన ప్రేమకి బదులుగా నేను చెయ్యబోయిందేమిటి? నమ్మకద్రోహమా? మన తల్లిదండ్రులు అనుక్షణమూ మన శ్రేయస్సు కోసమే తపిస్తారు. మనకి చిన్నపాటి అనారోగ్య సమస్య వచ్చినా వాళ్ళు తలక్రిందులౌతారు. ఆ అనారోగ్యాన్ని తమకిచ్చి, తమ బిడ్డ మాత్రం బాగుచెయ్యమని భగవంతుడ్ని వేడుకుంటారు. వాళ్ళు మనని ఒక తిట్టు తిట్టినా, చిన్న దెబ్బ కొట్టినా, అది మన మంచికోసమేనని అర్థం చేసుకోలేక, ఉక్రోషంతో వాళ్ళమీద మనం కోపాన్ని పెంచుకుంటాం. 'నీ కళ్ళు ఈ రోజే తెరుచుకున్నయ్యా?' అని అడిగావు అభీ! ఔను. నిజంగానే నా కళ్ళు ఈ రోజే తెరుచుకున్నయ్. నేను చెయ్యబోయిన తప్పిదం ఏమిటో స్పష్టంగా అర్థమైంది. అందుకే నా నిర్ణయం మార్చుకున్నాను. ఈరోజు నేనసలు ఇక్కడికి వచ్చేదాన్నే కాదు. కానీ నాకోసం ఇక్కడ ఎంతో ఆశగా ఎదురుచూసే నీకు, నా మనసులోని మాట చెప్పి, నిన్ను కన్విన్స్ చేద్దామని వచ్చా."

"మనది నిజమైన ప్రేమే అయితే, అందరి అంగీకారంతో, పెద్దల సమక్షంలో మన పెళ్ళి జరుగుతుంది. నేనిప్పుడు వెళ్ళి మన ప్రేమ గురించి మా నాన్నకి చెబుతాను. ఆయన ఒప్పుకుంటేనే మన పెళ్ళి జరుగుతుంది. లేకుంటే లేదు. నిన్ను నేను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను కానీ, నాకిప్పుడు మన ప్రేమకన్నా మా నాన్నే ముఖ్యం. ఇంతదూరం నిన్ను తెచ్చినందుకు మనస్ఫూర్తిగా మరోసారి 'సారీ' చెబుతున్నాను. మా ఇద్దర్నీ బలపరుస్తూ ఇక్కడికొచ్చిన మన మిత్రబృందంలోని అందరికీ నా కృతజ్ఞతలు" అన్నది.

ప్రేమమత్తులో తొందరపాటు నిర్ణయం తీసుకున్నా, సరైన సమయానికి ఆమె తన మనసు మార్చుకుని, తనను కన్నవారికి ఆవిధంగా విలువనిచ్చి మాట్లాడటం అక్కడ అందరికీ నచ్చింది. అందుకే ఆమె మాటలకు ఆ రిజిస్ట్రార్ ఆఫీస్ స్టాఫ్ అంతా చప్పట్లు కొట్టారు.

రిజిస్ట్రార్ తన సీట్లోంచి లేచి అభి దగ్గరికి వచ్చి, "మా ఆఫీసుకొచ్చే అమ్మాయిల్లో ఇంత వివేకం ఉన్న అమ్మాయిని నేనింతవరకూ చూడలేదు. చూడు మిస్టర్! మా దగ్గరికి వచ్చిన మేజర్లైన యువతీయువకులకు మేం చట్టప్రకారం పెళ్లి చేస్తాం. కానీ ఆ పిల్లలను కన్నవాళ్ళు ఎంత క్షోభకు గురవుతారో మాకు తెలుసు. కానీ మేమేమీ చేయలేని పరిస్థితి. ఇదంతా మీ యువతరం ఆలోచించదు. ఈరోజు ఈ అమ్మాయి నడిచిన దారే సరైనది. నువ్వు ఆమెపై కోపగించుకోకుండా, ఆమె తల్లిదండ్రుల్ని కన్విన్స్ చేయటానికి ప్రయత్నించు. మన భారతీయ సంప్రదాయం ప్రకారం పెద్దవాళ్ళ అంగీకారంతో పెళ్ళిళ్ళు జరగటమే సరైన పద్ధతి" అన్నాడు.

ఆ తర్వాత అక్కడి నుండి బయల్దేరి స్కూటీమీద సౌమ్య ఇంటికి బయల్దేరింది. ఆమె మనసంతా చాలా ఉద్విగ్నంగా ఉంది. తొందరపాటుతో తాను తీసుకున్న నిర్ణయానికి పశ్చాత్తాపంతో ఆమె కళ్ళు ధారాపాతంగా వర్షించసాగాయి. 'ఎంత త్వరగా ఇంటికెళ్ళి, తను రిజిస్ట్రార్ ఆఫీసులో పెళ్ళి చేసుకోబోతున్నట్లు తన తండ్రికి రాసిన ఉత్తరం చింపేద్దామా' అని ఆమె వేగిరపడింది. తను వెళ్ళేలోపల తను రాసిన ఉత్తరాన్ని తన తల్లిదండ్రులు చదవకూడదని ఆమె మనసులోనే కోటిదేవుళ్ళకు మొక్కుకుంది.

# మూర్తీ – రావూ – వసంతలక్ష్మీ


**వసుంధర**

✆ 9885620065


కథామంజరి శ్రీమతి పోడూరి నాగమణిశ్రీ స్మారక కథల పోటీ
ప్రోత్సాహక బహుమతి పొందిన కథ
శ్రీ క్రోధి నామ వత్సర సంక్రాంతి - 2025



**రచయిత పరిచయం**

*తెలుగు సాహితీలోకానికి "వసుంధర" గార్లని పరిచయం చేయడం.. సూర్యుడు ముందు దివిటీ చూపెట్టడమే అవుతుంది! జగమెరిగిన సాహితీ సవ్యసాచి! ఆరు దశాబ్దాలుగా వారు.. కలం ఝుళిపించని రోజంటూ ఏది కనబడదు. శ్రీ జొన్నలగడ్డ రాజగోపాలరావు + శ్రీమతి జొన్నలగడ్డ రామలక్ష్మి = వసుంధర. నేటి ఎంతోమంది రచయితలకు స్ఫూర్తి, గురువు అని కూడా చెప్పాలి. ఏకలవ్యుడు వంటి మరెంతో మంది శిష్యులు ఉన్నారు. "చెట్లు పూలు పూసినట్లు, మేఘాలు వర్షించినట్లు.. రచన, రచయితకు ప్రకృతి సహజం! ఉద్యమాలు, సిద్ధాంతాలు.. ఆ సహజత్వంలో భాగం కావచ్చు. కాని అవి కట్టుబాటులై శాసిస్తే మాత్రం, రచయిత ప్రచారకుడవుతాడు" అని ఆయన చెప్పే మాటలు వర్ధమాన రచయితలకు శిరోధార్యం కావాలి!*

***అబ్బాయిని ఈడ పిల్లాడిగా, ఆడపిల్లల్ని ఆడ పిల్లలుగా భావిస్తూ పెంచి పెద్ద చేశాం. ఇప్పుడు వాళ్లు ముగ్గురూ పెళ్లిళ్లై విదేశాల్లో ఉన్నారు. ఎక్కువగా వీడియో ఛాట్లలోనూ, అప్పుడప్పుడు ఇంటికొచ్చీ కలిసి వెడుతుంటారు. అనుబంధాల కంటే, అవసరాలకీ, సైట్ సీయింగులకీ, స్వోత్కర్షకీ ప్రాధాన్యమిచ్చే వాళ్లకి, ఇప్పుడు నా అవసరం అంతగా లేదు. అందుకే వాళ్లతో నా అనుబంధమూ అంతంతమాత్రం!***

అంకితభావంతో ప్రేమించేవారుంటారు. స్వీకరిస్తే వారు అమృతభాండమై అలరిస్తారు. తృణీకరిస్తే వారే అగ్నిపర్వతమై రగులుతారు. అమృతభాండాన్ని అగ్నిపర్వతంగా, అగ్నిపర్వతాన్ని అమృతభాండంగా మార్చే శక్తి సైన్సుకి ఉందో లేదో కానీ, మలచే గతి మనసుకి తెలుసు. తెలిసినా మనిషి మనసు గతిని నిర్దేశించగలడా?

సమాధానం తెలియాలంటే.. మూర్తీ, రావూ, వసంతలక్ష్మిల మనసు గతిని వారి మాటల్లోనే విందాం.

**మూర్తి**

ఎగువ మధ్యతరగతి కుటుంబంలో పుట్టాను. పెద్ద చదువులు చదివాను. పెద్దలు చూసిన మీనాని పెళ్లి చేసుకున్నాను. ఇంకా మెరుగైన జీవితంకోసం పెద్దల్నొదిలి ఇల్లాలితో అమెరికాలో కాలిఫోర్నియా చేరాను. నేనిక్కడ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) స్పెషలిస్ట్. మీనా ప్రాక్టీసింగ్ లాయర్. మాకిద్దరు కొడుకులు.

'నీకోసం సంపాదించు, రేపటికోసం ఆలోచించకుండా ఖర్చు చేయ్' అనే పాశ్చాత్యజీవన విధానానికి ఫిదా అయింది మీనా. ఇండియాలోనే పుట్టిపెరిగినా.. మన సంస్కృతి, సంప్రదాయం, జీవనవిధానం పట్ల ఆమెకు తూష్ణీంభావముంది. ఒక అమెరికన్లా అక్కడి జనజీవన స్రవంతిలో భాగమవడం ఆమె లక్ష్యం.

మీనా భారతీయులతో, ముఖ్యంగా తెలుగువారితో ఆట్టే కలవదు. ఆంగ్లం తప్ప మరో భాష తను మాట్లాడదు. ఇంట్లోవాళ్లనీ

మాట్లాడనివ్వదు. "పిల్లలకి మన భాష వాసన కూడా తగలనివ్వద్దు. అప్పుడే వాళ్లిక్కడి వాళ్లతో కలిసిపోతారు" అంటుంది కానీ, మనవాళ్లని దూరం పెట్టడమే ఆమె అసలు ఉద్దేశ్యం.

పెద్దవాడి పురిటికి సాయంగా మీనా తల్లి వచ్చింది. తల్లికీ, ఆమెకీ పడలేదు. ఆర్నెల్లని వచ్చినామె ఏదో మర్యాదకన్నట్లు మూణ్ణెల్లుండి ఇండియాకి వెళ్లిపోయింది. అప్పుడు మా అమ్మ వచ్చింది.



కన్నతల్లి దగ్గర స్వతంత్రం కాబట్టి, గొడవ పడింది కానీ, మీనా మా అమ్మనైతే తనేమనేది కాదు. ఎటొచ్చీ ఆమెతోనూ ఆంగ్లంలోనే మాట్లాడేది. 'నా వృత్తికి ధారాళంగా ఇంగ్లీషు మాట్లాడాలి. మీతో తెలుగు మాట్లాడితే మెదడు గజిబిజి ఐపోతుంది, తడబాటు వల్ల ఇంగ్లీషు మాటల్లో తెలుగు వచ్చేస్తుంది' అని సంజాయిషీ ఇచ్చేది. అమ్మ మాటో, ప్రవర్తనో తనకి నచ్చకపోతే... అప్పటికేమనక, ఆనక నాకు చెప్పేది. నేను అమ్మని సానునయంగా మందలిస్తే, అమ్మ మౌనంగా వినేది. ఐతే ఇక్కడున్న ఆర్నెల్లూ ముళ్లమీద ఉన్నట్లుంది. ఇలా వీసా గడువు ముగిసిందో లేదో, అలా ఇండియాకి తిరుగుప్రయాణమైంది.

చిన్నవాడు పుట్టినప్పుడు మీనా సాయానికి ఇండియా నుంచి ఎవర్నీ పిలవలేదు. పురిటికందుల్ని డేకేర్లో ఉంచాలన్న సరదా, ఈసారైనా తీర్చుకుంటానంది.

సంప్రదాయమనో, సరదాపడో వెళ్లాలి కానీ, నిజానికి అమెరికాలో పురుళ్లకి వేరెవరి సాయం అక్కర్లేదు. అందువల్ల మీనాకి రెండోకాన్పు కూడా సులువుగానే అయింది.

ఇక అటూ ఇటూ కూడా ఇండియానుంచి మావాళ్లెవరూ ఇక్కడికి రానవసరం లేదనుకున్నాం కానీ, తప్పనిసరైంది.

పెద్దవాడికి ఆరేళ్లొచ్చేసరికి ఇంటిల్లిపాదికీ ఆరోగ్యసమస్యలు మొదలైతే.. ఓ తెల్ల డాక్టర్ని సంప్రదించింది మీనా. ఆమె ఆరా తీసి, చిన్నప్పట్నించీ అలవాటైన ఆహారానికి మారి చూడమని సలహా ఇచ్చింది. చెప్పింది తెల్ల డాక్టరు కాబట్టి మీనాకి ఆ సలహా నచ్చింది. ఐతే ఆమెకి వంట రాదు. రెడీమేడ్ ఫుడ్సుతో గడిపేస్తున్నాం. పెద్దవాళ్లం కాబట్టి అప్పుడప్పుడు ఆరోగ్యం చెడినా తట్టుకున్నాం. పిల్లలతో అలా సరిపెట్టుకోలేక, ఇండియా నుంచి వాళ్లమ్మని రప్పించుకుంది మీనా. పది రోజుల్లో అందరి ఆరోగ్యాలూ కుదుటపడ్డాయి. జీన్సు ప్రభావమో, నా అదృష్టమో పిల్లలూ తెలుగు వంటల్ని ఇష్టపడ్డారు. ఎటొచ్చీ మీనా మన వంటలన్నింటికీ ఇంగ్లీషు పేర్లు పెట్టి అమెరికన్ డాక్టరు ప్రిస్క్రిప్షను అనేది.

అత్తయ్యకి కూతురితో పడదు. వచ్చిన నెల్లాళ్లకే వెనక్కి వెళ్లిపోతానంది. ఆమెను ఆపలేమని గ్రహించేక వంటమనిషి కోసం ప్రయత్నిస్తే శీతల్ అనే ఓ పంజాబీ ఆమె దొరికింది. అత్తయ్య ఆమెకి శిక్షణ ఇచ్చేది. ఐతే ఏ రెసిపీ చెప్పినా, శీతల్ వంటకాలకి పంజాబీ ముద్ర ఉండేది. అలాగన్నామని కోపమొచ్చి పని మానేసి వెళ్లిపోయింది శీతల్. మరో మనిషి కోసం ప్రయత్నిస్తే కోమల్ అనే బెంగాలీ ఆమె దొరికింది.

కోమల్‌కి అత్తయ్య చెప్పేది ఎక్కేది కాదు. పూర్తిగా దగ్గరుండి చేయిస్తే బాగానే చేసేది. లేకపోతే ఆమె ఏమొండినా చేపలకూరలా ఉండేది.

"నీ వీసా ఇంకో ఆర్నెల్లు ఎక్స్‌టెండ్ చేయిస్తా. నువ్వీ మనిషిని పెర్‌ఫెక్ట్ చేసి వెళ్లు" అంది మీనా. కానీ, "మీతోపాటు ఈ కోమల్‌కీ వండిపెట్టాల్సొస్తోంది" అని విసుక్కుని మూణ్ణెల్లకే ఇండియా వెళ్లిపోయింది అత్తయ్య.

"అమ్మకి ఓర్పు లేకగానీ, ఇంకో మూణ్ణెల్లుంటే కోమల్‌కి మన వంటలు వచ్చేసేవి. అత్తయ్యకి ఓర్పెక్కువ" అన్న మీనా పరోక్ష సూచనకు స్పందించి అమ్మని రప్పించాను. ఐనా షరా మామూలే. పిల్లలకి అమ్మ వండితే నచ్చేది. కోమల్ వంటలు నచ్చలేదు.

"నాన్న రిటైరయ్యారుగా! ఆయన్నీ రమ్మను. ఇద్దరూ ఓ ఏడాది ఇక్కడుండే ఏర్పాటు చేస్తాను" అన్నాను.

"ఆయనిక్కడికి రారని నీకు తెలుసు. ఐనా నా అవసరం వంటకే కదా, నేను చేస్తుండగా వీడియోలు తీసుకో. తర్వాత కోమల్‌కి మీరే నేర్పుకోవచ్చు. లేదా– ఓపిక, టైము ఉంటే నువ్వో, కోడలో వాటిని అనుసరించొచ్చు. వంటేం బ్రహ్మవిద్య కాదు" అంది అమ్మ. కనీసం పది నెలలుండమని బ్రతిమాలినా కరగలేదు. పది వారాల్లో వెనక్కెళ్లిపోయింది.

ఆ తర్వాత ఏళ్లు గడిచాయి కానీ, మావాళ్లిటు రాలేదు. మేమటు వెళ్లలేదు.

అప్పుడప్పుడు వీడియో ఛాట్లు చేస్తూ, ఆ అవకాశమిచ్చిన టెక్నాలజీని తల్చుకుని మురిసిపోతుంటాను.

ఇప్పుడు మా పెద్దవాడికి పది, చిన్నవాడికి ఎనిమిది.

లండన్లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ మీద జరుగుతున్న అంతర్జాతీయ సదస్సుకొచ్చినప్పుడు నాకక్కడ అనుకోకుండా పరిచయమయ్యాడు రావు.

**రావు**

అమ్మా నాన్నా ఎవరో తెలియదు. ఓ పుణ్యాత్ముడు పద్ధతిగా నడిపిన శరణాలయంలో క్రమశిక్షణతో పెరిగి పెద్దవాణ్ణయ్యాను. బుద్ధిగా ఉంటూ, శ్రద్ధగా చదువుతూ రాణిస్తున్న నన్ను కొందరు పుణ్యాత్ములు పై చదువులకు ప్రోత్సహించారు. చదువయ్యేక కాంపస్ సెలక్షన్లో ఓ మల్టీనేషనల్ కంపెనీ నన్నెంపిక చేసింది. అక్కడే రెండేళ్లలో, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ విభాగంలో గ్రూప్‌లీడర్నయ్యాను. అప్పుడు అదే విభాగంలో నాతో కలిసి పనిచెయ్యడానికి కొత్తగా ఎంపికైన వకుళ నన్నాకర్షించింది. ఆమెదీ నాకులా అనాథకులం అని తెలియగానే, మేమెందుకు ప్రేమికులం కాకూడదూ అనిపించింది. అడిగితే ఆమె ఒప్పుకుంది. మేమిద్దరం పెళ్లితో ఒక్కటయ్యాం. ఆ ఒక్కరే ఎందరో అనిపించేటంత ఆత్మీయ, అనురాగాలతో కుటుంబీకులమయ్యాం. ఇద్దరు పిల్లలు కలిగేక మాకు జీవితం అర్థవంతమైంది.

కొన్నాళ్లకి ఓ త్రీబీహెచ్‌కే ఇల్లు కొన్నాం. ఈఎంఐలు కట్టడానికి ఇంటా బయటా కష్టపడుతున్నాం.

పిల్లలకి బడికెళ్లే వయసొచ్చేసరికి, ఆఫీసులో బాధ్యతలు పెరిగాయి. కొత్త సదుపాయాలొచ్చాయి. హౌస్‌కీపర్ని పెట్టుకుందుకు, నెలకి పాతికవేల అలవెన్సు వాటిలో ఒకటి! హౌస్‌కీపర్ కోసం వెదుకులాటలో వసంతలక్ష్మి పరిచయమైంది.

“ఒంటరిని. వయసు అరవై. కనీసం ఇంకో పదేళ్లు అవలీలగా ఇంటి చాకిరీ చెయ్యగలను. అందుకు నా షరతులు కొన్నున్నాయి. నాకు అటాచ్డ్ బాత్ ఉన్న గది ఇవ్వాలి. వంట చేస్తాను. పిల్లల బాధ్యత పూర్తిగా నాది. ఐతే వాళ్లతో తెలుగులో మాత్రమే వ్యవహరిస్తాను. ఉన్నన్నాళ్లూ మీది నా ఇల్లు, మీరు నా కుటుంబం అనుకుంటాను. నేను నచ్చకపోతే ఒక్కరోజు ముందు చెబితే చాలు. నేనొద్దనుకుంటే నా వరకూ ఓ గంట చాలు. మూటాముల్లే సద్దుకుని వెళ్లిపోతాను” అందామె.

సూటిగా చెప్పినా, ఆమె మాట సౌమ్యం. ఆమె గొంతులో ఆత్మీయస్పర్శ. మా ఇద్దరికీ ఆమె నచ్చింది. ఐతే పిల్లలతో తెలుగు ప్రస్తావన ఎందుకో తెలియలేదు.

“మన పిల్లలు మన భాష మాట్లాడకపోతే, వాళ్లు మనపిల్లల్లా అనిపించరు” అన్నదామె సమాధానం.

లోతైన వ్యాఖ్య అది. ఎందుకంటే మా పిల్లలది ఇంగ్లీషు మీడియం చదువు. స్కూల్లో వాళ్లకి తెలుగు నిషిద్ధం. వీలైనంతలో ఇంట్లో మేమూ వాళ్లతో ఇంగ్లీషే మాట్లాడాలని స్కూలు యాజమాన్యం హితవు. కానీ మేమది పాటించలేదు. బహుశా వాళ్లు మా పిల్లలుగా అనిపించరనేమో!

అనాథలుగా పెరిగిన మా దంపతులకున్న ముఖ్యమైన గుర్తింపు తెలుగువాళ్లమని. మా పిల్లలకి తెలుగు రాకపోతే, లేకలేక దొరికిన ఆ రక్త సంబంధీకులతో మా అనుబంధమేమిటి?

వసంతలక్ష్మి వయసు అరవై ఐనా, రూపానికి నలభై, చురుకుతనంలో ఇరవై! సేవలకనొచ్చినా, వారం తిరక్కుండా ఆమె నాకూ, వకుళకీ అమ్మయింది. పిల్లలామెని అమ్మమ్మ అనేవారు. నెల్లాళ్లలో వాళ్లకామె అమ్మానాన్నలకంటే ఎక్కువైంది. శరణాలయానికీ, కుటుంబానికీ తేడా తెలిపిన ఆమె మాకో వరం.

ఇప్పుడు పాపకి ఎనిమిది. బాబుకి ఆరున్నర.

లండన్లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) మీద జరిగే కాన్ఫరెన్సుకి నన్నూ, వకుళనీ ఎంపిక చేసింది కంపెనీ. మామూలుగా ఐతే పిల్లలకోసమైనా ఒకరుండి పోయేవాళ్లం. కానీ వసంతలక్ష్మి ఉందిగా... పిల్లలు మమ్మల్ని ఏమాత్రం మిస్ కారని నాకూ, వకుళకీ నమ్మకమే!

ఐతే అక్కడ వసంతలక్ష్మిలో మరో కోణం పరిచయమౌతుందని నేనూహించలేదు.

***వసంతలక్ష్మి***

పదహారో ఏట ఇంటర్‌లో 95 శాతం మార్కులొచ్చినప్పుడు నాన్న నాకు రాఘవతో పెళ్లి చేశారు.

రాఘవ స్ఫురద్రూపి. ప్రభుత్వోద్యోగి. అంతా ఆ సంబంధం కుదరడం నా అదృష్టమన్నారు. ఆడపిల్ల చదువు మంచి వరుడి కోసమే కాబట్టి, ఆ పెళ్లితో నా జీవితం సార్థకమైందని నేనే అనుకునేలా చేశారు.

నాకో కొడుకు. ఇద్దరు కూతుళ్లు. వాళ్ల పెంపకం బాధ్యత పూర్తిగా నాదైనా, వాళ్లు ఆయన పిల్లలుగానే చెలామణీ అయ్యారు. పూజలు, నోములు, పేరంటాలు, వంటిల్లు... వీటిచుట్టూ తిరిగింది నా జీవితం.

అబ్బాయిని ఈడ పిల్లాడిగా, ఆడపిల్లల్ని ఆడ పిల్లలుగా భావిస్తూ పెంచి పెద్ద చేశాం. ఇప్పుడు వాళ్లు ముగ్గురూ పెళ్లిళ్లై విదేశాల్లో ఉన్నారు. ఎక్కువగా వీడియో ఛాట్లలోనూ, అప్పుడప్పుడు ఇంటికొచ్చీ కలిసి వెడుతుంటారు. అనుబంధాల కంటే, అవసరాలకీ, సైట్ సీయింగులకీ, స్వోత్కర్షకీ ప్రాధాన్యమిచ్చే వాళ్లకి, ఇప్పుడు నా అవసరం అంతగా లేదు. అందుకే వాళ్లతో నా అనుబంధమూ అంతంతమాత్రం!

తను రిటైరైన రెండేళ్లకి కాబోలు, “పెన్షన్ లక్ష పైన. ఇంకా ఇతర ఆదాయాలున్నాయి. నెలనెలా నా ఆదాయంలో సగభాగం నీకిస్తా. ఇష్టమొచ్చినట్లు వాడుకో. అరవై నిండాయి కాబట్టి నువ్వూ రిటైర్మెంట్ తీసుకో. నాకు వంటొక్కటి చేసిపెడితే చాలు!” అన్నారు రాఘవ నాతో.

నేను వెంటనే, “ఇదివరలో మీకు ఆఫీసులో, నాకింట్లో ఊపిరి సలపని పని ఉండేది. రిటైరయ్యేక, మీకు వేరే పనేం లేనప్పుడు, నాకూ ఉండకూడదు. అర్ధాంగిని కాబట్టి మీ ఆదాయంలో సగభాగం ఎప్పుడూ నాదే! ఇప్పుడు వంటపనిలో సగభాగం మీది” అన్నాను.

తన ఉదారత్వానికి ప్రశంసల వర్షం కురుస్తుందనుకున్న ఆయనకిది ఊహించని సమాధానం.

ముందు తేలిగ్గా తీసిపారేశారు. నేను సీరియస్సని తెలిసేక చిరాకు పడ్డారు. నేను పట్టు వదలకపోయేసరికి అలిగారు. పట్టించుకోకపోతే అరిచారు. చిలికి చిలికి గాలివానయింది.

“ఇక్కడైతే నేను చెప్పినట్లుండు. లేదూ, ఇష్టమొచ్చిన చోటుకి వెళ్లొచ్చు” అన్నారు రాఘవ చివరికి.

ఇలాంటివి ఇదివరలోనూ జరిగాయి. కానీ ఇప్పటికి ఆత్మాభిమానం నా సహనాన్ని ఓడించింది. పైగా రావు ఆఫర్ సిద్ధంగా ఉంది. “జీతానికి వంట చేయాలంటే, మీ దగ్గరెందుకు? మీకంటే ఎక్కువ విలువిచ్చే చోట పని చేస్తాను. మీరు నన్ను

అర్ధాంగిగా గుర్తించినప్పుడే మళ్లీ వస్తాను" అన్నాను. పెట్టె సద్దుకుని రాత్రికి రాత్రి ఇల్లొదిలాను.

రాఘవతో దాంపత్యంలో ఎన్నో అనుబంధాలున్నాయి. అవన్నీ ఆర్థిక సంబంధాలే అనిపిస్తోందిప్పుడు. రావు ఇంట్లో జీతానికి పని చేస్తున్నా, తృప్తినిచ్చే అనుబంధం ఏర్పడుతోంది.

అలాంటి సమయంలో అనుకోకుండా నాకు నా కొడుకు మూర్తి నుంచి ఫోనొచ్చింది.

లండన్ కాన్ఫరెన్సులో వాడు రావునీ, వకుళనీ కలిసేట్ట. వాళ్లు నా గురించి గొప్పగా చెబితే, అడిగి ఫొటో చూస్తే నేనుట. తనెవరో చెప్పకుండా వాళ్ల నుంచి నంబరు తీసుకుని ఫోన్ చేశాడు.

"అలిగి వెళ్లావని నాన్న చెప్పారు. ఆయన మీద కోపమొస్తే, అయినవాళ్లం మేమున్నాం కదా! మా దగ్గరికి రాకుండా వేరెవరింట్లోనో వంటకి కుదరడమేమిటి?" అన్నాడు వాడు.

"ఏం అయినవాళ్లో! కలిసి మాట్లాడుకోం. గతస్మృతులు పంచుకోం. మన భాషలో పలకరించుకోం! ఐనా అసలప్పుడు మీ దగ్గిరకి నేనొచ్చిందీ వంటకే కదా!" అన్నాను.

ఎక్కడ తగలాలో అక్కడే తగిలితే ఏమంటాడు? "పోనీ, అలాగే అనుకో! ఇప్పుడుంటున్న చోట కూడా నువ్వు వంటమనిషివే కదా!" అన్నాడు వాడు.

నిజానికి రావు, వకుళ నన్ను వంటమనిషిలా చూడ్డం లేదు. హౌస్‌కీపర్ అని కూడా అనరు.

అచ్చతెలుగులో అమ్మ, అమ్మమ్మ... ఇవే ఆ ఇంట్లో నాకు వినబడే పిలుపులు.

"నిజమే! అక్కడా ఇక్కడా నేను వంటమనిషినే! ఎటొచ్చీ ఇక్కడ నేను చేసే పనికి జీతముంది, నేనంటే జీతానికి మించిన విలువుంది" అన్నాను.

అదేమిటో అప్పుడు నా గొంతు నాదిలా కాక, ఎందరో ఇల్లాళ్ల కోరస్‌లా తోచింది.

# మనసులోని మర్మం


**సి. యమున**

✆ 9550445911


కథామంజరి శ్రీమతి పోడూరి నాగమణిశ్రీ స్మారక కథల పోటీ

**ప్రోత్సాహక బహుమతి పొందిన కథ**

శ్రీ క్రోధి నామ వత్సర సంక్రాంతి - 2025



## రచయిత్రి పరిచయం

*పుట్టి పెరిగింది విజయవాడలో, స్థిరపడింది హైదరాబాద్‌లో. 2011, జులైలో నవ్య కథానికల పోటీలో బహుమతి పొందిన 'రెక్కలొచ్చాయి' కథతో రచనా ప్రయాణం ఆరంభం. ప్రముఖమైన వివిధ పత్రికలలో, అంతర్జాల పత్రికలలో 150 కు పైగా కథలు ప్రచురణ అవ్వటం, దాదాపు నలభై కథలకు బహుమతులు అందుకోవటం జరిగింది. సామాజిక, హాస్య, సరస .. అలా అన్ని జానర్స్‌లో కథలు వ్రాసారు. 'రెక్కలొచ్చాయి', 'కరిగిపోని కలలు' అనే రెండు కథలసంపుటాలు ప్రచురించారు. ఇరు తెలుగురాష్ట్రాల నుండి బహుమతులు, పురస్కారాలు అందుకున్నారు. కొన్ని కవితలు, రేడియో కథలు, స్కిట్స్ కూడా వ్రాసారు. స్వాతి వారిచే ఈ మధ్యే వారి మొట్టమొదటి నవల 'మేఘసందేశం' ప్రచురణ అయ్యింది.*

> ***"తను విదేశీ వనితను చేసుకోవటం నీకు ఇబ్బందిగా అనిపించలేదా?"***
> ***"తరం తరం మార్పులు సహజం. వాటిని ఆమోదించే ఆధునిక భావాలు మా వరకు ఉన్నాయి. బ్రేకప్‌లు, మళ్ళీ పెళ్లిళ్లు నడిచే ఈ కాలంలో, అలాటివి ఏమీ లేకుండా వాళ్ళు ఆనందంగా ఉంటే చాలనుకున్నాము!"***

సాయంత్రం ఐదు గంటలు. మధ్యవయసు ఆడవాళ్ళు, మగవాళ్ళతో స్కూల్‌గ్రౌండ్ నిండుగా ఉంది. ఒకరిని ఒకరు పోల్చుకోవటం కష్టంగా ఉంది. ఒకరినొకరు పరిచయం చేసుకుంటూ, ఆనాటి ముచ్చట్లు చెప్పుకుంటూ... సందడి అంబరాన్ని అంటుతోంది.

టీచర్స్‌కి సన్మాన సభ జరుగుతోంది. మధ్యమధ్యలో కొందరు పాటలతో , జోక్స్‌తో ఎంటర్టైన్ చేస్తున్నారు. నలుగురి మధ్యా ఉన్నా, వెంకట్ మనసుతో పాటు కళ్లూ చంచలమై అరవింద కోసం కలయ తిరుగుతున్నాయి.

వెంకట్ కి, తనని ఎవరో గ్రుచ్చి గ్రుచ్చి చూస్తున్న ఫీలింగ్. చుట్టూతా చూశాడు. ప్రక్కగా ఉన్న ఆడవాళ్ళ గుంపు నుండి ఓ స్త్రీ ఇటే చూస్తోంది. ఆ కళ్ళల్లో ఏదో వెతుకులాట.

'తను అరవిందేమో? ఆ కళ్ళు అలాగే ఉన్నాయి... కానీ కాటుకే లేదు... ముక్కు పుడక కూడా మాయమయ్యినట్లుంది. మనిషిలో పెద్ద మార్పు లేదు!'

అంతలో ఆమె నడుచుకుంటూ వచ్చి " నువ్వు...నువ్వు...వెంకట్ కదూ. నేను నీ క్లాస్‌మేట్ అరవిందని" అంది మథన పడుతున్న వెంకట్‌తో.

ఎదురుగా గులాబీ సిల్క్ చీరలో మెరిసిపోతున్న అరవిందని చూసి 'ఓహ్... అరవిందా దర్శనమిచ్చావు! నేను వచ్చిన పర్పస్ సర్వ్ అయ్యింది!' వెంకట్ హృదయంలో చెప్పలేని తృప్తి.

ఎగసి పడుతున్న భావాలను దాచిపెడుతూ "ఓహ్, ఎన్నేళ్ల తరువాత ఇలా! మిమ్మల్ని కలిసినందుకు చాలా హ్యాపీగా ఉంది" అన్నాడు ఆత్మీయంగా.

"నాకూ సంతోషంగా ఉంది... ఏకవచనంలో సంబోధిస్తే మరీ ఆనందం, డాక్టర్ బాబూ!" అంది నవ్వుతూ.

తను అంత చనువుగా అన్నందుకు, వెంకట్‌లో ఏదో తెలియని హాయి.

"డాక్టర్ అంటున్నావు... నా గురించి తెలుసా?"



"ఊ... ఈ రోజు నువ్వు వస్తున్నట్లు కూడా తెలుసు!"

'తను నా గురించి , నా రాక గురించి కూడా తెలుసుకుంది... అంటే తన మనసులో ఇంకా నేనున్నానా?' వెంకట్ మనసులో ఓ చిన్ని ఆనందం.

"ఈ ఊరిలోనే ఉంటున్నాను కదా! అందువలనే ఫంక్షన్ ఏర్పాట్లలో నేను కూడా హెల్ప్ చేయగలిగాను. అందుకే అందరి డీటైల్స్ తెలిసాయి"

"ఓహ్, అంతేనా?" వెంకట్ మనసులో నిట్టూర్పు.

"ఇంత ప్రముఖ డాక్టర్‌గారికి ప్రత్యేక సన్మానం ఏర్పాటు కూడా ఉంది. రెడీగా ఉండు."

"అంత హడావిడి అవసరమా?"

"అవసరమా, కాదు ఆనందం. సరే, ఒక్క క్షణం, ఇప్పుడే వస్తాను" అంటూ కాస్త దూరంగా ఆడవారి గుంపు కేసి నడిచింది.

మూడున్నర దశాబ్దాల క్రితం లాగా, వెంకట్ చూపులు అరవిందని వెన్నంటే ఉన్నాయి. దానితో పాటే ఆనాటి అనుభవాలు వెన్నాడుతున్నాయి.

★★★

అరవింద, వెంకట్ ఇంటర్ మొదటిసంవత్సరంలో ఉన్నారు. మగపిల్లల వాలీబాల్ కోర్ట్... దానికి కాస్త దూరంలో అమ్మాయిల త్రోబాల్ కోర్ట్. ఎవరి ఆటల్లో వాళ్ళు జోరుగా మునిగి ఉన్నారు. త్రోబాల్ కోర్ట్‌లోని బాల్ ఎగిరి వచ్చి వాలీబాల్ కోర్ట్‌లో పడింది. తన కాలి దగ్గర పడ్డ బాల్ తీసుకుని, తల త్రిప్పి చూశాడు వెంకట్.

అరవింద... కాటుకతో ఉన్న కళ్ళు, నుదుటిపై ఎర్రటి టికిలి, మెరుస్తున్న ముక్కుపుడక... ఆ క్షణాన వెంకట్‌కి మనసులో ఏదో తెలియని తియ్యని భావన!

'బాల్ ఇయ్యి' అన్నట్లు అరవింద చేతులు చాపి రెడీగా నించునుంది. ఇద్దరూ ఒకటే క్లాస్. కానీ ఎప్పుడూ మాట్లాడుకున్నది లేదు. బాల్‌ని అరవింద చేతిలో పెట్టాడు. ఆమె చేయి తగిలింది... మదిలో ఏదో హాయి కలిగింది.

"థాంక్స్" అంటూ బాల్ తీసుకుని గిర్రున వెనక్కు తిరిగింది. అట్లాగే చూస్తూ ఉండిపోయాడు. అంతలో గబుక్కున వెనక్కు చూసి, చిరునవ్వు విసిరింది. ఆ రోజు రాత్రి వెంకట్‌కు నిద్ర కరువయ్యింది.

అప్పటినుండీ ఎవరూ గమనించకుండా, అవకాశం వచ్చినప్పుడల్లా అరవిందని చూస్తూ ఉండేవాడు. ఆమె ప్రతి కదలిక అతనిని సమ్మోహన పరిచేది.

శుక్రవారంనాడు వెంకట్‌కు మరీ ప్రత్యేకమైన రోజుగా ఉండేది. తలంటుకున్న శిరోజాల వాలుజడ, దానిలో తురుముకున్న గులాబీ, పట్టు పరికిణీ, ఓణీ! అరవిందలో తెలియని అందాలు ఏవో రంగుల సీతాకోకచిలుకల లాగా వెంకట్‌ని పరవశింపచేసేవి.

రోజూ కన్నా ఆరోజు పదింతలు ఎక్కువ చూసేవాడు అరవిందని. అప్పుడప్పుడు అరవింద కూడా, ముక్కుపుడక మెరుపుతో పోటీ పడే నవ్వు విసిరేది. అది వెంకట్‌ని మంత్ర ముగ్ధుడిని చేసేది!

అలరించే సొంపులతో అరవింద నడిచి వస్తుంటే, 'ఏ దివిలో విరిసిన పారిజాతమో...' అంటూ అతని మనసు మౌనరాగాన్ని ఆలపించేది.

ఊరికి దూరంగా ఉన్న కాలేజీ బస్ కోసం వెయిటింగ్‌లో, ప్రయాణంలో వారి మధ్య మాటల పందిరి అల్లుకుంది. కల్చరల్ ప్రోగ్రామ్స్‌లో కలిసి పాల్గొనటం వలన, అది మొగ్గ కూడా తొడిగింది.

ఇంటర్ రెండో సంవత్సరంలోకి వచ్చేసరికి వారి ప్రేమో... ఆకర్షణో మరింత బలపడింది. చివరకు అది క్లాస్‌లు ఎగ్గొట్టి, టీనేజ్ లవ్‌స్టోరీ సినిమాలు చూసేందుకు దారితీసింది. ఆ ప్రేమికుల పాత్రల్లో దూరిపోయి తమ భవిష్యత్తు గురించి ప్రణాళికలు కూడా మొదలెట్టారు.

★★★

"అమ్మా, నాన్న ఊరెళ్ళారు. మనకి లాస్ట్ ఎగ్జామ్ కూడా అయిపోయింది. రారాదు, కబుర్లు చెప్పుకుందాము!" వెంకట్ ఆహ్వానానికి వెరపు లేకుండా అతని వెంట వాళ్ళ ఇంటికి వెళ్లింది.

ఏకాంతమో, వయసు ప్రభావమో... ఇన్నాళ్లుగా ఉన్న ఇష్టమో దగ్గరతనానికి దారితీసింది.

"నీలిరంగు ఓణీలో, తెల్లని మబ్బులా ఉన్నావు" అంటూ ఆమెను గాఢంగా ఆలింగనం చేసుకున్నాడు. తను సిగ్గుల మొగ్గే అయ్యింది. ఇద్దరినీ ఏదో తమకం ఆవహించింది.

"స్వర్గంలా ఉంది కదూ!" అతని గుస గుస.

"ఊ... ఊ..." మత్తుగా ఆమె జవాబు.

వారి స్వర్గపు ఎంట్రీకి అడ్డు పడుతూ బెల్ మ్రోగింది. ఇద్దరిలో కంగారు.

"ఉండు, నేను చూసొస్తాను. బహుశా పోస్ట్‌మాన్ అయ్యుంటాడు!" అంటూ వెంకట్ వెళ్ళి తలుపు తీశాడు.

ఊహించని విధంగా, బస్ కాన్సిల్ అయ్యి, ప్రయాణం ఆగిపోయి వెనక్కి వచ్చిన తల్లిదండ్రులు ఎదురుగా.

ఎవరూ ఎవరితో, ఒక్కమాట మాట్లాడుకోలేదు. అక్కడనుండి అరవింద అరక్షణంలో మాయమయ్యింది. ఇరువైపుల తల్లిదండ్రుల కట్టుదిట్టంతో వాళ్ళు మరల ఎదురు పడలేదు. వెంకట్‌కి మెడిసిన్‌లో సీట్ రాలేదు.

వెంకట్ నాన్న, ట్రాన్స్‌ఫర్ పెట్టుకుని పిల్లవాడిని తెలుగు రాష్ట్రాన్నే దాటించాడు. ర్యాంక్ రాని బాధ నుండి, వయసు పడిన తొందరపాటు నుండి వెంకట్ బయట పడటానికి కౌన్సెలర్ దగ్గరికి తీసుకెళ్లాడు.

"ప్రేమ మొలకెత్తటం ఈజీ. కానీ దాన్ని బ్రతికించుకోవటానికి ఓ వయసు, ఆదాయం కావాలి" అంటూ కౌన్సెలర్ తనదైన స్టైల్లో చెప్పటంతో వెంకట్‌లో ఆలోచన మొదలయ్యింది. తన లక్ష్యం అర్థమయ్యింది.

తరువాత తండ్రి , వెంకట్‌ని ఆ స్టేట్‌లో మానేజ్మెంట్ కోటాలో మెడిసిన్‌లో జాయిన్ చేశాడు.

తను ఓ స్థాయికి వచ్చిన తరువాత తిరిగి అరవిందను కలవాలనుకున్నాడు వెంకట్. కానీ మరో రెండేళ్ళ తరువాత

అరవింద్‌కి పెళ్లి అయ్యిందని సమాచారం అందింది. క్రుంగిపోయాడు. తేరుకుని, ఆ నిరాశను , బాధని మరవటానికి తన దృష్టంతా కసిగా చదువు మీద పెట్టాడు.

విద్యలో మెట్టుమెట్టు ఎక్కుతూ ఫారెన్ వెళ్ళి మరింత ఎదిగాడు. ఆ తొలి ప్రేమ ప్రభావమో, వృత్తిపై మమకారమో... మనువుపై మక్కువ చూపలేదు.

అనుకోకుండా సోషల్ మీడియా ద్వారా , చిన్ననాటి స్నేహితులు టచ్‌లోకి వచ్చి, తమ స్కూల్ గెట్ టుగెదర్‌కి వచ్చాడు.

★★★

"ఓయ్... ఏమిటీ ఏదో ఆలోచనలలో కూరుకుపోయినట్లున్నావు. వేదిక మీదకు పద. పిలుస్తున్నారు!" అన్న అరవింద పిలుపుతో ఇహంలోకి వచ్చాడు వెంకట్.

సన్మానాలు, సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం విందు ఆరంభమయ్యింది.

అందరికీ కాస్త దూరంగా ఉన్నపుడు, "ఆనాటి కాటుక కళ్ళు, ముక్కుపుడక మాయమయ్యాయేమిటి? మోడర్న్ స్టైల్ మీద మోజా, అరవిందా?" అడిగాడు వెంకట్ స్నేహంగా.

నుదుటిపై ఉన్న చిన్న ఎరుపురంగు టికిలీలాగా, అరవింద మొహం చిన్నబోయింది.

"లేదు వెంకట్, తను యాక్సిడెంట్‌కు గురయ్యి, అవి నాకు దూరమయ్యి నాలుగేళ్ళు అయ్యింది. అందుకే..." ఇహ మాటలు రానట్లు ఆగిపోయింది.

"అయ్యో... వెరీ సారీ" అన్నాడు బాధగా.

'తను సంతోషంగా ఉందనుకుంటే, ఇలా అయ్యిందే' అని వెంకట్ మనసంతా వేదనతో నిండిపోయింది.

"మా ఒక్కగానొక్క కొడుకు అమెరికాలో చదువుకని వెళ్ళి, విదేశీ వనితను పెళ్లి చేసుకుని అక్కడే స్థిరపడిపోయాడు. వాళ్ళు నన్ను అక్కడికి వచ్చెయ్యమన్నా, నా ఇంటిని వదలలేక ఉండిపోయాను!"

'నాలాగే, తనూ ఒంటరా?' వెంకట్‌లో నిట్టూర్పు.

వెంకట్ పెళ్లి చేసుకోలేదని తెలిసి, "ప్రొఫెషన్‌ని ప్రేమించొచ్చు. కానీ, మరీ పెళ్లి కూడా వద్దనుకునేంతగానా? అర్థం లేదు" అంటూ ముద్దుగా విసుక్కుంది.

'పిచ్చి అరూ, 'పెళ్లి చేసుకోపోవటానికి కారణం నీ మీద ప్రేమ మర్చిపోలేక' అని ఎలా చెప్పను...' వెంకట్‌లో నిస్సహాయత.

"మళ్ళీ ఆలోచనలోకి జారిపోయావా? జవాబు చెప్పవే"

"నువ్వనుకున్నదే నిజమనుకో" అన్నాడు నవ్వుతూ.

అందరూ వారి వారి నెలవులకు బయలు దేరారు.

"ఇంకా ఈ ఊరిలో రెండు రోజులు ఉంటున్నావుగా. మా ఇంటికి కూడా రా..." వీడ్కోలు తీసుకుంటూ చెప్పింది అరవింద.

★★★

ఎదురుగా నీలిమబ్బు రంగు చీరలో ఆహ్లాదంగా అరవింద.

"ఆనాడు మా ఇంటికి వచ్చినపుడు కూడా నీలిరంగులో ఉన్న లంగా, ఓణీ వేసుకున్నావు కదా!"

"ఇంకా మర్చిపోలేదా... రంగుతో సహా, వెంకట్!"

"ఎలా మర్చిపోగలను?"

సిగ్గుగా తలదించుకుంది అరవింద.

"ఇప్పటికీ, అప్పటికీ అలాగే ఉన్నావు. నీలో పెద్ద మార్పే లేదు, అరూ!"

"మునగచెట్టు ఎక్కించకు"

"ప్రామిస్"

"నాలో అప్పటి టీనేజ్ అమ్మాయి కనపడుతోందా?" అంది ఫక్కున నవ్వుతూ అరవింద.

"అవును... ఏమీ మార్పు లేదు. ఒక్క ఆ కాటుక కళ్ళు, ముక్కుపుడక తప్ప... దేవిగారు అనుమతిస్తే ఆ లోటును కూడా పూడ్చాలని ఉంది!"

ఆల్చిప్పల్లాంటి కళ్ళను అల్లల్లాడించింది, తన ఆమోదాన్ని తెలియచేస్తూ.

కళ్ళకు సన్నగా కాటుక దిద్దాడు. ముక్కుకు డైమండ్ ముక్కుపుడకని పెట్టాడు. అతి దగ్గరగా ఆమె మోము... తగులుతున్న ఊపిరి... వెంకట్‌లో అలజడి.. కళ్ళల్లో కళ్ళు పెట్టి చూస్తూ "నా పాత అరవింద తిరిగి దర్శనమిచ్చింది." అంటూ ఆనాడు లాగానే ఆలింగనం చేసుకోబోయాడు.

అరవింద చేతికి చిక్కటం లేదు.

చేతులు గాలిలో ఊపుతూ, ఒక్కసారిగా లేచి కూర్చున్నాడు. గతం, వర్తమానం మధ్య సతమతమవుతున్న ఆలోచనలు.

'ఏమిటీ ఈ కల? తను మరొకరి భార్య. తనపై ఇలాంటి ఆలోచనా...' పూర్తిగా స్పృహలోకి వచ్చిన వెంకట్‌లో ఏదో అపరాధ భావన.

అంతలోనే 'నాదీ, తనదీ... ఇద్దరివీ ఒంటరి జీవితాలే. జంటగా ఎందుకు అవ్వకూడదూ?' అర్థం కానివో... లేనివో

ఆలోచనలు.

పూర్తిగా తెల్లవారిన తరువాత, అరవిందకి ఫోన్ చేసి 'రావచ్చా?' అని అడిగాడు.

"పర్మిషనా? డాక్టర్ వెంకట్, మా ఇంటికి రావటం అదృష్టం కదూ!" అంది హుషారుగా.

"అంత సీన్ లేదు. అయినా స్నేహితుల మధ్య అర్హతలు, అంతస్తులు ఉండవు కదూ. కొన్ని నిమిషాల్లో అక్కడ ఉంటాను!"

"సరే, మిత్రమా స్వాగతం. నీకోసం ఎదురు చూస్తూ ఉంటాను" అంది హాయిగా నవ్వేస్తూ.

★★★

ఎదురుగా చిరునవ్వుతో అరవింద నీలిరంగు చీరలో! తను కలలో చూసినట్లుగానే, ఆ రంగు చీరలో ఆహ్వానం పలికిన అరవిందను చూసి క్షణం ఉలిక్కిపడ్డాడు వెంకట్.

ఆపై, 'తను నా కిష్టమైన రంగని గుర్తుపెట్టుకునే ఈ చీర కట్టుకుంది. నాపై తన ఇంటరెస్ట్‌ని ప్రకటించటానికి' అని ఆనందపడ్డాడు. ఇంటి ముందు లాన్, దానిలో ఊయల. మరో ప్రక్క ఫౌంటెన్.

'రా వెంకట్...' ఆత్మీయంగా ఇంటిలోకి తీసుకువెళ్ళింది. గోడ పై అమర్చిన పెయింటింగ్స్, షోకేస్‌లోని బొమ్మలు, ఇండోర్ ప్లాంట్స్... అణువణువున ఆమె అభిరుచిని వ్యక్తపరుస్తూ ఇల్లు ఎంతో కళాత్మకంగా ఉంది.

అది గమనించిన వెంకట్, అరవిందను మనస్ఫూర్తిగా అభినందించాడు.

పలకరింపులు, ఫలహారాలు అయినాయి.

"నా కొడుకు, కోడలు" అంటూ ఆల్బమ్‌లు చూపించింది.

"తను విదేశీ వనితను చేసుకోవటం నీకు ఇబ్బందిగా అనిపించలేదా?"

"తరం తరం మార్పులు సహజం. వాటిని ఆమోదించే ఆధునిక భావాలు మా వరకు ఉన్నాయి. బ్రేకప్‌లు, మళ్ళీ పెళ్లిళ్లు నడిచే ఈ కాలంలో, అలాటివి ఏమీ లేకుండా వాళ్ళు ఆనందంగా ఉంటే చాలనుకున్నాము!"

"నువ్వన్నది నిజం. ఈ రోజుల్లో అదే ఛాలెంజ్‌గా ఉంది. ఇప్పుడు కులాలు, మతాలు ఎవరూ పెద్ద పట్టించుకోవటం లేదులే!"

"మా విషయంలో పట్టించుకున్నారు. మాకు చుట్టాలలో, కుటుంబ సభ్యులతో ఇబ్బందులు బానే ఎదురయ్యాయి!"

'అవునా, ఇంకా అలా ఉన్నారా?"

"ఎందుకు లేరు? అలాగని అందరినీ ఒప్పించలేము కదా. మన కుటుంబం, సంతోషం ముఖ్యం."

"పెళ్లి అనేది పూర్తిగా వ్యక్తిగతం అనిపిస్తుంది. నువ్వేమంటావు?"

"నేను పూర్తిగా ఏకీభవిస్తాను. మనం పెంచినంత మాత్రాన వాళ్ళ జీవితాల్ని శాసించలేము"

తన ఆధునిక ఆలోచనకు, వెలిబుచ్చిన అభిప్రాయాలకు వెంకట్ మనసులో తెలియని ఉత్సాహం. నిన్నటి తన ఆలోచనను ఆచరణలో పెట్ట వచ్చేమో అనే ఆశ.

కొడుకు చిన్నప్పటివి, తను కొడుకు, కోడలితో కలిసి తీయించుకున్న ఫోటోలు ఇంటిలో కనపడ్డాయి. కానీ బెడ్‌రూమ్‌లో సహా, అరవింద భర్త ఫోటో ఎక్కడా లేకపోవటం గమనించాడు వెంకట్.

'తను అయిష్టంగా చేపట్టిన భర్త ఫోటోలు, తనకిష్టమైన నేను వస్తున్న సందర్భంగా, దాచి పెట్టేసిందేమో?' అనే భావనతో వెంకట్‌లో ఓ రకమైన ఈజ్ ఫీలింగ్.

రాత్రి కల, ఇప్పటి పరిస్థితి... అరవిందకు ప్రపోజ్ చేయాలనే తన ఆలోచనను మరింత ప్రోత్సహించింది.

అంతలోనే 'ఇన్నేళ్ల తరువాత కలిసాము. ఈ కలయికతో అలాటి చనువు తీసుకోవటం సబబు కాదేమో' వెనక్కు గుంజుతున్న మనసు.

"పైన మిద్దె పంట డెవలప్ చేశాము. చూపిస్తాను రా" అంటూ మెట్ల వైపు నడిచింది. నిమ్మ, అరటి, బొప్పాయి మొదలైన చెట్లు, ఆకుకూరలు, కాయకూర మొక్కలు, విరజాజి, సన్నజాజి తీగలు, మల్లె, మరువం మొదలైన పూల మొక్కలు. డాబా, 'ఉమ్మడి కుటుంబం లాగా' నిండుగా కళకళలాడుతోంది.

"ఓ మైగాడ్, ఎంత బాగా పెంచావు! అద్భుతంగా ఉంది, అరూ... సారీ, అరవిందా!" అన్నాడు మనస్ఫూర్తిగా అభినందిస్తూ.

"థాంక్యూ. నువ్వు 'అరు' అన్నా ఫరవాలేదు... సరేనా! ఇక్కడ ఒక స్పెషల్ రూమ్ కూడా ఉంది. చూపిస్తా రా" అంటూ ఓ ప్రక్కగా ఉన్న గది కేసి అడుగులు వేసింది.

'అరు' అన్నా ఫరవాలేదంటోంది. అంటే మనసులో నాపై ఆనాటి మమకారం, నా స్థానం అలాగే నిలుపుకుంది. తనకీ నా తోడు కావాలనిపిస్తోంది. ఎంతైనా తన ఒకప్పటి ప్రేమికుడినే కదా. 'నేను పెళ్లి చేసుకోకుండా ఉండి పోయింది తనపై ప్రేమను మరవలేకే' అని కూడా అర్థమయ్యిందనుకుంటా. అందుకే రూమ్‌కి కూడా తీసుకెడుతోంది. అంటే చనువు తీసుకోమని చెపుతోందా?' అనేక ఊహాత్మక ఆలోచనలు వెంకట్‌లో.

అరవింద తాళం తీసి, తలుపులు తెరిచింది. ఎదురుగా ఉన్న దృశ్యం చూసి, వెనకనే వచ్చిన వెంకట్‌లో ఏదో తెలియని భావన... ఊపిరాడనితనం!

"వెంకట్, తనే నా భర్త" ఎదురుగా ఎదురుగా, నవ్వులు చిందిస్తూ నిండు చంద్రుడిలా ఉన్న ఓ వ్యక్తి నిలువెత్తు ఛాయాచిత్రం. సజీవంగా ఉన్న వ్యక్తిని పరిచయం చేసినట్లే చెప్పింది వెంకట్‌కు.

"ఓ... నైస్!" అన్నాడు మాట పెగుల్చుకుని వెంకట్.

"క్రింద ఎక్కడా తనున్న ఫోటోలు పెట్టుకోలేదు... ఎందుకంటే..."

ఒక్క క్షణం మాటలు రానట్లు ఆగిపోయింది.

"ఆ ఫోటోలు, తను నాకు దూరమయ్యాడని అనుక్షణం గుర్తు చేస్తాయి. అది నేను తట్టుకోలేను... అందుకే ఈ రూమ్ కట్టించాను. తన మీద బెంగ వచ్చినపుడు, ఇక్కడికి వచ్చి కూర్చుని తన నీడలో ఉన్నట్లే రిలాక్స్ అవుతాను!"

గోడల మీద వాళ్ళ వైవాహిక జీవితంలో ఘట్టాలను, అనుబంధాన్ని ప్రతిబింబిస్తూ అనేక ఫోటోలు... వెంకట్‌లో ఏదో అసౌకర్యం.

"ఆనాడు నువ్వు ఎక్కడ ఉన్నావో, ఎలా ఉన్నావో తెలియదు. పెద్దల బలవంతం... పెళ్లి తప్పలేదు!"

"సారీ, అరూ... నాన్న లాక్కెళ్లి పోయారు. ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి"

"తెలుసు"

"ఇష్టం లేని పెళ్లి చేసుకుని, ఆ జీవితం గడపటానికి ఎంత అవస్థ పడి ఉంటావో?"

నిశ్చలంగా వెంకట్ కళ్ళల్లోకి చూసింది.

"అందుకే, అయిష్టమైన మనసుతో ఇష్టంలేని కాపురం చేయలేక... తనకు దగ్గరవ్వలేక శ్రీవారికి మన కథ చెప్పాను"

వింటున్న వెంకట్‌లో విస్మయం.

"అది విని తను..."

"నిన్ను అవమాన పరిచాడా?" వెంకట్‌లో ఆవేదన.

"ఉహు"

"మరి?"

"పిచ్చిపిల్లా, ఆ వయసులో ప్రేమకథ లేనివారెవరు? మనది మరో ప్రేమకథ' అంటూ నన్ను ఆత్మీయంగా అక్కున చేర్చుకున్నారు" అరవింద గొంతులో తడి.

"..."

"జీవిత ప్రయాణంలో ఎందరో వ్యక్తులు తారసపడతారు. వారిలో కొందరు మనసులో మాత్రమే ఉంటారు. మరి కొందరు మనసు, జీవితం రెండిటిలోనూ ఉంటారు మిత్రమా!" అంది భర్త చిత్రపటాన్ని ఆప్యాయంగా తడుముతూ.

ఎందరి మనసులో చిక్కుబరిచిన సైకియాట్రిస్ట్, డాక్టర్ వెంకట్‌లో 'అంతుచిక్కని ఆత్మసౌందర్య సాక్షాత్కారం' అయిన భావన!






# గమ్యం – గమనం

సింహప్రసాద్
✆ 9849061668

**రచయిత పరిచయం**

*వీరి సాహిత్యప్రస్థానం 1973లో ప్రారంభమైంది. ఇంతవరకు 536 కథలు, 75 నవలలు, 7 నాటకాలు రాశారు. వాటిలో 156 కథలకు, 24 నవలలకు, 7 నాటకాలకు, కొన్ని కవితలకు బహుమతులు పొందారు. ఇవేగాక వివాహవేదం, తిరుమల దివ్యక్షేత్రం, శ్రీరాముడి ధర్మపథం గ్రంథాలకు ప్రముఖుల ప్రశంసలు పొందారు. 51 కథలు, మూడు నవలలు, వివాహవేదం ఇతర భాషల్లోకి అనువదింపబడినవి. జీవితసాఫల్య పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారంతోపాటు ఎన్నో అవార్డులు రివార్డులు అందుకున్నారు.*

> ***మనం పోయినప్పుడు, కుటుంబ సభ్యులు గాక బయటివారు కనీసం నలుగురైనా కన్నీరు పెట్టుకోకపోతే, ఇక మన జీవితానికి అర్థం ఏమిటి! ఆలోచించండి! ఇంతవరకూ గమనాన్ని బట్టి తాత్కాలిక గమ్యాలు ఏర్పరచుకుంటూ సాగిపోయారు. ఇప్పుడు ఒక గమ్యాన్ని నిర్దేశించుకుని అటువైపు సాగిపోమని కోరుతున్నాను. ఇన్నేళ్లూ మీరు మీ కోసం, మీ కుటుంబం కోసం చేసింది చాలు! ఇకనైనా సామాజిక ఋణం తీర్చుకోడానికి, ఆ దిశగా నాలుగు అడుగులు వేయాల్సిందిగా ప్రార్థిస్తున్నాను!" చేతులు జోడించి లేచాను.***

"నమస్తే. మీ జీవనయానం గురించి తెలుసుకోవాలని ఉత్సుకతగా ఉంది. మీతో కాస్సేపు మాట్లాడొచ్చా?" పార్కులో కబుర్లు చెప్పుకుంటున్న ముగ్గురు వృద్ధుల దగ్గరకు వెళ్లి వినయంగా అడిగాను.

"మాకేం అభ్యంతరం లేదు" అని ఒకరంటే, "మాట్లాడేవారు లేకే కదా రకరకాల పక్షులం ఇక్కడ గుమికూడి నానా కబుర్లూ చెప్పుకుంటున్నాం!" అన్నారు రెండోవారు.

"ముసలివారంటే స్టోర్‌రూమ్‌లో పడేసిన పనికిరాని సామాన్ల లెక్కే!" అంది మూడో ఆమె.

మావంక ఆసక్తిగా చూస్తూ వచ్చి కలిసింది ఇంకో పెద్దావిడ.

వారితో పాటు పచ్చిక మీద చతికిలబడ్డాను. "కొంపతీసి పత్రికల వాడివి కాదు కదా! మా ఇంటి గొడవలు వీధికెక్కించవుగా!" అనుమానం వ్యక్తపరిచింది ఒకామె.

"అలాంటి భయాలు, అపార్థాలు వద్దు. మీ అనుభవాలు తెలుసుకోడానికి కొన్ని ప్రశ్నలు అడుగుతాను. నిజాయితీగా సమాధానాలిస్తే చాలు!"

"మా గురించి నువ్వు వినాలే గాని... రోజూ సీరియల్‌గా చెప్పగలం!" అన్నారు రెండోవారు.

"మొదట మీ పేర్లు చెప్పండి! నిజం పేరు చెప్పడం ఇష్టం లేకపోతే మారుపేరు చెప్పినా చాలు!'

"ఆదిశేషు", "చిదానందరావు", "శ్రీరాణి", "రాధిక"... వరుసగా నలుగురూ చెప్పారు.

"మీరేదో గేమ్ ఆడుతున్నట్టున్నారు. నేనూ జాయిన్ అవ్వొచ్చా?" ఇంకో పెద్దాయన వచ్చి అడిగాడు.

"వెల్‌కమ్. మీ పేరు?"



"గణేష్" ఆసక్తిగా అందరి ముఖాల్లోకి చూసి, ఆపైన ముఖం ముడుచుకుని కూర్చున్నాడు.

"గుడ్. నేను చెప్పేది జాగ్రత్తగా వినండి. మీ అందరి యావరేజ్ వయస్సు 60–65 మధ్య ఉంటుందనుకుంటాను!"

"నా వయస్సు 73 నాట్ అవుట్!" అన్నాడు ఆదిశేషు గొప్పగా.

"సెంచరీ కొట్టాలి" నవ్వి అన్నాను, "మీరు చిన్నతనం నుంచీ ఎన్నో లక్ష్యాలు పెట్టుకుని ఉంటారు. వాటిని మించి ఎన్నో సాధించి ఉంటారు. లేదా రూటు మార్చి సక్సెస్ అయి ఉంటారు. అవన్నీ మనకిప్పుడు కావాలి. ఒక్కసారి మీ గతంలోకి

తొంగి చూద్దాం. అలాగే మీరు నిర్వర్తించిన ఇతర బాధ్యతల గురించీ తెలుసుకుని మీ జీవనసారాన్ని రికార్డు చేయాలన్నది నా తపన!"

"పుస్తకం రాస్తావా?" రాధిక భయపడింది.

"లేదు. లేదు. జస్ట్ నా ఫోన్లో రికార్డ్ చేస్తా. చివర్లో విశ్లేషించుకుందాం . తప్పొప్పులు ఎత్తి చూపడానికి కాదు. మీ జీవితపాఠాలు ఎలాంటివైనా ఎందరికో దిక్సూచి అవ్వాలని!"

"ఏమి అడుగుతావో అడుగు. ఈ వయసులో మేము దాచుకోవలసినవి, భయపడాల్సినవి ఏమీ లేవు!" చిదానందరావు మాటలతో ఏకీభవించారంతా.

"మీ బాల్యంలో అంటే పదేళ్ల వయసులో మీరు పెద్దయ్యాక ఏమవ్వాలని లేక ఏం సాధించాలని కలలు కన్నారు. కనీసం ఉవ్విళ్లూరారు?" అడిగాను.

"భలే చిక్కుప్రశ్న వేశావే! సరే చెబుతాను. మాది పల్లెటూరు. మా నాన్న కౌలు వ్యవసాయం చేసేవాడు. ఎప్పుడూ డబ్బు ఇబ్బందులే. ఇంటి చుట్టూ అప్పులే! పెద్దయ్యాక బోలెడు డబ్బు సంపాదించి, మా ఊరి భూషణంగారిలా ఏభై ఎకరాల పొలం కొనేసి, మా కుటుంబం దర్జాగా బతికేలా చేయాలనుకున్నాను. హైస్కూల్ చదువుకి రోజూ కాలువ ఈది పొరుగూరికి వెళ్లేవాళ్ళం! బాగా డబ్బు సంపాదించాక ఆ కాలువ మీద వంతెన కట్టాలనుకున్నాను!" చెప్పాడు ఆదిశేషు.

"మాది మధ్యతరగతి కుటుంబం! నాన్న నా చిన్నప్పుడే పోయారు. మా పెద్దన్నయ్య సంపాదనే మాకు ఆధారం. ఆయన టీచర్‌గా పని చేసేవారు. వదిన లేసుకుట్టేది. అమ్మ మిషన్ కుట్టేది. నాకు పెద్దగా చదువు అబ్బలేదు. అందుకే పెద్దయ్యాక పెద్ద వ్యాపారం చేసి కుటుంబాన్ని పైకి తీసుకు రావాలనుకునేవాడిని!" సాలోచనగా అన్నాడు చిదానందరావు.

"బాగా డబ్బున్న పెద్దింటి వారి కోడల్ని అయి చక్రం తిప్పాలనుకున్నాను!" నవ్వింది శ్రీరాణి.

"మా మామయ్యగారి అమ్మాయి టైపిస్ట్‌గా పనిచేసేది. భలే రంగురంగుల చీరలు కట్టుకుని స్టైల్‌గా ఆఫీసుకు వెళ్లేది. తనలాగే నేనూ ఉద్యోగం చేయాలని, టింగు రంగా అంటూ ఉద్యోగానికి వెళ్లాలని కలలు కనేదాన్ని!" అంది రాధిక.

"నాకు నాటకాల పిచ్చి ఎక్కువ! ఎలాగైనా సినిమానటుడిని కావాలనుకున్నాను. తిరుపతి వెళ్ళినప్పుడు అట్నుంచటు మద్రాసు వెళ్ళాం. ఎన్టీఆర్ ఇంటిని చూసాం. ఆ ఇంటిని, ఆయన్ని చూడటానికి వచ్చిన అభిమాన జనాన్ని చూసాక, నేనూ పెద్దహీరోని అయిపోయి, పెద్దమేడ కట్టాలని డిసైడ్ అయ్యాను!" నవ్వుతూ చెప్పాడు గణేష్.

"థాంక్స్! మీ అందరి అభిప్రాయాలు క్రోడీకరించి చూస్తే, అంతా మధ్యతరగతి వారే గనుక, బాగా డబ్బు సంపాదించి కుటుంబాన్ని సుఖపెట్టాలనుకున్నారు. బావుంది. ఇప్పుడు రెండో ప్రశ్న! 25 – 30 ఏళ్ల మధ్య మీ లక్ష్యం ఏమిటి? ఆసరికి అందరికీ చదువు పూర్తయి ఉండొచ్చు, ఉద్యోగాలు వచ్చి ఉండొచ్చు, పెళ్లిళ్లు అయిపోయీ ఉండొచ్చు. అయినా అప్పుడు భవిష్యత్తులో ఏఏ ఎత్తులకు ఎగబ్రాకాలనుకున్నారు?"

అంతా మౌనం వహించారు. మొదటిగా శ్రీరాణి నోరు తెరిచింది. "నాకు పెళ్లి అయిపోయింది. ముగ్గురు ఆడపిల్లలు పుట్టారు. మగపిల్లాడు పుట్టలేదని మా అత్త వేధించుకు తినేది. ఎక్కడ మా ఆయనకి ఇంకో పెళ్లి చేసేస్తారోనని భయపడి అత్తమామల్ని బాగా కాకా పట్టేదాన్ని! వారు చెప్పిందల్లా విని, చెప్పినట్టే నడుచుకునేదాన్ని!" చిత్రంగా నవ్వింది.

"మిత్రుడితో కలిసి ఐస్‌ఫ్యాక్టరీ పెట్టాను. మొదట్లో బాగానే నడిచింది. తర్వాత మా మధ్య విభేదాలు వచ్చాయి. బాగా నష్టపోయాం. అమ్మేయక తప్పలేదు. ఎలాగోలా మళ్ళీ పెట్టుబడి సమకూర్చుకుని, ఈసారి మాన్యుఫ్యాక్చరింగ్ వైపు పోకుండా, తయారైన సరుకులు కొని అమ్మే వ్యాపారం చేయాలని ప్రయత్నించాను. మిత్రుల సపోర్టు వల్ల అపరాల వ్యాపారంలో బాగా రాణించాను!" అన్నాడు చిదానందరావు.

"నాకు బ్యాంకు ఉద్యోగం వచ్చింది. మా దగ్గరి టౌన్లోనే పోస్టింగ్ ఇచ్చారు. నా అంత అదృష్టవంతుడు లేడనుకున్నాను. పెళ్లయింది. టౌన్లో ఖర్చు ఎక్కువ గనుక డబ్బు మిగిల్చి పొలాలు కొనలేకపోయాను. నెలనెలా ఇంటికి కొంత సొమ్ము టంచనుగా పంపేవాడిని. త్వరత్వరగా బ్యాంకు పరీక్షలు పాసై, శీఘ్రంగా ప్రమోషన్ తెచ్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. సంపాదన పెరిగితే రేపు మా పిల్లలకు గొప్ప భవిష్యత్తు ఇవ్వొచ్చన్నది నా ఆశ!" స్థిరస్వరంతో చెప్పాడు ఆదిశేషు.

"అత్తెసరు మార్కులతో డిగ్రీ పాసయ్యాను. అప్పటికే చాలా నాటకాల్లో నటించి మంచిపేరు తెచ్చుకున్నాను. సినిమాల్లో ట్రై చేయమని మిత్రులు ప్రోత్సహించారు. ఇంట్లో చెప్పకుండా మద్రాసు పారిపోయాను. ఎంతో ప్రయత్నించాను, కానీ స్టూడియోల గేట్లు దాటలేకపోయాను. ఇద్దరు బ్రోకర్లను నమ్మి మోసపోయాను. తిండిలేక మాడిపోతుంటే మావాళ్ళకు తెలిసి, వచ్చి ఇంటికి తీసుకుని వచ్చేసారు. మళ్ళీ పారిపోకుండా ఇంటికే కట్టి పడేయాలని పెళ్లి చేశారు. తర్వాత మా మామగారి తోడ్పాటుతో ప్రైవేట్ కంపెనీలో చేరాను. పిల్లలు పుట్టారు. బతుకు యాంత్రికమైపోయింది!" నిట్టూర్చాడు గణేష్.

"నేను టీచర్‌జాబ్ కొట్టాను. మా జిల్లాలోని విలేజిలో పోస్టింగ్ ఇచ్చారు. రోజూ రానూ పోనూ మూడు గంటలు పట్టేది. పడుతూ లేస్తూ వెళ్లి వచ్చేదాన్ని. పెళ్లయింది. మా వారూ టీచరే. నా ఉద్యోగం చూసి, కట్నం లేకుండా చేసుకున్నారు. ఇద్దరం టౌన్లో ఉండి, ఆ చుట్టుపక్కలి స్కూళ్లలో కుదురుకున్నాం. ఒకరి సంపాదన మిగిలిపోయేది. ఇంటి సైట్ కొన్నాం. ఐదేళ్లలో ఇల్లు కట్టడానికి ప్లాన్ చేసాం. అబ్బాయి పుట్టాడు. ఒక్కడు చాలు అనుకుని ఫుల్‌స్టాప్ పెట్టేసాం!" చిన్నగా నవ్వింది రాధిక.

"మొదటిదశలో సంపాదన డామినేట్ చేసింది. రెండోదానిలో సంపాదన, స్థిరత్వం, కుటుంబ భద్రత ప్రధాన భూమిక వహించాయి. ఇప్పుడు తర్వాతి దశకు వెళదాం. 45–50 ఏళ్ల మధ్య దశ. అంటే సగం జీవితం అయిపోయింది. జీవితంలో, వృత్తిలో ఉచ్చస్థితికి వచ్చి ఉంటారు. అప్పుడు మీ ఆలోచనలు ఎలా ఉండేవి? ఇంకా ఏం సాధించాలనుకునేవారు?"

నా ప్రశ్నకు తడుముకోకుండా జవాబు ఇచ్చింది శ్రీరాణి. "ఇద్దరమ్మాయిల పెళ్లిళ్లు చేసేసాం. మూడో అమ్మాయికీ చేసేస్తే నిశ్చింత పడిపోవచ్చనుకున్నాం. మూడోది మిగతా ఇద్దరిలా అందంగా ఉండదు. బొద్దుగా ఉండేది. కుర్రజనానికి నచ్చి చావలేదు. ఎక్కువ కట్నం ఇచ్చి అయినా సరే, మా గుండెల మీది కుంపటి దించుకోవాలని ప్రయత్నించాం. ఎలాగైతేనేం ఒక సంబంధం కుదిర్చాము. అల్లుడికి ఉద్యోగం లేదు. ఒక్కడే కొడుకు. తండ్రి వడ్డీ వ్యాపారం కొనసాగిస్తున్నాడు. అత్తతో కాపురం అని మొదట ఊగిసలాడినా కడకు అదే ఖాయం చేసుకోక తప్పలేదు!"

"మేము చాలా లక్కీ! మేము అస్సలు యాతన పడలేదు. టెన్త్‌లో, ఇంటర్‌లో మా అబ్బాయిని బాగా తోమేం. చదువు తప్ప మరో ధ్యాస రానివ్వలేదు. చదువు పాడవుతుందని టీవీ కూడా కొనలేదు. మా కలలు, పూజలు ఫలించాయి. వాడు ఐఐటీలో సీటు సాధించాడు. ఇరవై లక్షల ప్యాకేజ్‌తో జాబ్ వచ్చింది. గొప్పింటి అమ్మాయితో పెళ్లి చేసాం. మొదట్లో ముంబైలో

ఉండేవారు. తర్వాత అమెరికా వెళ్ళిపోయారు. అక్కడ పెద్ద ఇల్లు కొనుక్కున్నారు. వాళ్ళ వైభోగమే వైభోగం!" కళ్ళు తుడుచుకుంది రాధిక.

"రెండుసార్లు ప్రమోషన్ టెస్టులు రాసినా ప్రమోషన్ రాలేదు. ఇక నావల్ల కాదనిపించింది. పైగా ప్రమోషన్ వస్తే ఇతర రాష్ట్రాల్లో పని చేయాలి. మా బ్యాంకులో అధికార్లను ప్రతి మూడు ఏళ్లకూ ట్రాన్స్‌ఫర్ చేస్తారు. పిల్లల చదువులకు ఇబ్బంది వస్తుంది. అదీగాక మా గ్రామానికి దగ్గరలోని టౌన్. సొంతంగా ఇల్లు కట్టుకున్నాం. ఇవన్నీ వదులుకుని దూరంగా వెళ్లడం ఇష్టం లేదు. అందుకే ప్రమోషన్ వద్దని రాసిచ్చేశాను. మొదట క్యాషియర్‌గా చేరిన బ్రాంచ్‌లోనే క్యాషియర్‌గానే రిటైరయ్యాను. మా ఇంటి విలువ కోటి పైనే ఉంటుంది. నా మిత్రులు ప్రమోషన్ మీద ఎక్కడెక్కడో తిరిగి నానా ఇబ్బందులు పడ్డారు. కొందరు ఫ్రాడ్స్‌లో ఇరుక్కుని పనిష్మెంట్ అనుభవించారు. మాకు అలాంటి ఒడిదుడుకులు లేకుండా కడుపులోని చల్ల కదలకుండా ఉన్నాం. పరుగెత్తి పాలు తాగే కన్నా నిలబడి నీళ్లు తాగటం ఉత్తమం కదా!" సానుకూల సమాధానం ఆశిస్తూ మావంక చూశాడు ఆదిశేషు.

"నా వ్యాపారం బాగా క్లిక్ అయింది. ఉత్తరాంధ్ర నుంచి అపరాలు కొన్ని తెచ్చి అమ్మేవాణ్ణి. తర్వాత ఒక పెద్దాయన సలహా మీద పండ్లవ్యాపారానికి మారాను. హైదరాబాదు నుంచి ద్రాక్ష, నాగపూర్ నుంచి ఆరెంజెస్ కొని తెచ్చి మా జిల్లా పండ్ల వర్తకులకు సప్లై చేయడం మొదలు పెట్టాను. ప్రత్యేకంగా షాపు, స్టాఫ్ లేకుండానే ఇంటినుంచే పని చేసేవాడిని! తోటలు చూడటానికి, ఖజానా ఇవ్వడానికి ఆయా ప్రదేశాలకు వెళ్లేవాడిని. ఎక్కువగా వ్యాపారం ఫోన్ మీదే నడిచేది. స్థలాలు, పొలాలు కొన్నాను. పెద్ద మేడ కట్టాను. సెంట్రల్ ఏసీ చేయించాను. పిల్లలు లేకపోవడం ఒకటే మాకు లోటు. చాలా మంది డాక్టర్లకి చూపించుకున్నా ఫలితం లేకపోయింది. నా భార్య ఒత్తిడి మీద మా తోడల్లుడి కొడుకు బాబ్జీని పెంచుకున్నాం! మా ఆవిడ అతి గారాబంవల్ల వాడు పాడయ్యాడు. అల్లరి చిల్లరిగా తిరిగేవాడు. సొంతంగా ఏదైనా వ్యాపారం చేయిస్తే మెళుకువలు తెలుస్తాయని ఆశించాం. తర్వాత నా వ్యాపారం అప్పచెప్పొచ్చనుకున్నాం. కానీ నా ఆస్తిపాస్తులన్నీ ముందుగానే వాడికి దక్కేలా రాతకోతలు పూర్తి చేయమని, మంచి పెళ్ళిసంబంధం వస్తుందని మా తోడల్లుడు, మామగారు ఒత్తిడి తెచ్చారు. తర్వాత రాస్తానన్నా వినలేదు. గొడవ పెరిగి వాళ్ళు మా బాబ్జీని తీసుకెళ్ళిపోయారు!" కళ్ళు తుడుచుకున్నాడు చిదంబరరావు.

అందరం సానుభూతిగా చూసాం. ఒకటి రెండు ఓదార్పు మాటలు చెప్పాం.

"మా ఊళ్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకుంది. నలుగురు భాగస్తులతో ఒక వెంచర్ వేసాం. బాగా మిగిలింది. ఇక వెనక్కి తిరిగి చూసుకోలేదు. బిల్డర్స్‌గా ఎదిగాం. కోట్లు సంపాదించాం. నేనే నిర్మాతగా ఒక సినిమా తీయాలని, అందులో నేను ఒక ముఖ్యపాత్ర ధరించాలని ప్రయత్నించాను. మిత్రులు సమర్థించారు కానీ కుటుంబ సభ్యులు నా కల నిజం చేసుకోవడానికి సహకరించలేదు. నా భార్యా పిల్లలు వ్యతిరేకించడమే కాదు, బలవంతంగా నా ఆస్తుల్ని రాయించేసుకున్నారు!"

కన్నీళ్లు కనిపించకుండా ముఖం తిప్పుకున్నాడు గణేష్.

"ఈ దశలో మీ అందరి జీవితాల్లో స్ట్రగుల్ ఉంది. సక్సెస్ ఉంది. కొంత సంతృప్తి ఉంది. లోటు ఉంది. దాన్ని కప్పిపుచ్చే డబ్బు ఉంది. ఇక ఫైనల్ స్టేజ్. 60–70 మధ్య అంటే ప్రస్తుతం మీ ఆలోచనా విధానం ఎలా ఉంది? మీ భవిష్యత్తు ఎలా తీర్చిదిద్దుకోవాలనుకుంటున్నారు? ప్రస్తుత స్థితి మీకు సంతృప్తికరంగా ఉందా?" అందరి ముఖాల్లోకీ చూస్తూ అడిగాను.

“ఇంట్లో ఊపిరాడక సిటీకెళ్ళి కృష్ణానగర్‌లో ఒక గది అద్దెకు తీసుకుని ఉంటున్నాను. సినిమాల్లో, సీరియల్స్‌లో జూనియర్ ఆర్టిస్ట్‌గా చిన్నచిన్న వేషాలు వేస్తూ నా పొట్టకు సంపాదించుకుంటున్నాను. ఎదురుచూసిన ఒక్క గోల్డెన్ ఛాన్స్ వచ్చేసింది! ’మంచి మనిషి’ సినిమాలో ఆసుపత్రిలోని రోగిగా చక్కని పాత్ర ధరించాను. మంచి గుర్తింపు వచ్చింది. అయినా మీరెవరూ నన్ను గుర్తించక పోవడం చిత్రంగా ఉంది! ప్రస్తుతం నా చేతిలో నాలుగైదు ఆఫర్లు వున్నాయి. ఓ సినిమా కో–డైరెక్టర్ పెళ్లికని ఇక్కడికి వచ్చాను. ఇంకో సంగతి చెప్పనా! ఇప్పుడు మా వాళ్ళు ‘ఫలానా సినీనటుడు మా నాన్న’ అంటూ ఊళ్లో గొప్పగా చెప్పుకుంటున్నారు. ఇంకొక్క ఏడాదిలో వాళ్లంతా వచ్చి నాకు సారీ చెప్పి, ఊరేగింపుగా తీసుకెళ్తారు చూడండి!” ధీమాగా చెప్పాడు గణేష్.

“అయిదేళ్ళ క్రితం మావారు పోయారు. పెన్షన్ వస్తోంది. ఒంటరిగానే ఉంటున్నాను. అబ్బాయి, కోడలు ఇండియా రావట్లేదు. ఎంతో అల్లారుముద్దుగా పెంచాం. తండ్రికి తలకొరివి పెట్టడానికి కూడా వాడు రాలేదు. ఏ మాటకు ఆ మాటే చెప్పుకోవాలి… మా అబ్బాయి మంచోడే, మా కోడలు పిల్ల ఘటికురాలు! ఆమె పుట్టింటివారితో కలిసి మావాడిని మార్చేసింది. ఇంటికి రాకుండా కట్టడి చేసింది. కడకు వాడి పిల్లల్ని కళ్ళారా చూసుకునే యోగం కూడా నాకు లేకపోయింది! ఒంటరితనం భరించడం కష్టంగా ఉంది. ఒక్క బిడ్డతోనే ఆపి మేము చాలా పొరపాటు చేసాం అనిపిస్తోంది! ఇద్దరు పిల్లలు ఉంటే ఒకరు కాకపోతే ఒకరు చూసేవారు కదా!” పమిటచెంగు అడ్డుపెట్టుకుని వెక్కి వెక్కి ఏడ్చింది రాధిక.

ఆదిశేషు అందరి వంకా చూశాడు. “మాకు సినిమా కష్టాలేమీ లేవు. మా అబ్బాయి, ఇద్దరు అమ్మాయిలు హ్యాపీగా ఉన్నారు. ఎవరి బతుకులు వాళ్ళు బతుకుతున్నారు. కథాకార్యాలకు వెళ్లి వస్తుంటాం. మా కడుపే మా కైలాసం అనుకున్నాం కానీ, ఎలాంటి సాయాలూ దానాలూ చేయలేదు. ఈమధ్య పాపభీతి మొదలయింది. ఊళ్లో సాయిబాబా భక్తబృందాన్ని ఏర్పాటు చేశాను. ఆ పూజలతో, భజనలతో కాలం హ్యాపీగా గడిచిపోతోంది కానీ ఏదో అసంతృప్తి. కెరియర్‌ని ఛాలెంజింగ్‌గా తీసుకుని ఉంటే ఉన్నతస్థాయికి ఎదిగేవాడిని కదా, మా పిల్లలకు గొప్ప రోల్‌మోడల్‌ని అయ్యేవాడిని కదా… అని రాత్రుళ్ళు వేదన పడుతుంటాను. మా ఆవిడకీ, కోడలికీ పడిచావదు. వాళ్లు మా ఇంటికి వస్తే చాలు గంట గంటకీ యుద్ధమే! వారి మధ్య ఇరుక్కోలేక ఇలా వచ్చి కాలక్షేపం చేస్తుంటాను!”

చిదంబరరావు గాద్గదిక స్వరంతో అన్నాడు “అబ్బాయి బెంగతోనే మా ఆవిడ కాలం చేసింది. వ్యాపారం మీద ఆసక్తి పోయి, నాదగ్గర పని చేసిన వారికి అప్పగించేసాను. దూరపు బంధువు ఒకావిడ వండి పెడుతోంది. బీపీ షుగర్ ఉన్నాయి. ఒకసారి హార్ట్‌ఎటాక్ వచ్చింది. బాబ్జీని మళ్లీ నాకు దగ్గర చేయాలని చూశారు గానీ, నేను పడనివ్వలేదు. మా దాయాదులు నా ఆస్తి మీద కన్నేసి కాచుక్కూర్చున్నారు. ప్రాణాలు తీస్తారేమోనని భయంగా ఉంది. అయినా వీలునామా రాయలేదు. రాస్తే ఆస్తి దక్కని వాళ్ళు మరింతగా రెచ్చి పోవచ్చని భయపడ్డాను. బంధువుల పిల్లాడిని గాక, ఏ అనాథనో చేరదీసి ఉంటే, వాడు మమ్మల్ని నెత్తిన పెట్టుకుని ఊరేగించేవాడు కదా… అని ఇప్పుడు పశ్చాత్తాప పడుతున్నా!”

“జరిగిపోయినవి మార్చడానికి ఇంకో అవకాశం రాదు. మనం ఏడ్చి మొత్తుకున్నా కాలం వెనక్కు తిరగదు. చేతికి దక్కిందే ప్రాప్తం. మీ జీవితంలో అత్యంత సంతోష, విషాద సందర్భాలేమిటో చెబుతారా!” బరువెక్కిన గుండెతో అడిగాను.

“మా అబ్బాయికి ఐఐటీలో సీటు రావడం, అమెరికా వెళ్లడం కన్నా ఆనంద క్షణాలు మాకు లేవు. కన్నతండ్రి పోయినా వాడు తొంగి చూడకపోవడం… నా జీవితంలో అత్యంత విషాద క్షణాలు! ఇప్పటి ఒంటరి జీవితం కూడా!” అంది రాధిక.

"మా అమ్మాయిల కాపురాలు బాగానే ఉన్నాయి. కానీ మమ్మల్ని తమతో ఉంచుకోవడానికి ఇష్టపడటం లేదు. కొడుకులు ఉంటే ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదని వాపోయేవాళ్ళం. ఎప్పుడో మేము చేసిన పూజలు పుణ్యాలు ఫలించి మా మూడో అల్లుడే మాకు కొడుకుగా నిలిచాడు. ఇప్పుడు వాళ్లతో కలిసి ఉంటున్నాం. అమ్మాయి మనసు బంగారమే. మాకే లోటు లేకుండా చూస్తోంది. వాళ్ళ పిల్లల అచ్చట్లూ ముచ్చట్లతో కాలం ఆనందంగా గడిచిపోతోంది! మావారికి భక్తి ఎక్కువ. గుళ్ళు గోపురాలు అంటూ తిరుగుతుంటారు. నాకు కాలక్షేపం కాక నలుగురూ కలుస్తారని పార్కుకి వస్తుంటాను!" శ్రీరాణి సంతృప్తిగా చెప్పింది.

"భార్య మరణం నన్ను బాగా కృంగదీసింది. అది కలలో కూడా మర్చిపోలేని విషాదం. వ్యాపారంలో పట్టిందల్లా బంగారం అయినప్పుడు ఎంతో సంతోషించాను. ఇప్పుడు అనాయాస మరణం లభిస్తే, నా అంత అదృష్టవంతుడు ఉండడని ఎదురుచూస్తున్నా! ఎప్పుడూ నేను, నా బాగు అని తాపత్రయపడ్డాను తప్ప, ఎవరికీ పిసరంత సాయం చేయలేదు. చేయగలిగి ఉండీ, పుణ్యకార్యం ఒక్కటీ చేయలేకపోయాను. ఇప్పుడు చేయాలనుకున్నా చేయలేని అసహాయత! అందుకే దిగులుగా ఉంటోంది!" బాధపడ్డాడు చిదంబరరావు.

అదిశేషు గొంతు సవరించుకున్నాడు. "ప్రమోషన్ వద్దనుకోవడం చాలా తప్పుడు నిర్ణయం! జీవితంలో ఎదుగూబొదుగూ లేకుండా ఉండిపోయాను. చాలీచాలని పెన్షన్‌తో సతమతమవుతున్నాను. పెద్ద ఉద్యోగం చేసి రిటైర్ అయిన వారికి, లేక ధనవంతులకే సమాజంలో ఎక్కువ విలువ అని ఆలస్యంగా గ్రహించాను! ఇప్పుడెంత ప్రాకులాడినా ఆ తృప్తి, సంతోషం రావు!" దిగులుగా చెప్పాడు.

"మొదట్లో మీ అందరూ బాగా సంపాదించాలని తాపత్రయపడ్డారు. మీ కోసం, మీ కుటుంబం కోసమే గాక, జనం కోసమూ ఏదో మేలు చేయాలనుకున్నారు. వృత్తివ్యాపారాల్లో రాణించాలనుకోవడమూ కుటుంబం, పిల్లల ఉన్నతి కోసమే!

మీ జీవితాలను సమీక్షిస్తే... జీవితం ఆనంద విషాద సంఘటనల సమ్మేళనం అని రుజువవుతోంది! అయినా ఏదో అసంతృప్తితో, పాపభయంతో, జీవితం వ్యర్థమైందనే భావనతో మీలో మీరు రగులుతున్నారు! గణేష్‌గారు ఒక్కరూ తన కలను నిజం చేసుకోవడానికి, అవిశ్రాంతిగా శ్రమిస్తున్నారు. మిగతా వారంతా నిస్తేజంగా మారిపోయారు. అప్పుడే అంతా అయిపోయిందని అస్త్రసన్యాసం చేయాల్సిన అవసరం ఏమాత్రం లేదు!"

"ఈ ఆఖరిదశలో ఇంతకంటే ఏం చేయగలం?"

"తలచుకోవాలి గాని మనిషి చేయలేనిది ఏదీ లేదు. మీరీ స్థితికి రావడానికి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కారణమైన సమాజానికి తిరిగి కొంచెమైనా ఇవ్వాలని, సమాజసేవే సర్వేశ్వరుడి సేవ అని గుర్తించకపోవడం ఏం బాగాలేదు! మీకు చదువు ఉంది. జ్ఞానం ఉంది. శక్తి ఉంది. అనుభవం ఉంది. మనస్సు ఉంటే, ఈ వయసులోనూ ఎన్నో చేయగలరు. మీ నైపుణ్యాన్ని విజ్ఞానాన్ని నలుగురితో పంచుకోగలరు. పదిమందికి చేయూత నివ్వగలరు. జనహిత కార్యక్రమాలు చేపట్టి ఎంతో ఆనందాన్ని, తృప్తిని జుర్రుకోగలరు. ఆ పని, ఈ పని అనేం లేదు. మీ మనసుకు నచ్చింది, మీకు ఎక్కువ తృప్తినిచ్చేది... ఏదైనా సరే చేయండి. మహదానందాన్ని అనుభవంలోకి తెచ్చుకోండి. మనం పోయినప్పుడు, కుటుంబ సభ్యులు గాక

బయటివారు కనీసం నలుగురైనా కన్నీరు పెట్టుకోకపోతే, ఇక మన జీవితానికి అర్థం ఏమిటి! ఆలోచించండి! ఇంతవరకూ గమనాన్ని బట్టి తాత్కాలిక గమ్యాలు ఏర్పరచుకుంటూ సాగిపోయారు. ఇప్పుడు ఒక గమ్యాన్ని నిర్దేశించుకుని అటువైపు సాగిపోమని కోరుతున్నాను. ఇన్నేళ్లూ మీరు మీ కోసం, మీ కుటుంబం కోసం చేసింది చాలు! ఇకనైనా సామాజిక ఋణం తీర్చుకోడానికి, ఆ దిశగా నాలుగు అడుగులు వేయాల్సిందిగా ప్రార్థిస్తున్నాను!" చేతులు జోడించి లేచాను.

వాళ్లు ఒక రకమైన షాక్‌లో ఉన్నారు. వారి మెదడులో నేను నాటిన విత్తనం మొలకెత్తడానికి పురిటి నొప్పులు పడుతోందని నాకు తెలుసు!

నా కర్తవ్యం పూర్తయిందని వెనుదిరుగుతుంటే, "మీ పేరేమిటి స్వామీ!" అడిగారు ఒకరు.

"మీరే అన్నారుగా స్వామి అని... అదే నా పేరు అనుకోండి!"

# ‘వినదగదు’నెవ్వరు చెప్పిన ...

విజయార్కె
✆ 9700289681






**రచయిత పరిచయం**

*రచయిత రాసే అక్షరాలు చదువరుల హృదయాల్లో నిలిస్తే ధన్యమైనట్టే... రచయితగా, జర్నలిస్ట్‌గా నలభై ఏళ్ల ప్రయాణం కొనసాగుతూనే ఉంది. ఏడువందలకు పైగా కథలు కామెడీ , రొమాన్స్, అడ్వెంచర్, క్రైమ్, డ్రామా, హారర్ .. ఇలా అన్ని జోనర్స్‌లో రాయడం ప్రొఫెషనల్ రైటర్‌గా అక్షరప్రయాణం సాగుతోంది. తెలుగులోని అన్ని ప్రముఖ దిన, వార, మాసపత్రికల్లో వీరి రచనలు వచ్చాయి. నలభైకి పైగా నవలలు, యాభైకి పైగా వ్యక్తిత్వ వికాస రచనలు వీరి కలం నుండి జాలువారాయి. కేసీఆర్ (ది లీడర్), జగన్మోహన్ రెడ్డి (విజయయాత్ర), చంద్రబాబు (స్వర్ణాంధ్రవిజేత), ఒకే ఒక్కడు (రేవంత్ రెడ్డి), రోశయ్య, నరేంద్ర మోదీ .. ప్రైడ్ ఆఫ్ ఇండియా వంటి ప్రముఖుల మీద పుస్తకాలు వ్రాసారు.*

***పంచేంద్రియాల్లో ఒకటైన చెవి లేనిదే... ఈ ప్రపంచానికి మాట లేదు! చెవి మన మాటలు వినిపిస్తుంది. మనల్ని ముందుకు నడిపిస్తుంది. అలాంటి చెవికి చెడుమాటలు చేరితే, ఆ చెడుమాటలు చెవి నియంత్రించి, వారికి శిక్ష విధిస్తే... వినదగు నెవ్వరు చెప్పిన... అన్న సుమతి శతక నీతిని పాటించని వారికి, వినిపించకూడని మాటలు వినిపించకుండా... ‘వినదగదు’నెవ్వరు చెప్పిన... అంటూ చెడుమాటలు వినకూడదనే ప్రయత్నం.***


*వినదగునెవ్వరు చెప్పిన*
*వినినంతనె వేగపడక వివరింపదగున్*
*గని కల్ల నిజము దెలిసిన*
*మనుజుడెపో నీతిపరుడు మహిలో సుమతీ!*

సుమతీశతకం తిరగబడితే... చెవులన్నీ చేరి, వినిపించడం మానేస్తే... ‘వినదగదు’నెవ్వరు చెప్పిన... అనే పరిస్థితి ఎందుకు వచ్చింది?

★★★

చెవి, గొంతు, ముక్కు స్పెషలిస్ట్ డాక్టర్ గరుడాచలం... క్లినిక్ ముందు పాతకాలం నాటి మారుతి కారు పార్క్ చేసి విపరీతమైన ఆశ్చర్యానికి గురయ్యాడు. ఆశ్చర్యానికి ముందు కొద్దిగా ఆందోళన కూడా వుంది. ఆ కాలనీలో తాను హాస్పిటల్ తెరిచాక, తనకో అసిస్టెంట్ కూడా అవసరం పడలేదు. ఎప్పుడో అరకొరగా వచ్చే పేషెంట్స్. కానీ ఈరోజు పెద్ద క్యూనే వుంది. డాక్టర్ అన్నాక కాంపౌండర్ లేదా అసిస్టెంట్... చివరికి వార్డ్‌బాయ్ అయినా ఉండాలి కాబట్టి తక్కువ జీతానికి ఒక నిరుద్యోగిని పెట్టుకున్నాడు. అతనికి మూడు నెలల జీతం బకాయి!ఇలాంటి పరిస్థితుల్లో తన క్లినిక్ ముందు పెద్ద క్యూ ఉండటం సంతోషాన్ని, ఆశ్చర్యాన్ని కలిగించింది.ఒక్కసారిగా అతని ఛాతీ ఉప్పొంగింది.

కాంపౌండర్ కమ్ బాయ్ కమ్ అటెండర్ డాక్టర్‌ను చూసి పరిగెత్తుకుంటూ వచ్చాడు. మామూలుగా అయితే డాక్టర్ వచ్చినా, నిర్లక్ష్యంగా అలాగే ఫోన్‌లో వాట్సాప్ చాట్‌లు చూసుకుంటూ, ఉంటాడు. ఈరోజు మాత్రం పరుగెత్తుకొచ్చాడు. గత మూడు నెలలుగా జీతం ఇవ్వకపోవడం వల్ల ఆ నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తూ వస్తున్నాడు. కానీ ఈరోజు ఇంత మంది పేషెంట్స్‌ని చూసాక, తన జీతం గ్యారంటీగా ఈరోజే వస్తుందని అతని నమ్మకం. అందుకే, అతి గౌరవాన్ని ప్రదర్శించాడు.




"ఉదయం నుంచి వైన్‌షాప్ ముందు క్యూలా పెరిగిపోతూనే ఉంది సార్. మన కాలనీలో మూడొంతులు ఇక్కడే ఉన్నారు." చెప్పాడు అతి ఉత్సాహంగా!

డాక్టర్ గరుడాచలం... ఆ క్యూని దాటుకుంటూ, తన గదిలోకి వెళ్ళాడు. కేవలం రెండు గదుల హాస్పిటల్. అద్దె తక్కువని కాలనీలో, ఓ మూలన తీసుకున్నాడు. అతని ఫీజు పది రూపాయలు మాత్రమే. పది రూపాయల డాక్టర్‌గా పేరుంది. ల్యాబ్‌లకు పరీక్షలు రాయడం, ప్రిస్క్రిప్షన్‌తో మెడికల్ షాప్స్‌లో వాటాలు పెట్టుకోవడం లాంటివి తెలియదు.

ఒకరినొకరు తోసుకుంటున్నారు. ఒకరి నొకరు తిట్టుకుంటున్నారు. తిట్టుకున్నా మాటలు వినిపించడం లేదు. ఎవరికి వాళ్ళు గట్టిగా అరుచుకుంటూ, భయంతో చెవులు మూసుకుంటున్నారు.

★★★

గరుడాచలం తన ఎదురుగా ఉన్న వ్యక్తి వైపు చూసాడు. మాస్క్ పెట్టుకున్నాడు. తన ముఖాన్ని కవర్ చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు.

"మిమ్మల్ని ఎక్కడో చూసినట్టుంది?" అన్నాడు గుర్తు తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తూ డాక్టర్ గరుడాచలం.

ఇక లాభం లేదనుకుని తన ముఖానికి ఉన్న మాస్క్‌ను తొలగించాడు.

"మీరా ఆదినారాయణ గారూ?" గుర్తు పట్టి పలకరించాడు. తన ఫ్లాట్ ఎదురుగా ఉన్న ఫ్లాట్‌లో ఉంటాడు. ఎన్నోసార్లు తనతో గొడవ కూడా పడ్డాడు... కారు పార్కింగ్ విషయంలో! అంతే కాకుండా ఆ ఇంట్లో తరచూ భార్యాభర్తల గొడవలు మంద్రస్థాయిలో వినిపిస్తాయి, ఆ గొడవ పడ్డప్పుడు పెద్ద పెద్ద సౌండ్ తో మ్యూజిక్ పెడతారు. అదో డిస్ట్రబెన్స్. అయినా ఆ విషయాలు ఏవీ మనసులో పెట్టుకోకుండా "చెప్పండి మీ సమస్య ఏంటి?" అని అడిగాడు.

కొద్దిగా సిగ్గు, మరి కొద్దిగా భయం కలగలిసిన గొంతుతో చెప్పాడు ఆదినారాయణ. "నేను మాట్లాడిన కొన్ని మాటలు మా ఆవిడకు వినిపించడం లేదు! అలాగే మా ఆవిడ మాట్లాడిన కొన్ని మాటలు నాకు వినిపించడం లేదు. రెండోసారి గట్టిగా మాట్లాడితే, మా మాటలు మాకే పెద్ద సౌండ్‌లో వినిపిస్తున్నాయి. చెవులు చిల్లులు పడే సౌండ్‌లో!"

ఆశ్చర్యంగా అనుమానంగా ,కాసింత ఆసక్తిగా చూసి అడిగాడు డాక్టర్ గరుడాచలం. "మీకు వినిపించని మాటలు ఏమిటి? ఆ మాటలు చెప్పగలరా? మీకు అభ్యంతరం లేకపోతేనే... మీరు పూర్తిగా మీ సమస్య చెబితే తప్ప, నేను ట్రీట్మెంట్ చేయలేను!"

తప్పనిసరి పరిస్థితుల్లో... ఇంట్లో జరిగిన సంఘటన యథాతథంగా గుర్తు చేసుకుని చెప్పడం మొదలుపెట్టాడు.

★★★

ఆదినారాయణ... బద్ధకంగా లేచి భార్యను కేకేశాడు.

"అబ్బబ్బ పొద్దున్నే ఆ గావుకేకలేంటి? ఏం కావాలి?" అంది చిరాగ్గా మొహం పెట్టి మిసెస్ ఆదినారాయణ.

"నీ దరిద్రం... నా పిండాకూడు... పొద్దున్నే దేభ్యం మొహమేసుకుని... ప్రశ్నలొక్కటి..." అరిచాడు రాత్రి తాగిన మందు తాలూకూ హ్యాంగోవర్‌తో, తన క్యారెక్టర్‌ని మిక్స్ చేసి!

మొగుడివంక చూసి "ఏంటి గొణుక్కుంటున్నారు. మీ మాటలు వినిపించడం లేదు. మీ పెదవులు మాత్రం కదులుతున్నాయి!" అంది.

ఆ మాటలతో కోపం నషాళానికి చేరింది. "ఏంటి వేషాలేస్తున్నావా? కష్టపడి సంపాదించి తెస్తే తిన్నదరగక..." అంటూనే అదిరిపడ్డాడు. తన మాటలు తనకే రీసౌండ్‌తో చెవులు బద్దలయ్యేలా వినిపించాయి. వెంటనే చెవులు మూసుకున్నాడు ఆ రీసౌండ్ భరించలేక.

"ఏమిటి... ఏమైంది ఆలా చెవులు మూసుకుని మీలో మీరే గొణుక్కుంటున్నారు?" మొగుడి వాలకాన్ని చూసి అడిగింది. "నా మాటలు నాకే రీసౌండ్‌లా వినిపిస్తున్నాయి!" అన్నాడు

"పెళ్ళాన్ని సాధించుకు తింటే అలాగే అవుతుంది." కిసుక్కున నవ్వి అంది

"నువ్వేంటి నీలో నువ్వే గొణుక్కుంటున్నావ్?" భార్య పెదవులు మాత్రమే కదలడం చూసి అడిగాడు ఆదినారాయణ.

ఆ మాటలు లాంటి తిట్లు రిపీట్ చేసింది. వెంటనే ఆ మాటలు ఆమె చెవులకే విపరీతమైన శబ్దంతో వినిపించాయి.

★★★

"అంటే మీరు అనేదేమిటి? కొన్ని మాటలు వినిపిస్తున్నాయి. మరికొన్ని మాటలు వినిపించడం లేదు అంతేగా!" అన్నాడు డాక్టర్ గరుడాచలం.

"అవును డాక్టర్! మేము తిట్టుకున్న, మాటలు కోపంగా అరుచుకున్న మాటలు వినిపించడం లేదు. పైగా మా తిట్లు మా చెవులకే రీసౌండ్‌తో, మరింత ఎక్కువ శబ్దంతో వినిపిస్తున్నాయి!"

డాక్టర్ గరుడాచలం, ఆదినారాయణ వంక చూసాడు. అతను అబద్ధం చెబుతున్నాడు అనిపించడం లేదు. పైగా అతని భార్య కూడా అతనితో పాటు వచ్చింది. అతనితో పాటు ఇంత మంది జనం వచ్చారు. బహుశా అందరి సమస్య ఇదే అయి ఉంటుంది. ఆ సమస్య ఏమై ఉంటుంది?

వెంటనే అతని భార్యను పిలిపించాడు. మిసెస్ ఆదినారాయణ కూడా భర్త చెప్పిన విషయాలనే కన్ఫర్మ్ చేసింది. తాను కోపంగా పరుషంగా భర్తను తిట్టిన తిట్లు తన చెవుల్లో పెద్ద సౌండ్‌తో మార్మోగిపోయాయని చెప్పింది. క్యూలో ఉన్న అందరినీ ఒక్కొక్కరిని ఓపిగ్గా పిలిచాడు. దాదాపు అందరి సమస్య ఒక్కటే! వాళ్ళు మామూలుగా మాట్లాడుకుంటే వినిపిస్తున్నాయి. తిట్టుకున్నా, కోపంగా బూతులతో అరుచుకున్నా, ఆ మాటలు తమ చెవులకే పెద్ద సౌండ్‌తో వినిపిస్తున్నాయి. ఒక చిన్న అనుమానం... పెద్ద సందేహం! కొంపదీసి మళ్ళీ కరోనా లాంటి వైరస్ ప్రవేశించలేదుగా... కరోనా ప్రభావంతో రుచి లేకపోవడం, జ్వరం, గొంతునొప్పి, ఊపిరి పీల్చడం లాంటి లక్షణాలు కనిపించాయి. కానీ కొన్ని మాటలు వినిపించడం, మరికొన్ని మాటలు వినిపించకపోవడం ఏమిటి?

ఆ క్షణం డాక్టర్ గరుడాచలానికి చెవికి సంబంధించిన ఒక విషయం గుర్తొచ్చింది. చెవి నిర్మాణం ఎంత గొప్పదో చెప్పే విషయం!

"మనం మాట్లాడే మాటలు ధ్వని తరంగాలుగా వెలుపలి చెవి నుంచి మధ్య చెవిలోకి ప్రయాణించి, కర్ణభేరిని తాకుతాయి. కర్ణభేరి, కాక్లియాలోని శబ్దనాడీ కణాలు, శ్రవణ నాడి ద్వారా మెదడుకి చేరవేస్తాయి. మెదడు పూర్వ అనుభవాన్ని, జ్ఞానాన్ని ఉపయోగించి అవి ఎక్కడి నుంచి వచ్చాయి? ఎంత దూరం నుండి వచ్చాయి? ఏ స్థాయిలో, తీవ్రతతో వున్నాయి లాంటి విషయాల్ని, విశ్లేషించి వాటికి సమాధానంగా శరీరభాగాలన్నింటికీ సంకేతాలను పంపుతుంది. బ్యాక్‌గ్రౌండ్ శబ్దాన్నించి మామూలు సంభాషణల్ని వేరు చేసి తెలియపరుస్తుంది. శబ్దాన్ని గ్రహించడం చెవి పని, శబ్దాన్ని విశ్లేషించడం మెదడు పని! ఇంత గొప్ప ఇంద్రియం చెవి.అలాంటి చెవి ఇప్పుడు తన ధర్మాన్ని పునర్లిఖించుకుంటుందా?"

తనకు తెలియని విషయాన్ని నిజాయితీగా అంగీకరిస్తూ, పెద్ద డాక్టర్ని కలవమని, దీనికి ట్రీట్మెంట్ తనకు తెలియదని చెప్పాడు. వాళ్ళ దగ్గర ఫీజు తీసుకోకుండానే పంపించాడు.

"బుద్ధి లేకపోతే సరి... ఫీజు తీసుకుని ఏదో ఒకటి చెప్పి పంపించొచ్చుగా! దరిద్రుడు జీతం కూడా ఇవ్వలేదు!" తనలో తాను గొణుక్కున్నాడు కాంపౌండర్. అతని పెదవులు కదులుతున్నాయి. అప్పుడే అవే మాటలు పెద్ద శబ్దంతో ఆ కాంపౌండర్

చెవిలో మార్మోగాయి. ఆ శబ్దానికి భయంతో గట్టిగా చెవులు మూసుకున్నాడు. చెంపలు వేసుకున్నాడు కాంపౌండర్.

★★★

భయపడుతూనే బాస్ కేబిన్‌లోకి అడుగుపెట్టింది అనామిక! రోజురోజుకు బాస్ పెట్టే టార్చర్ ఎక్కువవుతోంది. వెకిలి మాటలతో వేధిస్తున్నాడు. పిచ్చి పిచ్చి కామెంట్స్ చేస్తున్నాడు. బాస్ కేబిన్‌లోకి వెళ్ళగానే అనామిక వంక చూసాడు. ఆమె శరీరాన్ని కామవాంఛతో స్కాన్ చేస్తున్నాడు.

"అనామికా... ఈ రోజు ఈ డ్రెస్‌లో నువ్వు సెక్సీ గా ఉన్నావ్, ఈ విషయం మీ ఆయన నీకు చెప్పలేదా?" ఆమె వంకే చూస్తూ అన్నాడు.

అనామిక బాస్ వంకే చూస్తోంది. అతని పెదవులు కదులుతున్నాయి, మాటలు వినిపించడంలేదు. "మాట్లాడవేంటి?" ఆమెనే చూస్తూ అన్నాడు.

"ఏం చెప్పాలి సర్?" అర్థం కాక అంది అనామిక.

"ఇందాక నేనేమన్నాను?" నవ్వుతూ అన్నాడు!

"మీరేమీ అనలేదు. మీ పెదవులు మాత్రమే కదిలాయి." అంది సిన్సియర్‌గా అనామిక.

ఆమె ఎస్కేప్ అవ్వడానికి అలా మాట్లాడుతుంది అనుకున్నాను. "ఓకే ఫర్ యువర్ రొమాంటిక్ సేక్... ఐ రిపీట్! అనామికా... ఈ రోజు ఈ డ్రెస్‌లో నువ్వు సెక్సీగా ఉన్నావ్, ఈ విషయం మీ ఆయన నీకు చెప్పలేదా?"

అంతే ఒక్కసారిగా చెవులు బద్దలైన ఫీలింగ్ చెవుల్లో నుంచి రక్తం. 120 డెసిబెల్స్‌తో అంబులెన్స్ సైరన్‌లా తన మాటలు తన చెవులకు వినిపించాయి. గట్టిగా చెవులు మూసుకున్నాడు.

భయంగా అనామిక వంక చూసాడు. తన ఛైర్‌లో కూలబడ్డాడు.

ఏ వైద్యుడూ అతని సమస్యకు పరిష్కారం చూపించలేకపోయాడు. తనే, నోటి దురుసు ఇతరులను అవమానించే మాటలు తగ్గించుకోవాలి, శాశ్వతంగా అలాంటి మాటలు వదిలేయాలి. అతనికి మరో ఆప్షన్ లేదు. అతనే కాదు అతనిలాంటి వారికి ఎవ్వరికీ లేదు.

★★★

రాజకీయ నాయకులు ఒకరినొకరు దూషించుకుంటున్నారు. మామూలుగా కాదు... దూషణ బాణాలు సభ్యత పరిధిని దాటాయి. ఆ క్షణమే వారి దూషణలు వారి చెవులకే వినిపించాయి. 110 డెసిబెల్స్‌తో... మైనింగ్ బ్లాస్ట్, చెవుడుని కలిగించే శబ్దాలతో... రాజకీయ నాయకులు హాస్పిటల్స్‌కు క్యూ కట్టారు. వ్యక్తిగత దూషణలు మాట్లాడాలంటే వణికిపోతున్నారు.

★★★

ఒకేసారి ఇఎన్‌టి హాస్పిటల్స్ క్రిక్కిరిసాయి. ఇది కోవిడ్ ఎఫెక్ట్ అనుకోవడానికి లేదు. మాటలు వినిపిస్తున్నాయి. కానీ మాటలు సెన్సార్ అవుతున్నాయి. బూతులు, దూషణలు, తిట్లు వినిపించడం లేదు. పైపెచ్చు ఆ మాటలు మాట్లాడిన వారికి

రీసౌండ్‌లో, విపరీతమైన డెసిబుల్స్ శబ్దంతో వినిపిస్తున్నాయి. కొందరు ఈ సమస్యతో చెవుడుకు గురవుతున్నారు. దీనికి పరిష్కారం లేదా?

★★★

జిహాద్ జిహాద్ జిహాద్

మతాన్ని, దేవుడిని, అడ్డుపెట్టుకుని కరుడుగట్టిన ఉగ్రవాదులు అక్కడ సమావేశమయ్యారు. దేశంలో విధ్వంసం సృష్టించాలని తెగబడుతున్నారు. "దేశంలో విధ్వంసం సృష్టించండి... రక్తం ఏరులై పారాలి. ఈ దేశంలోని నదులు రక్తంతో ప్రవహించాలి. బాంబు పేలుళ్లతో దేశం అట్టుడికిపోవాలి!" ఉగ్రవాద నాయకుడు గొంతు చించుకున్నాడు.

వెంటనే 165 డెసిబెల్స్ శబ్దతీవ్రతతో పేలుడు పదార్థాల బ్లాస్టింగ్‌లా, ఆ మాటలు ఆ ఉగ్రవాద నాయకుడు చెవుల్లో మార్మోగాయి. అక్కడున్న ఉగ్రవాదుల చెవులను అంతే డెసిబెల్స్ శబ్ద తీవ్రతతో చేరుకున్నాయి. అందరి చెవుల్లో నుంచి రక్తాలు ఏరులై పారింది. దాదాపు చెవుడు పరిస్థితి ఎదురైంది. నిపుణులైన డాక్టర్స్ కూడా చేతులెత్తేశారు.

వినదగని ఆ మాటలు మళ్ళీ ఎవరు మాట్లాడకుండా భయాన్ని పరిచయం చేసాయి. వింటే జరిగే పరిణామాలు చూపించాయి.

★★★

ఒకప్పుడు కరోనా ప్రపంచాన్ని వణికించింది... ప్రతికూలంగా!

ఇప్పుడు ఈ సంఘటనలు ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్నాయి... సానుకూలంగా!

"తిట్టడం, దూషించడం, చెడును కోరుకోవడం, విధ్వంసాన్ని సృష్టించడానికి ప్రయత్నించడం... ఒక ఇంట్లో మొదలయ్యే ఈ సమస్యలు వీధుల్లో, కార్యాలయాల్లో, రాజకీయ వేదికల్లో, దొంగల్లో, మాఫియా కనుసన్నల్లో, ఉగ్రవాదుల మాటల్లో... చెవుల్లోకి దూరిపోతున్నాయి.

ఒకప్పుడు కనిపించని శత్రువు కరోనా క్రిమి ప్రపంచాన్ని వణికించింది. ఇప్పుడు వినిపించే చెవి, అన్యాపదేశంగా ఒక హెచ్చరిక జారీ చేసింది.

వీటికి మూలలను అన్వేషించడమో... నిర్మూలనకు ప్రయత్నించడమో చేయాలి! అది జరిగేవరకు ఇదిలా కొనసాగుతూనే ఉంటుంది.

★★★

ఈ సంఘటనలు జరగడానికి ముందు... ప్రపంచంలోని చెవులన్నీ ఒక చోట చేరాయి.

"మంచిని వినిపించమని, మాటను ఒక చెవి నుంచి మరో చెవికి చేరవేయమని దేవుడు ఆదేశించాడు. మనం శిరసావహించాం. కానీ ఇప్పుడు జరుగుతున్నదేమిటి? మనం మంచితో పాటు చెడును కూడా వినిపిస్తున్నాం. విధ్వంసాలను వినిపిస్తున్నాం... దూషణలు ఈర్ష, అసూయ, ద్వేషాలు వెళ్లగక్కుతున్నారు. హత్యలు చేయమంటున్నారు. అరాచకాలు

సృష్టించమంటున్నారు. మాటలతో అవమానిస్తున్నారు. పంచేంద్రియాల్లో ఒక్కటైన మన చెవిని, చెడు వైపు తీసుకువెళ్తున్నారు. అందుకే ఈ క్షణం నుంచి మంచినే వినిపిద్దాం. చెడును వినిపించకుండా నిరోధిద్దాం. కాదని మాట మీరితే... రెట్టించిన శబ్దంతో ఎవరి మాటలు వారికే వినిపించేద్దాం! వినిపించే చెవిని, చెడు చేసే మాటలకు వాడుకోకుండా హెచ్చరిద్దాం!" చెవులన్నీ నిర్ణయించుకున్నాయి.

"ఈ సంగతి మనం వాళ్లకు ఎలా తెలియజేద్దాం. ఎవరి చెవులకు చేరవేద్దాం!" కొన్ని చెవులు అడిగాయి.

"ఎవరికీ వాళ్ళు తెలుసుకునేలా చేద్దాం.. ఏం చేయాలో, ఏం మాట్లాడాలో వాళ్ళే నిర్ణయించుకోవాలి. చెవి గొప్పతనాన్ని గుర్తించాలి!" మిగతా చెవులు చెప్పాయి.

దాని పర్యవసానం ఈ సంఘటనలు!

★★★

తెల్లవారురఝాము. రాత్రంతా మెలుకువగా ఉండి తన భర్త కార్తికేయ రాసిన కథను చదివి ఒక్క క్షణం అలాగే చూస్తుండిపోయింది విభ్రమ! "ఇంత గొప్ప థాట్ మీకెలా వచ్చింది... మీరు గ్రేట్!" అంది భర్త వంక అడ్మయిరింగ్‌గా చూస్తూ!

"పంచేంద్రియాల్లో ఒక్కటైన చెవి లేనిదే... ఈ ప్రపంచానికి మాట లేదు! చెవి మన మాటలు వినిపిస్తుంది. మనల్ని ముందుకు నడిపిస్తుంది. అలాంటి చెవికి చెడుమాటలు చేరితే, ఆ చెడుమాటలు చెవి నియంత్రించి, వారికి శిక్ష విధిస్తే... వినదగు నెవ్వరు చెప్పిన... అన్న సుమతీశతక నీతిని పాటించని వారికి, వినిపించకూడని మాటలు వినిపించకుండా... 'వినదగదు'నెవ్వరు చెప్పిన... అంటూ చెడు మాటలు వినకూడదనే ప్రయత్నం, మాట్లాడకూడదనే హెచ్చరిక ఈ కథ!" కార్తికేయ చెప్పాడు.. ఒక మంచి కథ రాసిన సంతృప్తితో!

"అది సరే... ఎక్కడో దూరంగా ఆ చెవులు మాట్లాడుకున్న మాటలు మీకెలా వినిపించాయి!" రాత్రంతా కథ రాసి అలిసిపోయిన భర్తను తన గుండెల మీద సేదతీరిస్తూ అడిగింది విభ్రమ!

"చెవులు చెప్పుకున్న మంచి మాటలు, ఈ ప్రపంచానికి మంచిని మాత్రమే మాట్లాడమని, 'చెప్పమని' నా చెవిని చేరాయి!" భార్య గుండెల మీద సేదతీరుతూ చెప్పాడు కార్తికేయ!

తథాస్తు!

# సుఖాభిలాష


పెనుమాక నాగేశ్వరరావు

✆ 9441254044







**రచయిత పరిచయం**

*చదివింది బి.కాం. గుంటూరు టి.జీ.పి.యస్ కాలేజీలో. ఉద్యోగం చేసింది, రిటైరయ్యింది కూడా బ్యాంక్ ఆఫ్ ఇండియా, గుంటూరులోనే! 1981 లో ప్రారంభమయిన ఉద్యోగ జీవితంతో పాటే మొదలయిన సాహిత్య ప్రక్రియలో ఇప్పటి వరకు దాదాపు రెండు వందలకు పైగా కథలు వివిధ పత్రికలలో ప్రచురింపబడ్డాయి. కొన్ని కథలకు బహుమతులు వచ్చాయి. ఆల్ ఇండియా రేడియోలో కొన్ని కథలు ప్రసారమయ్యాయి. సుమిత్రగారి ఇల్లు, నాన్నలూ జాగ్రత్త, అమర సుఖం, ఫారెన్ సెంట్ కథాసంపుటాలు వెలువడ్డాయి. లెక్కల కాపురం, ఆత్మబలం అనే రెండు అనుబంధనవలలు స్వాతి మాసపత్రికలో వెలువడ్డాయి. 'దేవుడి పాట' ఆంధ్రప్రభ వారపత్రికలో సీరియల్‌గా ప్రచురింపబడి, నవలగా ముద్రించబడినది. కొన్ని కథలు ప్రముఖ నవల, కథా రచయిత, వీరి మేనమామ, మామగారైన శ్రీ ద్వారక (శ్రీ చెంచు వెంకటరత్నం) గారు, ఆంగ్లములోనికి అనువాదము చేశారు. ఆ కథలను 'నెక్టార్ ఆఫ్ లైఫ్' అనే పేరున సంపుటిగా వెలువరించటం జరిగింది. సాహితీప్రక్రియల్లో కథలంటేనే ఎక్కువ మక్కువ. కష్టసుఖాల కల్నేతగా సాగే ఈ జీవనప్రయాణంలో, కడదాకా కథలతోనూ, కలంతోనూ కలసి సాగాలని కోరిక!*

**ముకుంద్ తాత్కాలికంగా పద్మ అప్పు గురించి మరచిపోయాడు.**
**నెలలు దొర్లిపోయినాయి. సంవత్సరాలు మారిపోయినై. క్యాలండర్లు కొత్తవి వస్తున్నై, పోతున్నై. అలా మరో రెండు సంవత్సరాలు గడిచినై... అంటే పద్మ అప్పు తీసుకుని మూడున్నర ఏళ్ళు! ఆవిడ మిగిలిన విషయాలు అవసరం మేరకు అప్పుడప్పుడు మాట్లాడుతున్నది కానీ, డబ్బు సంగతి ఆనాడు చీటీలో చెప్పటం తప్ప, మళ్ళీ ఆ మాట ఎత్తితే ఒట్టు.**

"ముకుంద్... మీతో ఓ ముఖ్యమైన విషయం మాట్లాడాలి!"

పక్క సీట్లో పనిచేసే కొలీగ్ పద్మ అభ్యర్థన విన్న ముకుంద్ ఒక్కసారిగా ఖిన్నుడయ్యాడు.

"చెప్పండి" అన్నాడు.

"ఇక్కడ కాదు, ఓ అయిదు నిముషాలు క్యాంటిన్‌లో మాట్లాడుకుందాం!"

"వెంటనేనా... కాసేపు ఆగాకనా?"

"నేను వెళతాను. కాసేపటికి మీరూ రండి!"

ఇక పనేమి చేస్తాడు? కంప్యూటర్లో అంకెలు, అక్షరాలుగానూ, అక్షరాలు అంకెలుగానూ... మనసంతా గందరగోళంగా ఉంది.

ఎవరో, ఎవరో అయితే అంతా గందరగోళం పడాల్సిన పనేం ఉండదు కానీ, సాక్షాత్తు పక్కసీటు పద్మ అలా మాట్లాడటం ముకుంద్‌ని అమిత ఆశ్చర్యానికి గురిచేసింది. ఇక అలా ఉక్కిరిబిక్కిరి అవటం ఇష్టం లేక, కంప్యూటర్ ఆఫ్ చేసి సెల్ చేతిలోకి తీసుకుని ఓసారి పద్మ వైపు చూసి క్యాంటీన్‌కి బయలుదేరాడు ముకుంద్.

ఆఫీసు ఆవరణలోనే మొదటి అంతస్తులో, కాస్తంత విశాలంగానే క్యాంటీన్ ఏర్పాటు చేశారు యాజమాన్యం. ఉదయం బ్రేక్‌ఫాస్ట్ గానీ, మధ్యాహ్నం భోజనం గానీ, సాయంత్రాలు చేసే వేడివేడి స్నాక్స్ కానీ రుచిగానే ఉంటుంటాయి! అందుకే స్టాఫ్ క్యాంటిన్లో తినడానికి ఇష్టపడుతుంటారు. పైగా రుచితో పాటు, శుచిగా కూడా ఉండటం మరో ప్లస్ పాయింట్! అన్నీ బానే ఉంటాయి కానీ, సెల్ఫ్‌సర్వీస్ చేసుకోవాలి. అదొక్కటే ముకుంద్‌తో పాటు మరికొంతమందికి నచ్చని విషయం. నిజానికి సెల్ఫ్‌సర్వీస్ నచ్చని వాళ్ళల్లో ఆడవాళ్లే ఎక్కువ!



క్యాంటిన్‌లో ముగ్గురే పని చేస్తుంటారు. వంట మాస్టర్ వెంకటేశ్వర్లు, వాటిని ప్లేట్లల్లో పెట్టి కౌంటర్ మీద పెట్టే రత్నం, క్లీనింగ్ పనిచేసే సుబ్బులు. డబ్బు లావాదేవీలు కూడా రత్నమే చూసుకుంటాడు. యాజమాన్యం ఏర్పాటు చేసిన క్యాంటిన్ కాబట్టి ధరలన్నీ తక్కువగానే ఉంటాయి! సరసమైన అనేకంటే సబ్సిడీ ధరలనటమే సబబుగా ఉంటుంది.

సహజంగా అలా ఆఫీసుల్లో ఉండే క్యాంటీన్లలో రోజూ ఒకే బల్లకు అలవాటుపడుతుంటారు. ఒంటరిగా వచ్చినా, కొలీగ్స్‌తో వచ్చినా, అప్రయత్నంగా కాళ్ళు అటే నడుస్తాయి. అలా ముకుంద్ తనకు అలవాటైన టేబుల్ దగ్గరకు వెళ్ళి కూర్చున్నాడు.

"నమస్తే ముకుంద్ సార్. ఏమివ్వమంటారు?" అడిగాడు వెంకటేశ్వర్లు.

"ఓ అయిదు నిమిషాలు ఆగు చెబుతా!" అంటూ పక్క టేబుల్ మీద ఉన్న దినపత్రిక చేతిలోకి తీసుకున్నాడు. కళ్ళు కదులుతున్నాయి గానీ, ఒక్క మాటా మనసులోకి పోవటంలా! 'పద్మ ఏ విషయం మాట్లాడుతుంది? తను ఎలా స్పందించాలి' అనే విషయాల పట్ల తిరుగుతున్నది అతని మనసు. మామూలుగా పద్మ ఒకరిద్దరు ఆడ కొలీగ్స్‌తో తప్ప మిగిలిన ఎవ్వరితోనూ కలుపుగోలుగా ఉండదు. పని విషయం తప్ప, ఇంకో సంగతి ఎప్పుడూ మాట్లాడలేదు. ఒకటి రెండు సార్లు వ్యక్తిగత విషయాల గురించిన ప్రస్తావన వచ్చినా, తెలివిగా నవ్వి ఊరుకుంటుందే తప్ప, ఆమె ఏమీ చెప్పదు! ఇవతలివారు స్వంత విషయాలు మాట్లాడటం ఆమెకు ఇష్టం లేదు కాబోలు అనుకునే విధంగా ప్రవర్తించటం పద్మ ప్రత్యేకత! ముకుంద్ ఆమె గురించి అలా ఆలోచిస్తుండగానే పద్మ వచ్చేసింది.

ముకుంద్ తన చేతిలో ఉన్న పేపర్‌ని మడిచి పక్కన పడేశాడు. పద్మ వచ్చి ఎదురుగ్గా ఉన్న కుర్చీలో కూర్చుంది.

"టిఫిన్ చేస్తారా?" అడిగాడు ముకుంద్.

"కాఫీ తాగుదాం సార్!" చెప్పింది పద్మ

"వెంకటేశ్వర్లూ, రెండు కాఫీ!"

"మీరు నాకో సహాయం చేయాలి ముకుంద్‌గారూ" చిన్నగా అన్నది ఆమె.

"చెప్పండి. తప్పకుండా ప్రయత్నం చేస్తాను."

"మీరు చేయలేనిదేమీ కాదులెండి"

కాఫీ సుబ్బులు చేత పంపించాడు రత్నం

"నాకు ఓ పాతికవేలు అప్పుగా ఇవ్వాలి మీరు! దయచేసి ఎందుకు, ఏమిటి అని మాత్రం అడక్కండి!" వేడుకోలుగా అన్నది పద్మ

నిజంగా నిర్ఘాంతపోయాడు ముకుంద్! పద్మకు ఆర్థిక అవసరం ఉంటుందని, మరొకరి దగ్గర ఆమె అప్పుకోసం అడగటం అనేది తన ఊహకే అందని విషయం.

"దయచేసి ఈ విషయం ఎవ్వరికీ తెలియనీకండి" మరో బాంబ్ పేల్చింది.

"అబ్బే నేనెవ్వరితోనూ అనను!"

"ఇంకో విషయం కొంచం ఆలస్యం అవుతే అవుతుంది గానీ, తప్పక తీర్చేస్తాను!" ఇంకో బాంబ్ వేసింది.

"చాలా అవసరమయ్యి అడుగుతున్నాను. ఎవర్ని అడగాలో రాత్రంతా ఆలోచించి మిమ్మల్ని అడుగుతున్నాను!"

"అయ్యో భలేవారే! అడగటంలో తప్పేం ఉంది?"

"ఇవ్వటంలో కూడా లేదనుకుంటా" అని నవ్వింది పద్మ.

"మీరు ఇలా కూడా మాట్లాడగలరా?"అన్నాడు తనూ నవ్వుతూనే ముకుంద్.

"డబ్బుల కోసం మాత్రం కాదు!" కొంచం ఫీలయినట్లుంది పద్మ మాట.

"అబ్బే... నా ఉద్దేశ్యం అది కాదు..." అని ఏదో చెప్పేంతలో, "మిమ్మల్ని ఇబ్బంది పెడుతున్నానా?" అడిగింది పద్మ.

"నాటెటాల్...ఇవ్వాళే కావాలా, టైముందా?" అడిగాడు ముకుంద్.

"వీలయితే వెంటనే..." అన్నది కళ్ళు దించుకుని.

పరిస్థితి ఏమిటో అర్థం కావటం లేదు ముకుంద్‌కు.

"ఫోన్‌పే చేయమంటారా?" అడిగాడు సెల్ చేతులోకి తీసుకుంటూ.

"నో... నో... క్యాషే కావాలి!"

"సరే, నేను ఇంటునుంచి ఇటే బ్యాంక్‌కు వెళ్ళి డ్రా చేసుకు వస్తాను. మీరు ఆఫీసుకు వెళ్ళండి. ఓ అరగంటలో వస్తాను. మేనేజర్‌గారు అడిగితే చెప్పండి!" అంటూ కుర్చీలోనుంచి లేచాడు.

"ఏదీ నేను డబ్బులు అడిగిన విషయం వగైరా అంతానా... మీరు ఓ అరగంటలో వస్తారనా?" అడిగి మళ్ళీ నవ్వింది పద్మ.

నవ్వేడు గానీ, పద్మ అలా మాట్లాడటం చాలా వింతగా అనిపించింది ముకుంద్‌కు! ఆమె అలా ఆఫీసులో ఎప్పుడూ జోవియల్‌గా ఉండటం తానే కాదు, ఎవరూ చూడలేదు. మరిప్పుడు ఈ కొత్త పోకడ ఏమిటో... వింతగా అనిపించింది ముకుంద్‌కు! పద్మ ఆఫీసుకు, ముకుంద్ బ్యాంక్‌కు వెళ్ళిపోయారు.

పద్మకు తన సమస్యకు అంత సులభంగా పరిష్కారం దొరికినందుకు ఆనందంగానే ఉంది. ముకుంద్‌కే ఇదంతా ఓ పజిల్‌గా తయారయ్యింది. అవును... పద్మకు జీతం బాగానే వస్తుంది. ఆమె భర్త కూడా పెద్ద ఉద్యోగమే చేస్తున్నాడు. బంగాళాలాంటి ఇల్లు కట్టుకున్నారు. పిల్లలు చిన్నవాళ్లే. భర్త కు రెండు, మూడు ఎకరాల పొలం కూడా ఉంది వాళ్ళ స్వంత ఊళ్ళో... ఇంటితో పాటు అని కూడా ఎవరో చెప్పగా విన్నాడు ముకుంద్.

అలాంటి పద్మకు పాతిక వేలు అవసరం రావడం, తనను అడగటం, ఎందుకు అని అడగవద్దనటం, ఎవ్వరికీ తెలియనీయవద్దని చెప్పడం... అన్నీ ఆశ్చర్యానికి గురిచేసినై అతన్ని! అయినా అన్నింటికీ కాలమే సమాధానం చెబుతుందనుకుని, సంయమనం పాటించాడు. ఆమె మాట ప్రకారమే 'ఎందుకు?' అని అడగకుండా డబ్బులు ఇచ్చేసాడు, ఎవ్వరితోనూ ఆ విషయం చెప్పకుండా తనలోనే ఉంచుకున్నాడు.

మరో విషయమూ, విశేషమూ ఏమిటంటే.. ఆ మర్నాటి నుంచి మళ్ళీ పద్మ, ముకుంద్‌లు ఆఫీసులో, గతంలోలాగే ఉన్నారు. ఈ సంఘటన వలన, వారిద్దరి మధ్యా ఎలాంటి చనువూ ఏర్పడలేదు. ఏ ఒక్కరూ చనువూ చూపించనూ లేదు. ముకుంద్

ఆమె దగ్గర ఆ ప్రస్తావన తేలేదు. విచిత్రంగా ఆమె ఆ అప్పు గురించి మాట్లాడలేదు. ఇదంతా జరిగింది నిన్ననో, మొన్ననో కాదండీ బాబూ, సరిగ్గా సంవత్సరన్నర కిందట! అంటే పదునెనిమిది నెలలు కిందట. అంటే సరిగ్గా డెబ్బై రెండు వారాలయ్యింది. ముకుంద్‌కు గుర్తున్నది కానీ, పద్మకు గుర్తుందో లేదో భగవంతుడికే తెలియాలి!

"నీతో ఓ ముఖ్యమైన విషయం మాట్లాడాలి రవీ?" అడిగాడు ఓ రోజు ముకుంద్ తనతో స్నేహంగా ఉండే కొలీగ్ రవిని.

"చెప్పు... వినిపించు!" అన్నాడు రవి.

ముకుంద్, తను పద్మకు డబ్బు ఇచ్చిన విషయం వివరంగా చెప్పాడు.

"ఇంతకాలంగా మళ్ళీ మీ ఇద్దరి మధ్యనా ప్రసక్తే రాలేదా?" ఆశ్చర్యంగా అడిగాడు రవి.

తల అడ్డంగా ఊపాడు ముకుంద్.

"ఇంకా ఎవరికైనా తెలుసా, లేదా?" అడిగాడు రవి.

అడ్డంగా ఊపాడు తల ముకుంద్.

"ఇన్నిరోజులు నాకు కూడా చెప్పలేదంటే చాలా ఆశ్చర్యంగా ఉంది!"

"ఆమె ఎవరికీ చెప్పవద్దని మరీమరీ చెప్పేసరికి ..."

"అయినా ఆమెకు డబ్బు ఇంకొకరి దగ్గర అప్పు తీసుకోవాల్సిన అవసరం ఏమై ఉంటుందో.. ఎంత ఆలోచించినా అంతుబట్టటం లేదు ముకుంద్! స్థితిపరులే. ఇప్పటికిప్పుడు నా బోటివాళ్ళు... అవసరపడి లక్ష రూపాయలు అడిగితే వెతుక్కోకుండా ఇవ్వగలిగిన కెపాసిటీ ఉన్న మనుషులు ఉన్నారు. ఇదేదో బాగా ఆలోచించాల్సిన విషయమే!" సాలోచనగా అన్నాడు రవి.

"ఏ రకంగానన్నా డబ్బు పోగొట్టుకుని, భర్తకి భయపడి సర్దుబాటు చేయటానికి తీసుకుందేమో అనుకున్నా ఇన్నాళ్ళు... చాలా ఎక్కువ టైము కదా!" తన మనసులో మాట బయటపెట్టాడు ముకుంద్

"నాకేమనిపిస్తుందంటే...ఆమె డబ్బు తీసుకున్నది తన కోసం కాకపోవచ్చు! ఎవరికోసమో అయివుంటుంది. ఏమంటావ్?" అడిగాడు రవి

"అంత స్నేహితుల కోసం అయితే...ఆమె డబ్బే ఇస్తుంది గానీ, మనల్ని అడిగి ఇస్తుందా!" తన అనుమానాన్ని బయటపెట్టాడు ముకుంద్.

"అదీ నిజమే. వాళ్ళ పుట్టింటి వాళ్ళు కూడా బాగా స్థితిపరులే. వాళ్ళ కోసం అదీ పాతికవేలు... నో... నో అందుకు అయి ఉండదు!" తేల్చేశాడు రవి.

"ఒకవేళ ఇంట్లో పనిమనిషి పిల్లల చదువుల కోసమో, అనారోగ్యం వల్లనో ఈమెని అడిగితే, ఇలా ఏర్పాటు చేసిందా?" ముకుందే అన్నాడు గానీ, అదీ సరైన కారణంగా అనిపించలేదు.

ఇలా ముకుంద్, రవి... రకరకాల ఊహాగానాలు చేసినా, వాళ్ళకి ఓ పట్టాన అసలు కారణం ఏదో అర్థం కాలేదు, అంతు పట్టలేదు!

అప్పటికి ఆ విషయాన్ని అక్కడ వదిలేసి ఎవరి పనుల్లో వాళ్ళు మునిగిపోయారు. రవి మరొకరితో ఈ విషయాన్ని చెప్పడని ముకుంద్‌కు నమ్మకం!

సరిగ్గా ఆ మర్నాడే మరో విచిత్రం జరిగింది. ముకుంద్ ఆఫీస్‌కు వెళ్ళి తన సీట్లో కూర్చోబోతుండగా టేబుల్ పైన ఉన్న పేపర్‌వెయిట్ కింద ఓ చిన్న చీటీ కనబడింది. చూశాడు ముకుంద్. 'మీ డబ్బుల కోసం మరి కొంత కాలం ఆగండి. రవిగారితో సహా ఎవ్వరికీ చెప్పకండి. దయచేసి తప్పుగా అర్థం చేసుకోకండి. సహనంగా, సంయమనం గా ఉండండి' అని వ్రాసి ఉంది. ఆ చీటి పద్మ వ్రాసిందేనని అర్థం అయింది. మౌనం వహించటం తప్ప, మరో మార్గం కనిపించలేదు అతనికి.

రవితో ఆ విషయం చెప్పటమే న్యాయం అనిపించింది. అందుకే లంచ్ టైములో చీటీ సంగతి చెప్పాడు రవికి.

"సరే చూద్దాం కానీ..." అన్నాడు అతను, అంతకన్నా మాట్లాడటం సబబు కాదన్నట్లు.

'మొత్తానికి పద్మ నాదగ్గర డబ్బులు తీసుకున్న సంగతి మరచిపోలేదు. అంతే చాలు. మరికొంత గడువు అడిగింది. అంతే. నష్టం లేదు.' అనుకున్న ముకుంద్ తాత్కాలికంగా పద్మ అప్పు గురించి మరచిపోయాడు.

నెలలు దొర్లిపోయినాయి. సంవత్సరాలు మారిపోయినై. క్యాలండర్లు కొత్తవి వస్తున్నై, పోతున్నై. అలా మరో రెండు సంవత్సరాలు గడిచినై... అంటే పద్మ అప్పు తీసుకుని మూడున్నర ఏళ్ళు! ఆవిడ మిగిలిన విషయాలు అవసరం మేరకు అప్పుడప్పుడు మాట్లాడుతున్నది కానీ, డబ్బు సంగతి ఆనాడు చీటీలో చెప్పటం తప్ప, మళ్ళీ ఆ మాట ఎత్తితే ఒట్టు. నిజం చెప్పాలంటే ముకుంద్ అప్పుడప్పుడు మనసులో అనుకున్నాడే గానీ, ఎప్పుడూ ఆ విషయంగా బాధ పడింది లేదు.

అనుకోకుండా ముకుందుకు, పద్మకు, మరో ఇద్దరికీ బదిలీలు వచ్చాయి! పిల్లలు, స్కూళ్ళు, అద్దె ఇళ్ళు, సామాను తరలింపు వగైరాలలో తలమునకలై వున్న ముకుంద్‌కు, పద్మకిచ్చిన డబ్బుల విషయం గుర్తుకే రాలేదు. ఆఫీసులో బదిలీ వచ్చిన నలుగురికి ఒకేరోజు వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. సమావేశం అయిపోయి ఇంటికి వెళుతుండగా పద్మ, ముకుందుతో డబ్బు విషయం ప్రస్తావించింది

"నేను రేపు మీ ఇంటికి వస్తున్నాను. మీ దగ్గర తీసుకున్న డబ్బు విషయం మీతో, మీ భార్యతో కూడా మాట్లాడాలి!" అని మాత్రం చెప్పి విసవిసా వెళ్ళిపోయింది పద్మ.

అచేతనంగా ఉండిపోయాడు ముకుంద్.

ఉదయం పదకొండు గంటల ప్రాంతంలో ముకుంద్ ఇంటికి వచ్చింది పద్మ. ఉభయకుశలోపరి అయ్యాక కాఫీలు తాగటం కూడా పూర్తిచేశారు. పద్మకు, ముకుంద్ భార్యతో గతంలోనే పరిచయం ఉన్న కారణంగా మళ్ళీ వాళ్ళని ఒకరొకరికి పరిచయం చేయాల్సిన అవసరం లేకపోయింది.

"నేను కొంచం ఎక్కువ చనువు తీసుకున్నానేమో తెలీదు కానీ, మీ మంచి కోసమే చేశాను. మన ఆఫీసులో మీరు, రవిగారు తప్ప అందరూ ఆర్థికంగా బాగానే ఎదిగారు. డబ్బులు ఏదోరకంగా పెట్టుబడి పెట్టుకుని స్థితిపరులయ్యారు. అవుతున్నారు. మీరూ, ఆ రవిగారే ఎటువంటి ప్రణాళిక లేకుండా వచ్చిన డబ్బు వచ్చినట్లు అయిపోగొట్టుకుంటున్నారు. అందుకే మీ దగ్గర అప్పు పేరుతో డబ్బులు తీసుకున్నాను. ఆ సొమ్ముతో ఇదిగో ఈ బంగారం కొన్నాను. దీని విలువ ఇప్పుడు అరవై వేలు.

మూడున్నర ఏళ్లల్లో రెండున్నర రెట్లు అయింది మీ డబ్బు! డబ్బుతో ఆనందం రాదు నిజమే! డబ్బుతో అవసరం వస్తుంది. డబ్బుతో సుఖం వస్తుంది. డబ్బుతో గౌరవం వస్తుంది. కాబట్టి ఆదాయంలోనుంచి కొంత ఆదా చేయటం. ఆదా చేసిన దానిలో కొంత మదుపు చేయటం అలవాటయితే చాలు, అదో వ్యసనంలా మారిపోతుంది. డబ్బుని లెక్కేసే పద్ధతే మారిపోతుంది. అందుకు సుఖాభిలాష ఉండాలి. అది మీకు కలిగించడం కోసమే నేను తాపత్రయపడ్డాను!" అంటూ బయలుదేరేందుకు సిద్ధమయ్యింది పద్మ.

నాకు ఇంతటి సుఖాభిలాష కలిగించిన ఆ శ్రేయోభిలాషికి, చీరె, జాకెట్టు పెట్టి, కృతజ్ఞత చెప్పింది మా గృహలక్ష్మి!






# సర్దుబాటు

టి.వి.యెల్. గాయత్రి
✆ 8390705200

**రచయిత్రి పరిచయం**

*పూర్తిపేరు తోకచిచ్చు విజయలక్ష్మీ గాయత్రి (టి.వి.యెల్. గాయత్రి). తండ్రి కీ. శే. పవని శ్రీధరరావుగారు, తల్లి కీ.శే శ్రీమతి పవని నిర్మల ప్రభావతిగారు ప్రముఖ నవలా రచయిత్రిగా తెలుగుప్రజలకు చిరపరిచితులు. రచనా వ్యాసంగం 2019 సంవత్సరంలో శ్రీ తోపెల్ల బాలసుబ్రహ్మణ్యశర్మగారి దగ్గర పద్యవిద్య నేర్చుకోవటంతో ప్రారంభమయింది. శతకవిజయము, కవన త్రివేణీసంగమం ప్రచురితములు. ఇప్పటి దాకా 25 సంకలనాల్లో పద్యాలు, కవితలు ప్రచురింపబడ్డాయి. వివిధ పత్రికల్లో 200 దాకా పద్యాలు, కవితలు ప్రచురింపబడ్డాయి. వీరు వ్రాసిన సామాజిక ఖండికలకు 2023 తానా కావ్య పోటీల్లో తొమ్మిదవ స్థానం వచ్చింది. ఇప్పటివరకు 50 కథలు వ్రాస్తే, అందులో 25 కథలకు వివిధ పోటీల్లో బహుమతులు వచ్చాయి. వీరు వ్రాసిన 20 వ్యాసాలు, 25 రూపకాలు కూడా వివిధ పత్రికల్లో ప్రచురింపబడ్డాయి. 2022లో స్టోరీ మిర్రర్ వారు 'ది ఆథర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు ఇచ్చారు. 2024లో సాయివనంలో సాహిత్యం వారిచే 'కవనరత్న' బిరుదును అందుకున్నారు.*

> ***'ఎన్నిసార్లు వికాస్ చెప్పినా తను ఒక్క సారన్నా అతడి మాట విన్నదా? ఈరోజు తన ఫ్రెండు చీర కట్టుకొని రమ్మంటే సంతోషంగా తయారవుతోంది! అదే వికాస్ చెప్తే దాష్టికం చేస్తున్నాడనుకుందా రోజు! చిన్న చిన్న విషయాలకే తను ఓవర్ రియాక్ట్ అయిందా? నిజంగా అన్నయ్య చెప్పినట్లు కొద్దిగా సర్దుకుపోతే బాగుండేదా?'***
> ***ఏదో పోగొట్టుకున్నట్లు ... మనసులో బాధ. పూడ్చలేని వెలితి!***

ఆఫీసులో పని చేసుకొంటోంది తపతి.

తల్లి మాధురి దగ్గర్నుంచి ఫోన్ వచ్చింది.

"నీ మేనేజర్‌కు చెప్పి, రేపు సెలవు పెట్టు! పెళ్ళికి వెళ్లివద్దాం! రాకపోతే మామయ్య ఊరుకోడు. బాధపడతాడు!"

విసుగ్గా ఉంది తపతికి.

"అబ్బ! నువ్వు, నాన్న వెళ్లిరండి! నావల్ల కాదు! నేను ఎక్కడికీ రాలేను!"

ఎవరిమీదో కోపం... అందరి నుండి దూరంగా పారిపోవాలి! ఒంటరితనం కోరుకుంటోంది మనసు.

"ఫినిక్స్‌లో పిక్చర్ చూద్దామా!" ప్రక్క సీటు భావన అడిగింది.

"నాకిప్పుడు మూడ్ లేదు భావనా!"


తపతికి తలనొప్పిగా ఉంది.

“నువ్వు కాస్త మనుషుల్లోకి వస్తే బాగుంటుంది. ఎంతకాలం ఇలా నిన్ను, నువ్వు హింసించుకుంటూ ఉంటావు?”

“తర్వాత బాగుపడతానులే!” పెదాల మీదకు బలవంతంగా నవ్వు తెచ్చుకొంది తపతి.

“హలో తపతీ! హౌ ఆర్ యూ?” అప్పుడే వచ్చిన వీణ నవ్వుతూ పలకరించింది.

ఆఫీసులో ఎవరైనా కొలీగ్స్ నవ్వుతూ పలకరిస్తే ముడుచుకుపోతోంది తపతి.



ఏణ్ణర్ధం క్రిందట తపతి పెళ్లి వికాస్‌తో జరిగింది. ఆ తర్వాత ఆరు నెలలకే ఇద్దరికీ పడలేదని విడాకుల కోసం అప్లై చేసుకున్నారు. టైమ్ పడుతుందని చెప్పింది లాయర్.

తపతి అన్న సారంగ్. అతని భార్య సౌమ్య. ఇద్దరూ అమెరికాలో ఉంటారు. ఇక్కడ సమస్యల గురించి సారంగ్ అంతగా పట్టించుకోడు. తన సంసారం... తన ఉద్యోగం... తన గొడవేదో తనది! నిజానికి తపతి విడాకులు తీసుకోవడం సారంగుకు అసలు ఇష్టం లేదు.

“మనం కొంచెం సర్దుకుపోతే బాగానే ఉండేది!” అని సన్న సన్నగా అంటూ ఉంటాడు.

విడాకుల పర్వం మొదలయింది. తపతి ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడటం లేదు. అందరూ తనదే తప్పన్నట్లు చూస్తున్నారని ఒక ఫీలింగ్!

కంప్యూటర్ ముందు కూర్చుని, పని చేసుకుంటున్న తపతికి వికాస్‌తో గడిపిన సంసార జీవితం గుర్తొస్తోంది.

ఆర్భాటంగా, అట్టహాసంగా పెళ్లి జరిగింది...

కొత్త కాపురం బెంగళూరులో... ఏవేవో సామాన్లు కొనుక్కోవడం.. మాల్స్‌కు, సినిమాలకు, షికార్లకు తిరగటం...

రెండు నెలలపాటు ప్రపంచం గుర్తుకు రాలేదు కొత్త జంటకి!

మూడో నెల మొదలైంది. కడుపులో కాస్త నొప్పి వచ్చింది తపతికి.

“ఏమీ లేదు! జంక్‌ఫుడ్ తగ్గించండి! ఇద్దరూ ఇంట్లోనే చేసుకుని తినండి, తగ్గిపోతుంది!” అంది డాక్టర్.

ఇద్దరికీ ఆఫీసులు! పొద్దున్నే లేచి వంట చేయాలంటే కష్టంగా ఉండేది... తపతికి. పైగా త్వరగా పనులు చేసుకోవటం చేతకాదు. కాస్త ఆలస్యంగా నిద్రలేచే వికాస్‌ని చూస్తే ఒళ్ళు మండేది.

“కాస్త ముందు లేచి హెల్ప్ చెయ్యొచ్చు కదా! నేను ఒక్కదాన్ని కష్టపడుతున్నాను!” అనేది.

‘వంట అనేది ఆడవాళ్లు చేసే పని’ అనుకునేవాడు వికాస్.

విసుక్కుంటూ, నసుక్కుంటూ వంట పని పూర్తి చేసేవాళ్ళు ఇద్దరూ కూడా!

పనిమనిషి వచ్చి, తన పని తను చేసాక కూడా ఇల్లంతా చిందరవందరగా ఉన్నట్లుగా ఉండేది.

ఇద్దరికీ కాసేపైనా విశ్రాంతి దొరికేది కాదు. కొత్తగా పెళ్లయిన మోజు... కాస్త కాస్త తగ్గటం మొదలుపెట్టింది. రాత్రిపూట భోజనాలయ్యాక వికాస్ కాసేపు టీవీ చూస్తూ ఉంటే, చికాగ్గా ఉండేది తపతికి.

“కాస్త వంటిల్లు సర్దొచ్చుగా!”అంటూ గొణిగేది.

వినిపించుకునేవాడు కాదు వికాస్.

రాత్రి తపతి నైటీలో బెడ్‌రూమ్‌లోకి వస్తే “మంచిగా చీర కట్టుకోరాదూ! చాలా బాగుంటావు!” అనేవాడు వికాస్.

"ఫాన్సీ డ్రెస్సు కాంపిటీషన్ ఏమన్నా ఉందా ఇప్పుడు? రోజూ ఆ దిక్కుమాలిన చీర కట్టుకోవటం నా వల్ల కాదు!"

"అబ్బా! ఆ నైటీ చూస్తే అస్సలు ముట్టుకోవాలనిపించదు!"

"నువ్వు షార్ట్స్ వేసుకొని తిరుగుతుంటే పరమఛండాలంగా ఉంటావు! నేను భరించటం లేదూ!" అంటించేది తపతి.

కోపంగా అటు తిరిగి పడుకొనేవాడు వికాస్.

క్రమక్రమంగా ఇంకో నెల రోజులు గడిచేసరికి, ఒకరిలోని లోపాలు ఇంకొకరికి వికృతంగా కనిపించటంతో ఇంకా దూరం పెరగసాగింది.

"అసలు నీలాంటి వెధవని ఎలా పెళ్లి చేసుకున్నానో నాకే తెలియటం లేదు! అంతా నా ఖర్మ!" అసహనంతో వికాస్ మీద ఎగిరిపడేది తపతి.

వికాస్ మాత్రం తక్కువ తిన్నాడా!

"నీకింత పొగరు ఉందని నేనే కనుక్కోలేకపోయాను! ఏ ఒక్క పనీ చేతకాదు! ఆడపిల్లలాగా పెరిగావా? మా అమ్మ ఇప్పటికి కూడా ఉద్యోగం చేస్తోంది! వంటావార్పు చేసి, స్కూలుకు వెళ్తుంది! నీలాగా ఎప్పుడూ విసుక్కున్నది లేదు!" ఖయ్యిమనేవాడు వికాస్.

"ఆ! నీకు మీ అమ్మే రోల్ మోడల్! కాలం మారింది! ఇప్పుడు మగవాళ్లందరూ ఇళ్లల్లో పనిపాటులు చేస్తున్నారు. నీలాగా మొద్దు వెధవల్లాగా ఎవ్వరూ లేరు! నీలాంటి జడ్డి మొహంగాణ్ణి ఎక్కడా చూడలేదు! నీ కింద అణిగి మణిగి ఉంటూ, నీ ఇష్టమొచ్చినట్లు చీరెలు సారెలు కట్టుకొని నిన్ను తృప్తి పరచటానికి నేనేం పాతకాలం పెద్దమ్మని కాను! గుర్తుపెట్టుకో! నాక్కూడా వ్యక్తిత్వం ఉంది!" ఝాడించి పారేసేది తపతి.

ఫలితం!

ఇద్దరి మధ్యా అగాధం మరింత పెద్దదయింది. ఇంకో నెల అతి కష్టం మీద కలిసి బ్రతికారిద్దరూ! ఇద్దరికీ ఓర్పు, సహనం తక్కువ! ఉడుకురక్తం, ఇద్దరూ సంపాదనాపరులే కావటం, ఒకరి మీద మరొకరు అధికారం చలాయిస్తున్నారన్న భావన! చివరకు ఉండలేనంటూ హైదరాబాదుకు వచ్చేసింది తపతి.

మధ్యలో ఇరువైపుల పెద్దవాళ్లు కల్పించుకున్నారు. అయితే పిల్లల మీద ఉన్న ప్రేమతో, ఎవరి పిల్లల్ని వాళ్ళు ఏమీ అనలేదు. ఎటువంటి సలహాలు చెప్పలేదు! ఎవరి బిడ్డల్ని వాళ్ళు సపోర్ట్ చేసుకున్నారు.

అవతలి వాళ్ళదే తప్పంటూ ఆరోపించుకున్నారు.

ఎక్కడా ఎవ్వరూ తగ్గటం లేదు... విడాకులు అనివార్యమయ్యాయి!

హైదరాబాదులో ఉద్యోగంలో చేరింది తపతి.

అన్న, వదిన వచ్చారు. వికాస్ తల్లిదండ్రులతో తన చెల్లెలిని సపోర్ట్ చేస్తూ మాట్లాడిన సారంగ్, తర్వాత తపతి ఒంటరిగా ఉన్నప్పుడు "నువ్వు కాస్త సర్దుకుపోతే బాగుండేదేమో తపతీ! వికాసుకు నీకు మధ్య వచ్చినవి ఇగో ప్రాబ్లమ్స్! స్వతహాగా అతడు మంచివాడే! కాస్త ఓర్పు, సహనంగా ఉంటే బాగుండేది!" అన్నాడు నెమ్మదిగా.

దిగులు పడింది తపతి.

ఒకసారి మాధురికి ఒంట్లో బాగాలేదు. పది రోజులపాటు జబ్బు పడింది. జ్వరం, విరేచనాలతో నీరసించింది. ఆ సమయంలో తపతి వంట చేయటం మొదలుపెట్టింది.

వంటపని, ఇంటిపని, తల్లిని జాగ్రత్తగా చూసుకోవడం అంతా తపతి మీదే పడింది. మెల్లమెల్లగా పనులు చేయడం నేర్చుకుంటోంది. ఆఫీసుకు వారంరోజులు సెలవు పెట్టినా, తర్వాత తప్పక వెళ్లాల్సి వచ్చింది. ఎలాగైనా కాస్త ముందే లేచి గబగబా పనులన్నీ చేసుకొని, తల్లికి అన్నీ చేసి పెట్టి మరీ ఆఫీసుకు వెళ్లి వస్తోంది.

పదిహేనురోజులకు కాస్త అనుభవం వచ్చింది. ఇంటినీ, ఆఫీసును మేనేజ్ చేయడం అంత కష్టంగా లేదు.

'ఈ మాత్రం దానికేనా తను వికాస్‌తో వంతు పెట్టుకొని తగవులాడింది?'

అయినా బింకంగా 'వికాస్‌కి ప్రేమ ఎక్కడ ఉంది? తనకి ఎప్పుడైనా విలువ ఇచ్చాడా? ఒట్టి అహంకారపు వెధవ!' అనుకొని మనసుకు సర్ది చెప్పుకునేది.

ఒకరోజు తపతి ఫ్రెండ్ సాధన ఫోన్ చేసింది.

"మా బాబు బర్త్‌డే తపతీ! నువ్వు తప్పకుండా రావాలి! కాదూ కూడదంటే కుదరదు! నువ్వు రాకపోతే ఇంక నీతో కటీఫ్!" అంది సాధన నవ్వుతూ.

సాధన. తపతికి బెస్ట్ ఫ్రెండ్.

"సరే... సరే! వస్తాను! మరీ అంతా కోపం పెట్టుకోకు!" అంది తపతి కూడా నవ్వుతూ.

"ఇంకో విషయం తపతీ! బర్త్‌డేకు అందరం ట్రెడిషనల్‌గా చీరలే కట్టుకొందామని అనుకున్నాము! నువ్వు కూడా మంచి చీర కట్టుకొని, నగలు పెట్టుకుని రా!" అంది సాధన.

"అలాగే! అలాగే!" అంది తపతి.

కాస్త ఉత్సాహం వచ్చింది తపతికి.

సాధన కొడుకు బర్త్‌డేకు వెళ్దామని తయారవుతోంది తపతి.

ఏ చీర కట్టుకోవాలి?

బీరువాలో ఉన్న చీరలు చూస్తోంది తపతి.

"నువ్వు చీర కట్టుకుంటే ఎంత బాగుంటావో తెలుసా?" వెనక నుంచి వికాస్ గొంతు వినిపించినట్లు అనిపించింది. ఉలిక్కి పడింది తపతి.

'ఎన్నిసార్లు వికాస్ చెప్పినా తను ఒక్కసారన్నా అతడి మాట విన్నదా? ఈరోజు తన ఫ్రెండు చీర కట్టుకొని రమ్మంటే సంతోషంగా తయారవుతోంది! అదే వికాస్ చెప్తే దాష్టికం చేస్తున్నాడనుకుందా రోజు! చిన్న చిన్న విషయాలకే తను ఓవర్ రియాక్ట్ అయిందా? నిజంగా అన్నయ్య చెప్పినట్లు కొద్దిగా సర్దుకుపోతే బాగుండేదా?'

ఏదో పోగొట్టుకున్నట్లు... మనసులో బాధ. పూడ్చలేని వెలితి!

★★★

నాలుగురోజుల తర్వాత తపతిని మేనేజర్ పిలిచింది.

ప్రాజెక్టు వర్కులో భాగంగా చెన్నై వెళ్లిరావాలని. ఒక పదిమందిని సెలెక్ట్ చేసింది. ఊరి ప్రయాణం చేసి వస్తే కాస్త రిలీఫ్‌గా ఉంటుందని చెన్నై వెళ్లటానికి ఒప్పుకుంది తపతి.

కొలీగ్స్‌తో కలిసి చెన్నై చేరుకుంది. మొదటిరోజు సాయంత్రం దాకా ఆఫీస్ పని. కొలీగ్స్‌తోపాటు హోటల్‌రూమ్‌కి వచ్చింది. ఊరు చూద్దామని బయలుదేరారు అందరూ.

"ఇంతకు ముందు నేను చూశాను. మీరు వెళ్ళండి!"అంది తపతి.

మిగిలిన వాళ్ళు వెళ్లిపోయారు. వాళ్ళను వెళ్ళమందే కానీ తీరా వాళ్లందరూ వెళ్ళాక బోర్ కొట్టసాగింది తపతికి. 'వాళ్ళతో పాటే వెళ్లుంటే బాగుండేది!' అనుకుంటూ బయటికి వచ్చింది. 'పెళ్లయ్యాక వికాస్, తను చెన్నై వచ్చారు. ఊరు తిరుగుతూ అన్నానగర్ వచ్చి 'శ్రీగౌరీ కృష్ణ' రెస్టారెంట్‌లో దోసె తిన్నారిద్దరూ. తనకు రెండు పట్టుచీరలు కొన్నాడు వికాస్. ఆ రోజులు ఎంత బాగుండేవి!' ఆలోచిస్తూ ఆటో ఎక్కి 'అన్నానగర్ 'అంది తపతి.

అన్నానగర్ రాంగానే, "శ్రీగౌరీ కృష్ణ దగ్గర ఆపు!" అంది ఆటోవాడితో.

అదే రెస్టారెంట్. దిగి లోపలికి వెళ్ళింది. అక్కడ ఒక మూలగా కిటికీ ప్రక్కన టేబుల్. అక్కడే తామిద్దరూ కూర్చుని ఏవో కబుర్లు చెప్పుకున్నారు. ఆ టేబుల్ దగ్గరికి వెళ్లి కూర్చుంది. ఏదో పరిమళం. వికాస్‌కు జాస్మిన్ స్ప్రే ఇష్టం. బ్యాగ్ లోంచి స్ప్రే తీసి కాస్త ఒంటికి కొట్టుకొంది. సర్వర్ వచ్చాడు. దోసె ఒకటి ఆర్డరిచ్చింది. మళ్ళీ ఎడతెరపి లేకుండా వికాస్ ఆలోచనలు...

బయటికి చూస్తూ కూర్చుంది.

"అరే! తపతీ!"

మర్చిపోలేని కంఠం! తలెత్తిచూసింది తపతి.

ఆశ్చర్యం! వికాస్...

తను భ్రమపడుతుందేమో అనుకుంది.

అలాగే గుడ్లప్పగించి చూస్తోంది.

నిజం కాదేమో! అతడి ఆలోచనల్లో ఉండటం వలన కలిగిన భ్రాంతి కావచ్చు!

"ఫ్రెండ్ చెల్లెలి పెండ్లి. ఇక్కడికి వచ్చాను."

ఎదురుగ్గా కూర్చున్నాడు.

అప్పటికి స్పృహలోకి వచ్చింది తపతి.

"నేను... నేను ఆఫీస్ పని మీద..." మాటలు పెగలటంలేదు. గొంతు బొంగురుగా ఉంది.

అతడు ఆమె వైపు చూస్తున్నాడు. జాస్మిన్ స్ప్రే పరిమళం అతడిని చుట్టుముట్టింది.

కాసేపు ఇద్దరికీ మధ్య మాటల్లేవు.

చివరకు అతడే నోరువిప్పాడు.

"అత్తయ్య, మామయ్య ఎలా ఉన్నారు?"

"బాగానే ఉన్నారు."

సర్వర్ దోసె తెచ్చి ఇచ్చాడు.

సర్వర్‌ను మరొక దోసె తెమ్మంది తపతి.

నవ్వాడు వికాస్.

ఆమె కట్టుకున్న చీరను చూస్తున్నాడు.

అది వికాస్ కొనితెచ్చిన చీర. దొరికిపోయినట్లుగా ఉంది తపతికి.

తలవంచుకొని కూర్చుంది. సర్వర్‌ను పిలిచి రెండు ఫ్రూట్ సలాడ్స్ ఆర్డరిచ్చాడతడు. తపతికి ఫ్రూట్ సలాడ్ అంటే ఇష్టం.

"ఇప్పుడు వద్దు!" మొహమాటంగా ఉంది తపతికి.

"నీకు ఇష్టంకదా! ప్లీజ్ కాదనకు!" అతడి కళ్ళల్లోకి చూసింది. ఆ కళ్ళల్లో ఆత్మీయత తొణికిసలాడుతోంది. బేలగా చూసింది.

కళ్ళల్లో నీళ్లు ఊరుతున్నాయి. ఏవేవో జ్ఞాపకాలు... బ్యాగులోంచి రుమాలు తీసి కళ్ళు తుడుచుకొంది .

అతడు ఆమె చేతిమీద చెయ్యివేశాడు. ఆ స్పర్శ ఏదో ధైర్యాన్నిస్తోంది.

"సారీ! తపతీ! నన్ను క్షమించు! నేను చాలా తొందరపడ్డాను! నేను ఫూలిష్‌గా బిహేవ్ చేశాను! సారీ!"

తపతికి దుఃఖం పొంగుకు వచ్చింది. ఎంతైనా ఆరునెలలు కలిసి ఉన్న బంధం.

అది రెస్టారెంట్ అని, అందరూ చూస్తున్నారని కూడా గమనించకుండా ఏడవసాగింది.

వికాస్ ఆమె ప్రక్కన వచ్చి కూర్చున్నాడు. ఆమె భుజాలు పట్టుకొని దగ్గరికి తీసికొన్నాడు. అతడి హృదయం మీద తలపెట్టుకొని ఏడవసాగింది తపతి.

ఆమె తలను నిమురుతూ కూర్చున్నాడు వికాస్.

★★★

ఒక నెల తర్వాత.

మళ్ళీ కాపురం మొదలు.

ప్రొద్దున లేచి చకచకా పనులు చేసుకొంటోంది తపతి.

తపతి అడగకుండానే, తను కూడా సగం పని చేస్తున్నాడు వికాస్.

"ఈరోజు నాకు మధ్యాహ్నం దాకానే ఆఫీసులో పని. త్వరగా వచ్చేస్తున్నాను. సాయంత్రానికి పూరీ, కూర చేస్తున్నా!" వికాస్‌కు ఫోన్ చేసింది తపతి.

"నేను కూడా త్వరగా వచ్చేస్తాను! మరీ పూరీ కూరా అంటూ రొస్టు పడకబ్బా! కాస్త మాల్‌కు వెళ్లి తిరిగి, బయట తిని వద్దాం!"

నవ్వుతూ బదులిచ్చాడు వికాస్.

"నువ్వు వచ్చేసరికి రెడీగా ఉంటాను! ఏ చీర కట్టుకోను? పింక్ కలరా! మొన్న కొన్న బ్లూ శారీనా?"

"నీ ఇష్టం! సౌకర్యంగా జీన్స్ వేసుకో! అయినా నువ్వు చీర కట్టుకుంటే ఆ అందమే వేరు!"

వికాస్ మాటలకు నవ్వింది తపతి.

ఇప్పుడు వాళ్ళ సంసారం సజావుగా సాగుతోంది. కాస్త సర్దుకుపోతే జీవితం ఎంత హాయిగా ఉంటుందో తెలిసి వచ్చిందా జంటకు!

# కథామంజరి

నెల నెలా ఉచిత సంచిక కోసం

ఇక్కడ నొక్కండి